



www.andhrajyothy.com


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



బుధవారం | 3-12-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 228 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం, తిథి: త్రయోదశి మ.12.26 తదుపరి చతుర్దశి, నక్షత్రం: భరణి రా.6.00 తదుపరి కృత్తిక, వర్జ్యం: శేషం ఉ.6.43, తె.4.27-5.50, దుర్ముహూర్తం: ఉ.11.42-12.26, అమృతఘడియలు: మ.1.46-3.10, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 6.34, సూర్యాస్తమయం: 5.35 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





క్వార్టర్స్‌లో యువ భారత్

జూనియర్ హాకీ ప్రపంచకప్

మధురై: జూనియర్ పురుషుల హాకీ వరల్డ్‌కప్‌లో భారత యువ జట్టు క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రవేశించింది. మంగళవారం జరిగిన తమ గ్రూప్-బి ఆఖరి మ్యాచ్‌లో భారత్ 5-0తో స్విట్జర్లాండ్‌ను చిత్తుచేసింది. మన్మీత్ (2వ నిమిషం, 11వ), శార్దానంద్ తివారీ (13వ., 54వ) చెరో రెండు గోల్స్, అర్షదీప్ సింగ్ (28వ) ఒక గోల్ చేశారు. దీంతో తన గ్రూప్‌లో ఆడిన మూడు మ్యాచ్‌లనూ నెగ్గిన భారత్.. 9 పాయింట్లతో టాపర్‌గా నిలిచి క్వార్టర్స్ బెర్త్ ఖాయం చేసుకుంది. ఇక, గ్రూప్-డి నుంచి స్పెయిన్, బెల్జియం క్వార్టర్స్ చేరాయి. స్పెయిన్ తమ ఆఖరి పూల్ మ్యాచ్‌లో 13-0తో నమీబియాపై, బెల్జియం 10-0తో ఈజిప్టుపై గెలిచాయి. గ్రూప్-ఈలో 11-0తో ఆస్ట్రియాపై భారీ విజయాన్ని సాధించిన నెదర్లాండ్స్ క్వార్టర్‌ఫైనల్స్‌కు అర్హత సాధించింది.

'హజారే' బరిలో కోహ్లీ

న్యూఢిల్లీ: దాదాపు 15 ఏళ్ల తర్వాత దేశవాళీ టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో ఆడేందుకు టీమిండియా స్టార్ విరాట్ కోహ్లీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఈనెల 24 నుంచి జరిగే హజారే టోర్నీలో తలపడే ఢిల్లీ జట్టు సెలెక్షన్‌కు అందుబాటులో ఉంటానని కోహ్లీ తమకు సమాచారం ఇచ్చాడని ఢిల్లీ డిస్ట్రిక్ట్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు రోహన్ జైట్లీ మంగళవారం వెల్లడించాడు. బెంగళూరులో జరిగే తమ తొలి మ్యాచ్‌లో ఆంధ్ర జట్టుతో ఢిల్లీ తలపడనుంది. వన్డే ఫార్మాట్‌లో జరిగే ఈ టోర్నీలో ఢిల్లీ మొత్తం ఆరు మ్యాచ్‌లు ఆడనుండగా.. కోహ్లీ ఎన్ని మ్యాచ్‌ల్లో బరిలోకి దిగుతాడన్నది స్పష్టత లేదు. కాగా, కోహ్లీ హజారే టోర్నీలో చివరిసారిగా 2010 ఫిబ్రవరిలో ఆడాడు.

సిరీస్ ఇక్కడే

- జోష్‌లో టీమిండియా
- గెలుపే ధ్యేయంగా సఫారీలు
- నేడు రెండో వన్డే

పట్టేస్తారా!

రాయ్‌పూర్: దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో వెటరన్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ అదిరే ఆటతో ఈ సిరీస్‌పై ఆసక్తిని అమాంతం పెంచేశారు. వీరి జోరుతోనే రాంచీలో భారత్ బోణీ చేయగలిగింది. ఇక మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా బుధవారం కీలకమైన రెండో మ్యాచ్ జరుగనుంది. మరోసారి అందరి చూపు ఈ స్టార్ బ్యాటర్లపైనే ఉంటుందనడంలో సందేహం లేదు. తమ ఆట మరెవరికో సమాధానమన్నట్టుగా చెలరేగుతున్న రో-కో తమ ధాటిని కొనసాగించాలనుకుంటున్నారు. ఆ ఊపులోనే సిరీస్‌ను కూడా టీమిండియా ఖాతాలో వేసుకోవాలనుకుంటోంది. అదే జరిగితే, టెస్టు సిరీస్ వైట్‌వాష్‌కు ఈ ఫలితంతో కాస్త ఉపశమనం లభిస్తుంది. సఫారీలు మాత్రం కసి మీదున్నారు. సిరీస్‌లో నిలవాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్ కావడంతో పట్టు వదలకూడదనే భావనలో వారు ఉన్నారు.

యువ బ్యాటర్లు రాణిస్తే..

ఆస్ట్రేలియా గడ్డపై శతకంతో మెరిసిన రోహిత్ ఈ సిరీస్ తొలి మ్యాచ్‌లో అర్ధసెంచరీతో మెరిశాడు. ఈ నేపథ్యంలో అతను రాయ్‌పూర్‌లో మరింతగా చెలరేగి శతకం బాదాలని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. ఇక విరాట్ తొలి వన్డేలో తన సహజశైలికి భిన్నంగా ఎదురుదాడికి దిగి సరికొత్త ఆటను చూపాడు. సిక్సర్లకు దూరంగా ఉండే అతను రాంచీలో ఏకంగా ఏడు బంతులను బౌండరీ దాటించాడు. కోహ్లీ మరోసారి సఫారీ బౌలర్లపై అదే ధాటిని కొనసాగిస్తే జట్టు సిరీస్‌ను పట్టేయడం ఖాయం. 2027 వన్డే వరల్డ్ కప్‌లో చోటు ఆశిస్తున్న రో-కోకు ప్రతీ మ్యాచ్ పరీక్ష లాంటిదే. ఇక, ఓపెనర్ జైస్వాల్‌తో పాటు మిడిల్డార్‌లో రుతురాజ్ తమకు దక్కిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాల్సి ఉంది. బ్యాటింగ్ స్థానాల్లో మార్పులు అంతగా ఫలితాన్ని ఇవ్వలేదు. నెంబర్-4లో రుతురాజ్, ఐదో స్థానంలో వాషింగ్టన్ సుందర్ ఆకట్టుకోలేకపోయారు. కెప్టెన్ రాహుల్, జడేజా బ్యాటింగ్‌లో మెరవడం సానుకూలాంశం. బౌలింగ్‌లో స్పిన్నర్ కుల్దీప్ 4 వికెట్లు తీసినా పరుగులు మాత్రం ధారాళంగా ఇచ్చుకున్నాడు.



మధ్యాహ్నం 1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

ప్రాక్టీస్‌లో కోహ్లీ, జైస్వాల్



జట్టులోకి కెప్టెన్ బవుమా

తొలి వన్డేలో 350 పరుగుల లక్ష్యం ముందున్నా సౌతాఫ్రికా బ్యాటర్లు అంత సులువుగా మ్యాచ్‌ను వదల్లేదు. 130/5 స్కోరుతో భారీ ఓటమి ఖాయమే అనుకున్న దశలో.. బ్రీట్‌స్కే, యాన్సెన్, బాష్‌ల అసాధారణ ఆట తీరుతో ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠగానే సాగింది. తేడా కేవలం 17 పరుగులే కావడం పర్యాటక జట్టులోనూ ఆత్మవిశ్వాసాన్ని పెంచేదే. అందుకే సఫారీలు రెండో వన్డేలో గెలుపు తమదే అవ్వాలనుకుంటున్నారు. దీనికి తోడు కెప్టెన్ బవుమాతో పాటు స్పిన్నర్ కేశవ్ మహరాజ్ జట్టులో చేరారు. దీంతో ఓపెనర్ రికెల్టన్, సుబ్రయేన్ బెంచీకే పరిమితం కానున్నారు.

తుది జట్లు (అంచనా)

భారత్: జైస్వాల్, రోహిత్, విరాట్, రుతురాజ్, సుందర్, రాహుల్ (కెప్టెన్), జడేజా, హర్షిత్, కుల్దీప్, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్.

దక్షిణాఫ్రికా: డికాక్, మార్‌క్రమ్, బవుమా (కెప్టెన్), బ్రీట్‌స్కే, డి జోర్జి, బ్రెవిస్, యాన్సెన్, బాష్, కేశవ్, బర్గర్, బార్ట్‌మన్.

పిచ్

రాయ్‌పూర్‌లో కేవలం ఒక్క అంతర్జాతీయ వన్డే మాత్రమే జరిగింది. రెండేళ్ల క్రితం కివీస్‌తో జరిగిన ఆ మ్యాచ్‌లో భారత పేసర్లు చెలరేగి 108కే కట్టడి చేశారు. ఈసారి కూడా పేస్, స్పిన్‌కు అనుకూలంగా ఉండనుంది. మంచు ప్రభావం చూపే అవకాశం ఉంది.

ఆ వరల్డ్ కప్‌లో రోహిత్ ఆడినప్పుడు నేను పాఠశాల విద్యార్థిని

"వన్డే సిరీస్ కోసం రోహిత్, విరాట్ చేరడంతో భారత జట్టులో ఒక్కసారిగా బలం పెరిగింది. నిస్సందేహంగా ఆ ఇద్దరికీ అపార అనుభవంతో పాటు అద్భుత నైపుణ్యం ఉంది. కచ్చితంగా ఇది భారత్‌కు సానుకూలాంశమే. అయితే మాకు ఆ ఇద్దరితో ఆడిన అనుభవం ఉంది. వాస్తవానికి రోహిత్ 2007లో టీ20 వరల్డ్‌కప్ ఆడుతున్నప్పుడు నేనింకా పాఠశాలలో చదువుతున్నా."

\- టెంబా బవుమా

పాండ్యా ఫామ్‌లోకి..



పంజాబ్‌పై బరోడా గెలుపు

హైదరాబాద్: గాయం నుంచి కోలుకొన్న టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా (42 బంతుల్లో 77 నాటౌట్) పునరాగమనంలో అజేయ అర్ధ శతకంతో అదరగొట్టాడు. దీంతో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ గ్రూప్-సిలో భాగంగా మంగళవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో బరోడా 7 వికెట్లతో పంజాబ్‌ను చిత్తు చేసింది. తొలుత పంజాబ్ 20 ఓవర్లలో 222/8 స్కోరు చేసింది. అన్‌మోల్ ప్రీత్ (69), అభిషేక్ శర్మ (50) హాఫ్ సెంచరీలు వృథా అయ్యాయి. ఛేదనలో బరోడా 19.1 ఓవర్లలో 224/3 స్కోరు చేసి గెలిచింది. విష్ణు సోలంకి (43) రాణించాడు. శివాలిక్ శర్మ (47)తో కలసి మూడో వికెట్‌కు 101 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన పాండ్యా.. మరో ఐదు బంతులు మిగిలుండగానే జట్టును గెలిపించాడు.

వైభవ్ రికార్డు శతకం వృథా



కోల్‌కతా: చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ (61 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్స్‌లతో 108) శతకంతో చెలరేగినా.. బిహార్‌కు ఓటమి తప్పలేదు. పృథ్వీ షా (66) దూకుడుగా ఆడడంతో.. గ్రూప్-బిలో జరిగిన మ్యాచ్‌లో మహారాష్ట్ర 3 వికెట్లతో బిహార్‌పై నెగ్గింది. తొలుత బిహార్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 176 పరుగులు చేయగా.. లక్ష్యాన్ని మహారాష్ట్ర 19.1 ఓవర్లలో 182/7 స్కోరు చేసి ఛేదించింది. కాగా, 'ముస్తాక్ అలీ'లో సెంచరీ చేసిన పిన్న వయస్కుడిగా 14 ఏళ్ల వైభవ్ చరిత్ర సృష్టించాడు. ఈ క్రమంలో 2013లో మహారాష్ట్ర బ్యాటర్ విజయ్ జోల్ (18 ఏళ్ల 111 రోజులు) రికార్డును వైభవ్ అధిగమించాడు.

రైల్వేస్‌పై ఆంధ్ర గెలుపు

లఖ్‌నవూ: అశ్విన్ హెబ్బార్ (78) ధనాధన్ అర్ధ శతకంతో అదరగొట్టడంతో.. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఆంధ్ర మూడో విజయాన్ని నమోదు చేసింది. గ్రూప్-ఎలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర 5 వికెట్లతో రైల్వేస్‌ను ఓడించింది. తొలుత రైల్వేస్ 20 ఓవర్లలో 167/7 స్కోరు చేసింది. ఉపేంద్ర (55), రవి సింగ్ (49) పోరాటం వృథా అయింది. సత్యనారాయణ రాజు 3 వికెట్లు తీశాడు. ఛేదనలో ఆంధ్ర 19.3 ఓవర్లలో 173/5 స్కోరు చేసి గెలిచింది. ప్రసాద్ (39 నాటౌట్), పాండురంగ రాజు (25) దూకుడుగా ఆడారు. కోల్‌కతాలో జరిగిన గ్రూప్-బి మ్యాచ్‌లో హైదరాబాద్ 3 వికెట్లతో యూపీపై గెలిచింది.

న్యూజిలాండ్ 231/9

క్రైస్ట్‌చర్చ్: వెస్టిండీస్‌తో మంగళవారం మొదలైన తొలి టెస్టులో ఆతిథ్య న్యూజిలాండ్ ఆట ముగిసే సరికి మొదటి ఇన్నింగ్స్‌లో 231/9 స్కోరు సాధించింది. ఏడాది విరామం తర్వాత ఈ ఫార్మాట్‌లో ఆడిన మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ (52)తో పాటు బ్రేస్‌వెల్ (47) రాణించాడు. మ్యాచ్‌కు పలుమార్లు వర్షం అంతరాయం కలిగించింది. ఓజే షీల్డ్స్, గ్రీవ్స్, రోచ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ప్రస్తుతం క్రీజులో ఫౌకెస్ (4), డఫీ (4) ఉన్నారు.

వేలానికి మ్యాక్స్‌వెల్ దూరం



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ మ్యాక్స్‌వెల్ ఐపీఎల్‌కు దూరమైనట్టే. డిసెంబరు 16న జరిగే మినీ వేలంలో తన పేరును నమోదు చేసుకోలేదని 37 ఏళ్ల మ్యాక్సీ ప్రకటించాడు. ఐపీఎల్‌తో తనకెన్నో మధురానుభూతులున్నాయని, అయితే ఈ ఏడాది వేలంలో ఉండకూడదని నిర్ణయించుకున్నట్టు, త్వరలోనే మళ్లీ ఆడతానేమోనని ఇన్‌స్టాలో తెలిపాడు. ఇక.. ఈ ఏడాది జరిగిన లీగ్‌లో పంజాబ్‌కు ఆడిన మ్యాక్సీ ఏడు మ్యాచ్‌ల్లో 48 పరుగులే చేశాడు. పేలవ ఫామ్‌తో పాటు కెరీర్ చరమాంకంలో ఉన్న మ్యాక్సీని ఏ జట్టూ కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపకపోవచ్చని విశ్లేషకుల అంచనా.

బంగ్లాదేశ్‌దే టీ20 సిరీస్

ఛట్టోగ్రామ్: ఐర్లాండ్‌తో మూడు టీ20ల సిరీస్‌ను బంగ్లాదేశ్ 2-1తో దక్కించుకుంది. మంగళవారం ఆఖరిదైన మూడో మ్యాచ్‌లో బంగ్లా 8 వికెట్లతో నెగ్గింది. మొదట ఐర్లాండ్ 19.5 ఓవర్లలో 117 రన్స్‌కే కుప్పకూలింది. కెప్టెన్ స్టిర్లింగ్ (38) టాప్‌స్కోరర్. అలాగే ఒకే టీ20 మ్యాచ్‌లో ఐదు క్యాచ్‌లు అందుకున్న ఫీల్డర్‌గా వెడగె (మాల్దీవ్స్), సెడిక్ సహక్ (స్వీడన్) సరసన తన్‌జీద్ హసన్ నిలిచాడు. ఆ తర్వాత స్వల్ప ఛేదనలో బంగ్లా 13.4 ఓవర్లలో 119/2 స్కోరుతో గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', ఓపెనర్ తన్‌జీద్ హసన్ (55 నాటౌట్), పర్వేజ్ (33 నాటౌట్) రాణించారు.

డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికలపై.. బజ్‌రంగ్, వినేష్ పిటిషన్ల కొట్టివేత

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) ఎన్నికలను సవాల్ చేస్తూ రెజ్లర్లు బజ్‌రంగ్ పూనియా, వినేష్ ఫొగట్, సత్యవర్త్ కడియాన్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు మంగళవారం కొట్టివేసింది. వాయిదాలకు హాజరై తమ వాదనలు వినిపించాలని కోర్టు పలుమార్లు నోటీసులు జారీ చేసినా.. వీరు హాజరుకాలేదు. దీంతో ప్రత్యర్థికి అనుకూలంగా తీర్పు వెలువరించింది. 2023 డిసెంబరులో డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికలు నిర్వహించగా అధ్యక్ష పదవికి ఈ ముగ్గురూ బలపర్చిన అభ్యర్థి అనితా షెరాన్‌పై సంజయ్ సింగ్ గెలిచాడు. అయితే, ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించలేదని రెజ్లర్లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

బిజినెస్



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,30,200 ▼	1,19,350 ▼	1,96,000 ▲
విజయవాడ	1,32,200 ▼	1,20,000 ▼	1,80,000 ▲
విశాఖపట్నం	1,32,110 ▼	1,19,350 ▲	1,96,000 ▲
రాజమండ్రి	1,30,200 ▼	1,19,350 ▼	1,79,000 ▲
ప్రొద్దుటూరు	1,27,900 ▲	1,17,670 ▲	1,75,000 ▲
ముంబై	1,27,593 ▼	1,16,875 ▼	1,74,650 ▼

జోస్ అలుక్కాస్ శుభ మాంగళ్యం వెడ్డింగ్ కలెక్షన్



హైదరాబాద్: జోస్ అలుక్కాస్.. వివాహాల సీజన్‌ను పురస్కరించుకుని 'శుభ మాంగళ్యం' పేరుతో వెడ్డింగ్ కలెక్షన్‌ను తీసుకువచ్చింది. ఈ కలెక్షన్‌ను సంస్థ బ్రాండ్ అంబాసిడర్ కీర్తి సురేశ్ ఆవిష్కరించారు. సాంప్రదాయ, అధునాతన డిజైన్ల మేళవింపుతో జోస్ అలుక్కాస్ ఈ కలెక్షన్‌ను రూపొందించింది. దక్షిణ భారతంలోని ఆలయాల్లోని శిల్పకళ స్ఫూర్తితో శుభ మాంగళ్యం వివాహ కలెక్షన్‌ను రూపొందించినట్లు జోస్ అలుక్కాస్ ఎండీ పాల్ అలుక్కాస్ తెలిపారు. ప్రతి ఆభరణం బీఐఎస్ హెచ్‌యూఐడీ సర్టిఫికేషన్‌ను కలిగి ఉంటాయన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని జోస్ అలుక్కాస్ ఈ కలెక్షన్ అందుబాటులో ఉండనుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



3వ తేదీ			
హైదరాబాద్	645	విజయవాడ	670
వరంగల్	647	గోదావరి	645
చిత్తూరు	663	విశాఖపట్నం	640
		డజను గుడ్లు రూ. 90	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	122	విజయవాడ	118
వరంగల్	122	గుంటూరు	125
కరీంనగర్	122	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	122	చిత్తూరు	113
కర్నూలు	122	నెల్లూరు	118
విశాఖపట్నం	117	అనంతపురం	118
గోదావరి	118		



ఇంట్రాడేలో రూ. 90కి డాలర్-రూపీ మారకం
43 పైసల నష్టంతో రూ. 89.96 వద్ద ముగింపు

ముంబై: దేశీయ కరెన్సీ సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ ఒక దశలో 47 పైసలు క్షీణించి తొలిసారిగా రూ.90 మైలురాయికి చేరింది. చివరికి 43 పైసల నష్టంతో రూ.89.96 వద్ద ముగిసింది. ఇది ఆల్‌టైమ్ కనిష్ఠ ముగింపు కూడా. అంతర్జాతీయంగా డాలర్ బలపడటం, దిగుమతిదారుల నుంచి అమెరికన్ కరెన్సీకి డిమాండ్ పెరగడం, ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ పెట్టుబడులు తరలిపోతుండటం, స్పెక్యులేషన్ ట్రేడర్ల షార్ట్ కవరింగ్ మన కరెన్సీపై ఒత్తిడి పెంచాయని ఫారెక్స్ వర్గాలు తెలిపాయి. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం జాప్యమవుతుండటం, వాణిజ్య లోటు ఆందోళనలు కూడా ఇందుకు మరో కారణమని వారన్నారు. ఈ ఏడాదిలో రూపాయి విలువ 5 శాతం మేర క్షీణించింది. ఆసియాలోకెల్లా అత్యధికంగా నష్టపోయిన కరెన్సీ మనదే.

సంవత్సరం	మారకం రేటు (రూ.)	సంవత్సరం	మారకం రేటు (రూ.)
1947	3.30	2005	44.10
1948	3.31	2010	45.73
1949	3.67	2014	62.33
1950	4.76	2015	62.97
1955	4.76	2016	66.46
1960	4.76	2017	67.79
1965	4.76	2018	70.09
1970	7.50	2019	70.39
1975	8.38	2020	76.38
1980	7.86	2021	74.57
1985	12.37	2022	81.35
1990	17.50	2023	81.94
1991	22.74	2024	84.83
1995	32.43	2025	89.96
2000	44.94		(ప్రస్తుతం)

మున్ముందు మరింత క్షీణత

"డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటుకు రూ.90 ప్రధాన నిరోధక స్థాయిగా ఉండనుంది. ఒకవేళ ఈ స్థాయిని కూడా అధిగమిస్తే, ఎక్స్ఛేంజ్ రేటు రూ.91 లేదా ఆపై దిశగా పయనించవచ్చ"ని కోటక్ సెక్యూరిటీస్ కమోడిటీ అండ్ కరెన్సీ విభాగ అధిపతి అనింద్య బెనర్జీ అభిప్రాయపడ్డారు. ప్రస్తుత తరుణంలో రూపాయిని ఆదుకునేందుకు ఫారెక్స్ కార్యకలాపాల్లో ఆర్‌బీఐ జోక్యం చేసుకోవాలని, లేదంటే కరెన్సీ విలువ మరింత పతనం కావచ్చని, అది మారకం విలువలో తీవ్ర హెచ్చుతగ్గులకు కూడా దారితీయవచ్చని ఆయన పేర్కొన్నారు. కాగా, ఫెడ్ రేట్ల తగ్గింపు అవకాశాలు, ఆర్‌బీఐ జోక్యంతో రూపాయికి మద్దతు లభించవచ్చని, మున్ముందు సెషన్లలో డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు రూ.89.60-90.20 శ్రేణిలో కదలాడవచ్చని మిరే అసెట్ షేర్‌ఖాన్ రీసెర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌదరి అన్నారు.

78 ఏళ్ల స్వతంత్ర భారతంలో రూ.3.30 నుంచి రూ.90 వరకు..

భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన ఏడాది (1947)లో రూ.3.3గా ఉన్న డాలర్-రూపాయి మారకం విలువ.. 1990 దశకం వరకు చాలా నెమ్మదిగానే తగ్గుతూ వచ్చింది. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు హయాంలో (1991) తొలి తరం ఆర్థిక సంస్కరణలు చేపట్టినప్పటి నుంచి రూపాయి విలువ వేగంగా కరుగుతూ వచ్చింది. నరేంద్ర మోదీ తొలిసారి అధికారంలోకి వచ్చిన 2014లో రూ.62 స్థాయిలో ఉన్న రూపాయి మారకం విలువ.. గడిచిన 11 ఏళ్లలో మరింత వేగంగా క్షీణిస్తూ వచ్చింది. ఏటేటా పెరుగుతూ వస్తున్న వాణిజ్య లోటు, ముడి చమురు, పసిడి సహా పలు దిగుమతులపై ఆధారం పెరగడం, అధిక ధరలు వంటి అంశాలు ఇందుకు కారణమయ్యాయి.

నెలాఖరుకి కిలో వెండి రూ.2 లక్షలు

- ఈటీఎఫ్‌ల కొనుగోళ్లే దన్ను
- 11 నెలల్లో రెట్టింపైన వెండి ధర
- కేడియా అడ్వైజరీ

న్యూఢిల్లీ: వెండి ధర రేసుగుర్రంలా పరుగెడుతోంది. గత 11 నెలల్లోనే దేశీయ మార్కెట్లో పసిడి ధర 60 శాతం పెరిగితే.. వెండి ధర ఏకంగా రెట్టింపై ఇన్వెస్టర్లకు బంపర్ లాభాలు పంచింది. మల్టీ కమోడిటీస్ ఎక్స్ఛేంజీ (ఎంసీఎక్స్)లో చూసినా గత పది రోజుల్లోనే వెండి ధర దాదాపు 20 శాతం పెరిగింది. తెలుగు రాష్ట్రాల్లో కిలో వెండి ఇప్పటికే రూ.1.8 లక్షల మార్కును అధిగమించింది. ఢిల్లీలో మంగళవారం ఒక్క రోజే కిలో వెండి రూ.4,360 లాభంతో రూ.1,81,360 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లోనూ ఔన్స్ (31.10 గ్రాములు) వెండి 57 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. దీంతో ఈ నెలాఖరుకల్లా దేశీయ మార్కెట్లో కిలో వెండి ధర రూ.2 లక్షల మార్క్‌కు చేరే అవకాశం ఉందని కేడియా అడ్వైజరీ అనే సంస్థ ఒక నివేదికలో తెలిపింది. కాగా ఐషేర్స్ సిల్వర్ ట్రస్ట్ అనే సంస్థ ఒక్కటే గత వారం రోజుల్లో 324 టన్నుల వెండి కొనుగోలు చేసింది. ఈ ఏడాది జూలై నుంచి చూస్తే లండన్ వాల్ట్స్‌లో ఈటీఎఫ్‌ల వెండి నిల్వలు 47.5 శాతం పెరిగాయి.

మూడో రోజూ నష్టాలే..

సెన్సెక్స్ 504 పాయింట్లు డౌన్

ముంబై: స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా మూడో రోజూ నష్టపోయాయి. సెన్సెక్స్ 503.63 పాయింట్లు పతనమై 85,138.27 వద్దకు జారుకుంది. నిఫ్టీ 143.55 పాయింట్లు కోల్పోయి 26,032.20 వద్ద ముగిసింది. ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.2.06 లక్షల కోట్లు తగ్గి రూ.472.46 లక్షల కోట్లకు పడిపోయింది. మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లలో అమ్మకాలతో పాటు విదేశీ సంస్థాగత పెట్టుబడుల నిరవధిక ఉపసంహరణ, రూపాయి క్షీణత ఇందుకు కారణమయ్యాయి. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 21 నష్టపోగా.. యాక్సిస్ బ్యాంక్ షేరు 1.29 శాతం తగ్గి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది.

వేక్‌ఫిట్ ఐపీఓ ధరల శ్రేణి రూ.185-195: హోమ్ అండ్ ఫర్నిషింగ్ కంపెనీ వేక్‌ఫిట్ ఇన్నోవేషన్స్ లిమిటెడ్ రూ.1,289 కోట్ల ఐపీఓ ఈ నెల 8న ప్రారంభమై 10న ముగియనుంది. ఇష్యూ ధరల శ్రేణిని కంపెనీ రూ.185-195గా నిర్ణయించింది.

ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ కీలక బ్యాంకులు

ఆర్‌బీఐ

ముంబై: సంస్థాగతంగా చూస్తే ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంకులు దేశంలో అత్యంత ప్రధానమైన బ్యాంకుల (డీ-ఎస్ఐబీ)ని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మరోసారి తెలిపింది. అనుకోకుండా తలెత్తే రిస్కులను (నష్ట భయాలు) తట్టుకునేందుకు ఈ మూడు బ్యాంకులు తమ కీలక మూలధన నిల్వలను మరింత పెంచుకోవాల్సిన అవసరం ఉందని తెలిపింది. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న కీలక బ్యాంకులను ఆర్‌బీఐ 2015 నుంచి డీ-ఎస్ఐబీలుగా ప్రకటిస్తోంది. ఇలాంటి బ్యాంకుల్లో ఎలాంటి సంక్షోభం తలెత్తినా ఆ ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపైనా ఉంటుంది. దీంతో ఈ మూడు బ్యాంకుల్లో సంస్థాగతంగా ఎలాంటి లోపాలు తలెత్తకుండా ఆర్‌బీఐ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటుంది.

ట్రంప్ సుంకాలతో బేఫికర్

3.2 శాతానికి పెరగనున్న ప్రపంచ జీడీపీ : ఓఈసీడీ

వాషింగ్టన్: ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ట్రంప్ సుంకాల ప్రభావం ఈ సంవత్సరం భయపడినంత స్థాయిలో ఉండక పోవచ్చని ప్రపంచంలోని 38 సంపన్న దేశాలకు ప్రాతినిధ్యం వహించే ఆర్థిక సహకారం, అభివృద్ధి సంస్థ (ఓఈసీడీ) ఒక నివేదికలో తెలిపింది. కొన్ని ఇబ్బందులు ఉన్నా ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ హుషారుగానే ఉందని పేర్కొంది. దీంతో ఈ ఏడాది ప్రపంచ జీడీపీ వృద్ధి రేటు 3.2 శాతం వరకు ఉండొచ్చని అంచనా వేసింది. ఈ ఏడాది జూన్‌లో అంచనా వేసిన 2.9 శాతం కంటే ఇది 0.3 శాతం ఎక్కువ. భారత జీడీపీ వృద్ధి రేటు కూడా ఈ ఏడాది గత ఏడాది కంటే 0.2 శాతం పెరిగి 6.7 శాతానికి చేరే అవకాశం ఉందని తెలిపింది. చైనా జీడీపీ వృద్ధి రేటు మాత్రం గత ఏడాదిలా ఈ సంవత్సరం కూడా 5 శాతం వద్ద కొనసాగే అవకాశం ఉందని తెలిపింది.

ప్రైవేటు పరపతిపై జర జాగ్రత్త

ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్

సింగపూర్: ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోతున్న ప్రైవేటు రుణాలపై భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ ఆందోళన వ్యక్తం చేశారు. అడ్డూ అదుపు లేకుండా పెరిగిపోతున్న ఈ రుణాలతో కొంప కొల్లేరయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సింగపూర్‌లో జరిగిన 'క్లిఫోర్డ్ క్యాపిటల్ ఇన్వెస్టర్స్ డే' సమావేశంలో ఆయన ఈ హెచ్చరిక చేశారు. అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపుతో నిధుల లభ్యత పెరిగి ఈ ప్రమాదం మరింత పెరిగిందన్నారు. బ్యాంకులతో పోలిస్తే ప్రైవేటు పరపతి సంస్థలపై కేంద్ర బ్యాంకులకు పెద్దగా నియంత్రణలు ఉండక పోవడమే ఇందుకు ప్రధాన కారణమన్నారు. ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు, భారీగా అందుబాటులో ఉన్న ప్రైవేటు పరపతితో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అనేక ప్రమాదాలు పొంచి ఉన్నట్టు రాజన్ తెలిపారు.

అంతా భ్రమ: పెరుగుతున్న ప్రైవేటు కంపెనీల లాభాలు, కృత్రిమ మేధ (ఏఐ) విజయ గాథలతో ఈ ప్రైవేటు రుణ వితరణ బూమ్ నిరవధికంగా కొనసాగుతుందనే భ్రమలో ప్రస్తుత ప్రపంచం ఉందని రాజన్ తెలిపారు. విచ్చలవిడిగా ప్రైవేటు రుణ వితరణ పెరగడం ఆర్థిక వ్యవస్థల్లో గాలి బుడగలు ఏర్పడేందుకు సరైన సమయం అనే విషయాన్ని గుర్తించాలన్నారు. బ్యాంకింగ్ రంగంతో పోలిస్తే ప్రైవేట్ రుణ సంస్థలపై పెద్దగా నియంత్రణలు ఉండకపోవడమే ఇందుకు కారణమన్నారు. ఈ కారణంగా అధిక రుణాలు లేదా నిధుల కొరత సమయాల్లో ప్రైవేటు పరపతి సంస్థలకు కేంద్ర బ్యాంకుల నుంచి నేరుగా ఎలాంటి సాయం అందదన్నారు.

సంచార్ సాథీ తప్పనిసరి కాదు

వద్దనుకుంటే ఫోన్ నుంచి డిలీట్ చేసుకోవచ్చు

ప్రజలకు సైబర్ భద్రత కోసమే యాప్ తెచ్చాం

కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా

ప్రజల గోప్యత హక్కును హరించేందుకే

సంచార్ సాథీ యాప్: ప్రియాంకా గాంధీ

బీజేపీ పాలనలో నిఘా నీడలోకి దేశం: ఖర్గే

దీనిపై పార్లమెంటులో మాట్లాడతా: రాహుల్ 9

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



బుధవారం | 3-12-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విజయవాడ సిటీ

పాఠశాలల్లోకి అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు

సుదీర్ఘకాలం తర్వాత తాత్కాలిక టీచర్ల విధానం

1,146 మంది నియామకానికి అనుమతి

ఈ నెల 8 నుంచి ఐదు నెలల పాటు విధుల్లోకి.. 7

ఎస్ఏలకు 12,500, ఎస్జీటీలకు 10 వేల పారితోషికం



రెండో విడతకు సై

రాజధానికి మరో 20,494 ఎకరాలు

సీఆర్డీయేకు సమీకరణ బాధ్యతలు

రెండు జిల్లాలు, ఏడు గ్రామాల్లో ప్రక్రియ

రైతుల నుంచి 16,666.57 ఎకరాలు 11

ప్రభుత్వ భూములు 3,828 ఎకరాల సమీకరణ

పోలీసు శాఖలో ఉద్యోగం చేస్తావా?

మంచి జీతం కూడా ఇస్తాం.. 'ఐ బొమ్మ' రవికి పోలీసుల ఆఫర్!

సున్నితంగా తిరస్కరించిన రవి.. కరేబియన్ దీవుల్లో 'ఐ బొమ్మ' రెస్టారెంట్ పెడతా

ఆంధ్ర, తెలంగాణ వంటలను రుచి చూపిస్తా.. వచ్చే డబ్బుతో జీవితాన్ని ఆస్వాదిస్తా

పోలీసుల విచారణలో వెల్లడించిన రవి



హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సాంకేతికతపై ఉన్న పట్టుతో కొత్త సినిమాలను పైరసీ చేసి, సినీ పరిశ్రమకు చుక్కలు చూపించిన ఐ బొమ్మ రవికి పోలీసులు ఓ ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. అతని తెలివితేటలను గుర్తించిన పోలీసు ఉన్నతాధికారులు విచారణలో

మిగతా 12వ పేజీలో...

షాక్‌లకు చెక్!

విద్యుత్ రంగాన్ని గాడిన పెట్టాం: సీఎం

వైసీపీ హయాంలో ధ్వంసం చేశారు

నాడు పీపీఏల రద్దుతో 9 వేల కోట్ల భారం

సమర్థ నిర్వహణతో చక్కదిద్దాం

ప్రజలపై భారం పడకుండా చేశాం

ఫెర్రో అల్లాయ్స్‌కు మరో ఏడాది ప్రోత్సాహకాలు

ప్రభుత్వ భవనాలపై సౌర విద్యుత్ ఫలకాలు

ఆర్టీసీకి త్వరలోనే 1000 ఎలక్ట్రిక్ బస్సులు

రాష్ట్రంలో 5 వేల విద్యుత్ చార్జింగ్ స్టేషన్లు

ఇతర రాష్ట్రాలతో 'స్వాపింగ్' ఒప్పందాలు

ఇంధన రంగంలో ఒప్పందాలను 60 రోజుల్లో అమలు చేయాలి: సీఎం చంద్రబాబు

విద్యుత్ శాఖపై సమీక్షలో కీలక నిర్ణయాలు



విద్యుత్ శాఖపై సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో మంత్రి గొట్టిపాటి, అధికారులు

అమరావతి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలకులు విద్యుత్ వ్యవస్థను ధ్వంసం చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శించారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాల (పీపీఏ) రద్దుతో ప్రజలపై రూ.9 వేల కోట్ల భారం పడిందన్నారు. విద్యుత్తును వినియోగించుకోకుండానే ఆయా కంపెనీలకు రూ.9 వేల కోట్ల ప్రజాధనాన్ని చెల్లించాల్సి వచ్చిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక విద్యుత్తు వ్యవస్థలను గాడిలో పెట్టామని తెలిపారు. విద్యుత్తు వ్యవస్థల సమర్థ నిర్వహణ ద్వారా చార్జీలను ఏమాత్రం పెంచకుండా.. రూ.9 వేల కోట్ల భారం ప్రజలపై పడకుండా

మిగతా 11వ పేజీలో...

అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం

గనుల శాఖకు సీఎం ఆదేశం.. ఇసుక రీచ్‌లలో డ్రోన్, శాటిలైట్ నిఘా పెట్టాలి

6 జిల్లాల్లో సంతృప్త స్థాయి ఎందుకు తగ్గింది?.. మీరంతా ఏం చేస్తున్నారని ఆగ్రహం

రవాణాదారులు ప్రజల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్నారన్న అధికారులు

అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకోండి.. జిల్లా కలెక్టర్లకు ఆదేశాలివ్వండి 11

గనుల శాఖ నిరంతరం పర్యవేక్షించాలి.. వాహనాలను సీజ్ చేసి కేసులు పెట్టండి

ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్.. విశాఖలో క్రిటికల్ మినరల్ క్లస్టర్‌కు ఓకే



మొంథా తుఫాను నష్టంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసిన మంత్రులు లోకేశ్, అనిత

'మొంథా' నష్టం రూ.6,352 కోట్లు

అమిత్ షా, శివరాజ్‌సింగ్‌లతో మంత్రులు లోకేశ్, అనిత భేటీ

తుఫాను నష్టంపై నివేదిక అందజేత

తక్షణ ఉపశమనం కోసం రూ.902 కోట్లు అవసరమని వెల్లడి

న్యూఢిల్లీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల సంభవించిన మొంథా తుఫాను వల్ల ఏపీలో అన్నిరంగాలకూ కలిపి రూ.6,352 కోట్ల మేర నష్టం వాటిల్లిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి లోకేశ్, హోం మంత్రి వంగలపూడి అనిత వివరించారు. మంగళవారం అమిత్ షాతో పార్లమెంటులోని ఆయన కార్యాలయంలో లోకేశ్, అనిత భేటీ అయి మొంథా తుఫాను నష్టంపై నివేదిక అందజేశారు. ఇందులో

మిగతా 10వ పేజీలో...

దిశ మార్చుకున్న వాయుగుండం

ఉత్తర తమిళనాడు దిశగా పయనం

తిరుపతి జిల్లాలో భారీ వర్షాలు 10

నేడు కోస్తా, రాయలసీమలో వానలు

కాగ్నిజెంట్ వచ్చేస్తోంది



కాగ్నిజెంట్ తాత్కాలికంగా కార్యాలయం ఏర్పాటు చేయబోయే మహతి ఫిన్ టెక్ భవనం

12 నుంచి విశాఖలో కార్యకలాపాలు

ఐటీ పార్కులో తాత్కాలిక సెంటర్ ఏర్పాటు

అదేరోజు కాపులుప్పాడలో శాశ్వత భవనాలకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన

2026 జూన్‌కు రావాల్సిన కంపెనీ..

ఉద్యోగుల ఆసక్తితో ముందుగానే రాక

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం వైపు ఐటీ కంపెనీలు వడివడిగా అడుగులు వేస్తున్నాయి. దిగ్గజ ఐటీ సంస్థ కాగ్నిజెంట్ కార్యకలాపాల ప్రారంభానికి తేదీ ఖరారైంది. ఈనెల 12న విశాఖ ఐటీ పార్కు హిల్ నంబరు 2పై తాత్కాలిక సెంటర్ ప్రారంభించనుంది. ఈ ప్రారంభ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అదే రోజు కాపులుప్పాడలో ఆ సంస్థకు ప్రభుత్వం కేటాయించిన భూముల్లో శాశ్వత భవనాల నిర్మాణానికి కూడా సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నారు. తొలి దశ నిర్మాణాలు 2028 జూన్ నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు ప్రారంభిస్తున్నారని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఎకరా రూ.30 కోట్ల విలువ చేసే భూమిని 99 పైసలకే

మిగతా 11వ పేజీలో...

పెట్టుబడులే లక్ష్యంగా..

6 నుంచి లోకేశ్ విదేశీ పర్యటన

తొలి రోజు డాలస్‌లో ప్రవాసులతో భేటీ

7-9 తేదీల్లో దిగ్గజ సంస్థల అధినేతలతో 'బిజినెస్ టు బిజినెస్' సమావేశాలు

11, 12ల్లో కెనడాలో పారిశ్రామికవేత్తలతో భేటీ 10

వెంట ఉన్నతాధికారుల బృందం

ప్రతిష్టంభనకు తెర

ఎస్ఐఆర్‌పై చర్చించేందుకు అధికార ఎన్డీయే అంగీకారం



ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా పార్లమెంట్ ఆవరణలో విపక్ష నేతల నిరసన

8న వందేమాతరం, 9న ఎన్నికల సంస్కరణలపై చర్చ

స్పీకర్ నేతృత్వంలో జరిగిన బీఏసీ భేటీలో నిర్ణయం

ఇక సజావుగా సభలు: కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు

పార్లమెంటు సమావేశాల రెండో రోజూ గందరగోళం

న్యూఢిల్లీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సజావుగా సాగేందుకు అధికార, విపక్షాల మధ్య సయోధ్య కుదిరింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)పై చర్చకు కేంద్రం అంగీకరించడంతో ప్రతిష్టంభనకు తెరపడింది. అయితే.. ఎస్ఐఆర్‌పై ప్రత్యేకంగా కాకుండా మొత్తంగా ఎన్నికల సంస్కరణలపై చర్చిస్తామని కేంద్రం స్పష్టతనిచ్చింది. ఎస్ఐఆర్‌పై అత్యవసరంగా చర్చించాల్సిందేనని విపక్షాలు పట్టుబట్టడంతో.. ఈ సమావేశాల తొలి రోజులాగానే మంగళవారం సైతం ఉభయ సభల్లో వాయిదాల పర్వం

మిగతా 9వ పేజీలో...



'సేవా తీర్థ్'లో పీఎంవో

కొత్త కాంప్లెక్స్‌లోకి ప్రధానమంత్రి కార్యాలయం

తుది దశలో భవన సముదాయం నిర్మాణ పనులు

రాజ్‌భవన్ పేరు 'లోక్ భవన్'గా మార్పు

న్యూఢిల్లీ, డిసెంబరు 2: ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) కొత్త కాంప్లెక్స్‌లోకి మారబోతోంది. ఇక నుంచి ఆ సముదాయాన్ని 'సేవా తీర్థ్'గా పిలుస్తారు. ప్రస్తుతం ఈ నూతన కాంప్లెక్స్ నిర్మాణం తుది దశలో ఉందని అధికారులు మంగళవారం వెల్లడించారు. సేవాస్ఫూర్తిని ప్రతిబింబించే కార్యస్థలంగా, జాతీయ ప్రాధాన్యాల

మిగతా 9వ పేజీలో...



నేడు తూ.గో.లో 'రైతన్నా.. మీ కోసం'

రైతులతో ముఖాముఖి నిర్వహించనున్న సీఎం 7



మద్యం స్కాంలో ముంబై బులియన్ వ్యాపారి అరెస్టు

రోణక్‌ను అదుపులోకి తీసుకున్న 'సిట్'

వైసీపీ గ్యాంగ్ ఇచ్చిన రూ.100 కోట్లను వైట్ చేసిచ్చినట్టు చోక్రా వెల్లడి 12

అవేవీ తనకు తెలియదని.. అన్నయ్యే అన్నీ చూసుకుంటాడని విచారణలో రోణక్ వెల్లడి

అన్నతో మాట్లాడతానంటూ హాల్‌లోకి వెళ్లి జంప్.. ఎయిర్‌పోర్టులో పట్టుకున్న సిట్

అన్న చేతన్ కోసం ముంబైకి అధికారులు

సోదరులిద్దరినీ నిందితులుగా చేర్చిన వైనం



హైకోర్టుకు 'పరకామణి' నివేదిక

సీల్డ్ కవర్‌లో అందించిన సీఐడీ

రవికుమార్ ఆస్తులపై నివేదిక ఇచ్చిన ఏసీబీ

వాటిని కోర్టు ఆఫీసర్‌కు అందజేయండి 12

రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు హైకోర్టు ఆదేశం

సీఐడీ నివేదిక మాకిచ్చేలా ఆదేశించండి

రవికుమార్ తరపు సీనియర్ న్యాయవాది అభ్యర్థన

తోసిపుచ్చిన జడ్జి.. విచారణ ఎల్లుండికి వాయిదా

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆప్తమిత్రుని ఆగమనం

ఎంతోకాలానికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తన ఆప్తమిత్ర దేశంలో అడుగుపెడుతున్నారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన గతకాలపు మిత్రుడైన నరేంద్రమోదీని పలురీతుల ఇరకాటంలో పెడుతూ, భారతదేశాన్ని ఇబ్బందుల పాల్జేస్తున్న నేపథ్యంలో, రష్యా అధినేత భారత పర్యటనకు ఎంతో ప్రాధాన్యం వచ్చింది. డిసెంబరు 4–5 తేదీల్లో జరగబోయే పుతిన్ పర్యటనకు సంబంధించిన పలు ఆసక్తికర, విశేష కథనాలను మీడియా అందిస్తోంది. ఆయన తినేతిండి, తాగేనీరు, వాడే టాయ్‌లెట్ సహా సర్వమూ రష్యా నుంచే తరలివస్తాయనీ, మలమూత్రాదులు సైతం వెనక్కు తీసుకుపోతారనీ, ఆయన ప్రయాణించే విమానం భద్రమైనదీ, దుర్భేద్యమైనదంటూ మాధ్యమాలు వివరిస్తున్నాయి. ఒక్కడు కాదు, అచ్చం ఆయనలాగే ఉండే అనేకులు కూడా వస్తున్నారన్న కథనాలు సైతం ఎప్పటిలాగానే దర్శనమిస్తున్నాయి. పుతిన్ వైభవాన్నీ, భద్రతనూ అటుంచితే, మన భద్రత, ఉభయదేశాల స్నేహం, వాణిజ్యం ఇత్యాది అంశాల్లో ఉభయదేశాధినేతలూ పలు కీలకమైన ఒప్పందాల మీద సంతకాలు చేయబోతున్నారు.

అమెరికా ఒత్తిడికి లొంగి, రష్యా ముడిచమురు కొనుగోళ్ళను విపరీతంగా తగ్గించేసిన పరిస్థితిలో, ఆర్థికంగా రష్యాను ఆదుకోవాల్సిన అవసరం, బాధ్యత భారత్ మీద ఉన్నాయి. భారీ రక్షణ, ఇంధన ఒప్పందాలతో పాటుగా, రష్యాకు వివిధ మార్గాల్లో చేయూతనివ్వగలిగే కొత్త తరహా అవగాహనలమీద ఉభయదేశాలు దృష్టిపెట్టాయి. రైఫిళ్ళ నుంచి సుఖోయ్ యుద్ధవిమానాలు, క్షిపణి రక్షణవ్యవస్థల వరకూ పలురకాల కొనుగోళ్ళతో పాటు, రష్యా సాయంతో నిర్మితమవుతున్న కూడాంకుళం అణువిద్యుత్ ప్లాంట్ తదుపరిదశలను వేగవంతం చేయడం, ఉపగ్రహనిర్మాణ, నిర్వహణలతో సహా అంతరిక్ష రంగంలో సహకరించుకోవడం వంటివి ఎజెండాలో ఉన్నాయట. ముడిచమురు స్థానాన్ని కొంతమేరకు సహజవాయువుతో భర్తీ చేయడమే కాక, రష్యా ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెంచడం ద్వారా భారత్‌కు ఇంధన భద్రత, రష్యాకు నిలకడైన ఆదాయం అందే ఏర్పాటు జరుగుతోందని విశ్లేషణలు వెలువడుతున్నాయి.

ఉక్రెయిన్‌పై రష్యా దాడితో ఆగిన భారత్–రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశానికి నాలుగేళ్ళ తరువాత పుతిన్ వస్తున్నారు. యుద్ధంలో అణ్వాయుధాలు వాడతామంటూ పుతిన్ దూకుడుగా చేసిన వ్యాఖ్యలు భారత్‌ను అప్పట్లో మరింత ఇబ్బందిపెట్టాయి. అయితే, గత ఏడాది అక్టోబర్‌లో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు రష్యాలోనే జరగడంతో పుతిన్–మోదీ భేటీకి అడ్డులేకపోయింది. దీనికిముందు జూలైలో నరేంద్రమోదీ తన మూడవ పదవీకాలంలో జరిపిన తొట్టతొలి ద్వైపాక్షిక పర్యటనకు రష్యానే ఎంచుకున్నారు. నైబర్స్‌ఫస్ట్ అన్న గత విధానానికి భిన్నంగా ఆయన మన చిరకాల ఆప్తమిత్రదేశంలో తొలిగా కాలూనారు. అయితే, మోదీ అక్కడ ఉండగానే ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లోని పిల్లల ఆస్పత్రిమీద రష్యా క్షిపణి దాడిచేసింది. ఈ పర్యటనలో పుతిన్‌ను మోదీ కౌగలించుకొని ఆప్తమిత్రుడుగా అభివర్ణించినందుకు జెలెన్‌స్కీ ఆగ్రహించి, ఒక అతిపెద్ద ప్రజాస్వామ్యదేశాధినేత ఓ అత్యంత క్రూరుడైన నేరగాడిని ఆలింగనం చేసుకున్న దృశ్యం అంటూ దానినీ, ధ్వంసమైన చిన్నారుల ఆస్పత్రి చిత్రాన్నీ ట్విటర్‌లో పోస్టుచేశారు. రష్యాతో యుద్ధం మొదలైన తరువాత జెలెన్‌స్కీ భారతదేశాన్ని నేరుగా తప్పుబట్టడం అదే తొలిసారి. అనంతరకాలంలో పలుమార్లు ఇటువంటి సంకటస్థితినీ, పలు రకాల అంతర్జాతీయ ఒత్తిళ్ళనూ ఎదుర్కొంటూనే, రష్యాను సాధ్యమైనంత కాపాడుకొస్తూ, మొత్తానికి ఈ యుద్ధకాలాన్ని భారత్ నెట్టుకురాగలిగింది. యుద్ధం ఆపేందుకు పట్టుదలతో ప్రయత్నిస్తున్న ట్రంప్ భారత్, రష్యాలను తీవ్రంగా ఇక్కట్లపాల్జేస్తున్న తరుణంలో పుతిన్ పర్యటన భారత వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి నిదర్శనమంటున్నారు నిపుణులు.

భారత్–అమెరికా వాణిజ్య చర్చలు కొలిక్కివచ్చాయని, త్వరలోనే ఒప్పందం కుదరబోతోందని వార్తలు వస్తున్నాయి. ట్రంప్ చొరవతో, పుతిన్ పక్షాన తయారైన శాంతి ప్రణాళిక పట్టాలెక్కబోతోందనీ వింటున్నాం. ఇవి రెండూ సవ్యంగా జరిగిపోయిన పక్షంలో, భారత్–రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశం సందర్భంగా తీసుకొనే నిర్ణయాలు, కుదుర్చుకొనే ఒప్పందాల అమలులో అమెరికా వేలుపెట్టే, అడ్డంకులు సృష్టించే అవకాశాలు పెద్దగా ఉండవు. పునాది బలం దిట్టంగా ఉన్న భారత్–రష్యా స్నేహం ఎన్నటికీ చెరగనిది, చెదరనిది. గత ఏడాది జూలైలో మోదీ రాకకు రష్యా ఎంతో సంతోషిస్తూ ప్రపంచ రాజకీయాలను ప్రభావితం చేసే పరిణామంగా దానిని అభివర్ణించింది. అదేవిధంగా, పుతిన్ ప్రస్తుత పర్యటన ఉభయదేశాల సంబంధాలను మరో ఎత్తుకు తీసుకుపోబోతున్న మాట వాస్తవం.

ఆ చట్టం... వ్యవసాయానికి ఉరితాడు

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన '2025 విత్తన చట్టం' ముసాయిదా కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టడం కోసమే. ప్రతిపాదిత చట్టంలో కేంద్ర విత్తన కమిటీకి చైర్మన్ సహా మరో 27 మందిని ఎన్నుకోవాలనీ, షెడ్యూల్ 1 పార్ట్–ఎలో చూపిన నామినేట్ కమిటీలో మెజార్టీ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉన్నవారినే నియమిస్తారని వేరే చెప్పనవసరం లేదు. సెక్షన్ 9 ప్రకారం రిజిస్ట్రేషన్, సబ్ కమిటీలు, సెక్షన్ 10 ప్రకారం వేసే రాష్ట్ర విత్తన కమిటీల ఎంపికలో పారదర్శకత ఉండదు. 1966 విత్తన చట్టం, సీడ్ కంట్రోల్ ఆర్డర్ 1983 బదులుగా... 2025 విత్తనాల ముసాయిదా బిల్లును మోదీ ప్రభుత్వం విడుదల చేసింది. రానున్న వర్షాకాల పార్లమెంటు సమావేశాల్లో ఈ బిల్లును ఆమోదించటానికి ముందు డిసెంబర్ 11వ తేదీలోగా ప్రజల నుంచి అభిప్రాయాలను కోరుతూ ఈ ముసాయిదా బిల్లును ప్రకటించింది.

టాటా, బిర్లా, ఐటీసీ లాంటి సంస్థలే కాక విదేశీ కార్పొరేట్ సంస్థలైన 'మోన్‌సాంటో', బేయర్, డుపాంట్, సింజెంటా, కార్గిల్ సంస్థలు విత్తనరంగంపై పూర్తి ఆధిపత్యాన్ని సంపాదించాయి. విత్తన ధరలను ఇష్టారీతిగా పెంచటం, నాణ్యతలేనివి, పాలినేషన్ తక్కువ ఉన్నవి రైతులకు అంటగట్టి లాభాలు పొందుతున్నాయి. వాస్తవానికి విత్తన చట్టం రాజ్యాంగం రీత్యా రాష్ట్ర జాబితా లోనిది. 2017లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన చట్టాన్ని



ఆమోదించకుండా కేంద్రం అడ్డుకున్నది. స్థానికంగా పరిశోధన జరిపిన విత్తనాలే రైతులకు ఉపయోగపడ్డాయి. విదేశీ వాతావరణంలో జరిపిన ప్రయోగాలు ఇక్కడ ఉపయోగపడవు. గతంలో బీటీ విత్తనాల వల్ల రైతులు అనేక విధాలుగా నష్టపోయారు. నాణ్యత లేని విత్తనాలు సరఫరా చేస్తే లైసెన్సులు రద్దు చేయటం, జైలుశిక్షలు విధించటం లాంటి పెనాల్టీలు ఈ ముసాయిదా చట్టంలో లేవు.

రైతుల ప్రయోజనాలకు అనుకూలంగా దేశీయ టెక్నాలజీని వినియోగించి వాతావరణ జోన్లలో ప్రయోగాలు, పరిశోధనలు చేసి రైతులకు అందించే విధంగా విత్తన చట్టాన్ని రూపొందించినప్పుడే రైతులకు మేలు జరుగుతుంది. విత్తన నాణ్యతపైనా, జెర్మినేషన్ పైనా మరింత స్పష్టత కావాలి. రాష్ట్రాల స్థాయిలో నిపుణులతో సమావేశాలు ఏర్పాటు చేసి విత్తన చట్ట ముసాయిదాను రూపొందించటం అవసరం. కార్పొరేట్ సంస్థలు విత్తనాల వ్యాపారం ద్వారా ఏటా వేల కోట్లు రైతుల నుంచి దోచుకుంటున్నాయి. అందుకు అవకాశం లేకుండా రైతులకు రక్షణ కల్పించేలా చట్టంలో మార్పులు చేయాలి.

రైతుల సృజనాత్మక చొరవను పెంచే గ్రామీణ విత్తన కేంద్రాల అభివృద్ధిని పాలకులు గాలికి వదిలేశారు. విత్తనాలను రైతులే సొంతంగా తయారు చేసుకునే హక్కును ప్రోత్సహించకపోగా, వారిపై దొంగ అనే ముద్రలు వేసే స్థితికి వెళ్లారు. భారతదేశ విత్తన సంపదను కాపాడవలసిన అవసరం గురించి ఏనాడో మరిచిపోయారు. విత్తన స్వావలంబనను అందుబాటులోకి తీసుకురావటం, విత్తన సరఫరాలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచటం ద్వారా రైతుల హక్కులను కాపాడే లక్ష్యాన్ని విస్మరించారు. రైతులు తయారు చేసిన విత్తనాలను ఏదో ఒక కంపెనీ కొనుక్కుని తమ బ్రాండ్ వేసుకుని మార్కెట్లో అమ్ముకుని పెద్దఎత్తున సొమ్ము చేసుకుంటున్నది. పేటెంట్ ఉన్న బ్రాండెడ్ విత్తనాలను మాత్రమే వాడాలనే ప్రమాదకరమైన అంశాన్ని ఈ ముసాయిదా బిల్లులో ప్రతిపాదించారు. ఈ బిల్లు విత్తన దిగుమతులను సరళీకరించి, బడా కార్పొరేట్ కంపెనీలకు లాభాలు తెచ్చిపెట్టే విధంగా రూపొందించారు. ప్రపంచ విత్తన వెరైటీలను భారతదేశంలోకి విచక్షణారహితంగా అనుమతించి, దేశీయ విత్తనాభివృద్ధికి సమాధి కట్టే విధంగా ఈ బిల్లు ఉన్నది. ముసాయిదా చట్టంలో రూపొందించిన నిబంధనలన్నీ బడా కార్పొరేట్ కంపెనీలు భారతదేశ విత్తన మార్కెట్లో మరింత స్వేచ్ఛగా, దూకుడుగా ముందుకు వెళ్లటానికి ఉపయోగపడతాయి. రైతు ప్రయోజనాలకు, అంతిమంగా మన వ్యవసాయ రంగానికి ఉరితాడును బిగించే విధంగా ఉన్న ఈ విత్తన బిల్లును రైతు సంఘాలు సమైక్యంగా తిప్పికొట్టాలి.

● ముప్పాళ్ళ భార్గవశ్రీ
సీపీఐ ఎంఎల్ నాయకులు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70,
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

మోదీ సలహా విపక్షాలు పాటిస్తాయా?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'ఇక్కడ శీతాకాలానిదే విజయం. అధికార సోపానాల మంచు సామ్రాజ్యాలకోసం పోటీపడాలంటే ఇక్కడ రక్తం చల్లపడాలి..' అని ఒక కవి రాసినట్లు బిహార్ ఎన్నికల తర్వాత ప్రారంభమైన పార్లమెంటు సమావేశాలు చాలా స్తబ్దంగా జరుగుతున్నాయి. ఇదే సమయంలో దేశ రాజధానిని, పొరుగు ప్రదేశాలను గజగజా వణికిస్తున్న చలి గాడ్పులు తీవ్రమవుతున్నాయి. మరోవైపు చలితో పోటీపడుతున్న వాయు కాలుష్యం మరింత దట్టమై ఊపిరితిత్తుల్లోకి దూసుకుపోయి శ్వాసించడాన్ని దుర్భరంగా మారుస్తోంది. కళ్ల ముందు పొగమంచు కమ్ముకుని ఉదయాలూ, సాయంత్రాలూ కారుమబ్బుల మధ్య ప్రయాణిస్తున్నట్టు అనిపించే వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. ఊపిరి పీల్చడానికి కష్టపడుతూనే కళ్లు మండుతున్నా ఢిల్లీ వాసులు తమ ప్రయాణాలు సాగిస్తున్నారు. 'కాలుష్య నివారణకు మీరేం చేస్తున్నారో చెప్పండి..' అని సుప్రీంకోర్టు కేంద్రంపై మరోసారి మండిపడింది! చాలా మంది మనుషుల మాదిరే సుప్రీంకోర్టుకూ జ్ఞాపకశక్తి తక్కువేనేమో? గత ఏడాది సరిగ్గా ఇవే రోజుల్లో వాయు కాలుష్యం నివారణ విషయమై కేంద్రాన్ని సుప్రీంకోర్టు గట్టిగా నిలదీసింది. న్యాయమూర్తులు మారుతున్నారు కాని ప్రజలకు న్యాయం మాత్రం గగన కుసుమంగా మారింది సుమా!

ఈ ఏడాది పార్లమెంట్ శీతాకాల సమావేశాలూ ప్రభుత్వ, ప్రతిపక్షాల తీరుతెన్నుల్లో మార్పేమీ లేదన్న విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. గత ఏడాది శీతాకాల సమావేశాల్లో ఉభయ సభల్లో ప్రశ్నోత్తరాల సమయం దాదాపు పూర్తిగా స్తంభించిపోయింది. మణిపూర్‌లో అల్లర్లు తదితర అంశాలపై చర్చకు అనుమతించలేదంటూ అప్పటి రాజ్యసభ చైర్మన్ దన్‌ఖడ్‌ను తొలగించేందుకు ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని సైతం ప్రవేశపెట్టాయి. ప్రతిపక్షాల అవిశ్వాస తీర్మానాన్ని అధికార పక్షం తిరస్కరించింది. అయితే ఆ తర్వాతి రోజుల్లో అదే చైర్మన్‌పై ప్రభుత్వమే విశ్వాసాన్ని కోల్పోయి ఆయనను ఇంటికి పంపిస్తుందని కానీ, ఈ ఏడాది శీతాకాల సమావేశాలు కొత్త చైర్మన్ ఆధ్వర్యంలో జరుగుతాయని కాని నాడు ఎవరూ ఊహించలేదు. గత ఏడాది హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం తర్వాత సమధికోత్సాహంతో ఉన్న భారతీయ జనతా పార్టీ ప్రతిపక్షాలను పూచికపుల్లల్లా పరిగణించింది. ఈ ఏడాది కూడా బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కనీవినీ ఎరుగని విజయం తర్వాత జరుగుతున్న ఈ శీతాకాల సమావేశాల్లో పాలకపక్షం సహజంగానే విజయోత్సాహంతో ఉన్నది. మరి మరింత బలహీనపడిన ప్రతిపక్షాలను బీజేపీ లెక్కచేస్తుందని మాత్రం ఎవరనుకుంటారు? ఎన్నికల్లో విజయాలు, చట్టసభల్లో సంఖ్యాబలం మాత్రమే ఒక పార్టీ జయాపజయాలకు కొలమానం కదా.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ శీతాకాల సమావేశాల తొలిరోజే విపక్షాలపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. 'బిహార్ ఎన్నికలకు ముందు దేశంలో తమకు అనుకూల వాతావరణాన్ని సృష్టించుకునేందుకు ప్రతిపక్షాలు వర్షాకాల సమావేశాలను ఉపయోగించుకోవాలని అనుకున్నాయని, ఇప్పుడు ఓటమి తర్వాత తమ నిరాశా నిస్పృహలను వ్యక్తం చేసేందుకు శీతాకాల సమావేశాలను ఉపయోగించుకోవాలని అనుకుంటున్నాయని' ఆయన వ్యంగ్యంగా విమర్శించారు. ప్రతిపక్షాలు తమ వ్యూహాన్ని, వైఖరిని మార్చుకోవాలని, కావాలంటే తాను అవి తమ పనితీరు మెరుగుపరుచుకునేందుకు వాటికి సలహాలు ఇస్తానని కూడా ఆయన అన్నారు. డ్రామాలు, నినాదాలకు పార్లమెంటు వెలుపల అనేక వేదికలు ఉన్నాయని, పార్లమెంట్‌ను ఎట్టి పరిస్థితులలోను వాటికి వేదికగా చేసుకోకూడదని ఆయన హితవు చెప్పారు.

నిజానికి ఆపరేషన్ సిందూర్ విషయంలో ఇంటా బయటా అనేక ఒత్తిళ్లను ఎదుర్కొన్న మోదీ సర్కార్‌ను గత వర్షాకాల సమావేశాల్లో ప్రతిపక్షాలు నిర్దాక్షిణ్యంగా నిలదీశాయి. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై కూడా అవి గందరగోళం సృష్టించాయి. ప్రతిరోజూ పార్లమెంట్ ఆవరణలోనూ, ఉభయ సభల్లోనూ ప్లకార్డుల ప్రదర్శన, నినాదాలు చేయడం ద్వారా మోదీ సర్కార్‌ను ఆత్మరక్షణలో పడవేసినట్లు ప్రతిపక్షాలు భావించాయి. కేవలం ఆపరేషన్ సిందూర్‌పై మాత్రమే రెండున్నర రోజులు చర్చించిన ఆ సమావేశాలు అంతకు మించి ఒక్క రోజు కూడా సాగకపోయినప్పటికీ ప్రభుత్వం ఉభయ సభల్లోనూ 15 ముఖ్యమైన బిల్లులను గందరగోళం మధ్యే ఆమోదించుకోగలిగింది.

వర్షాకాల సమావేశాల తర్వాత జరిగిన బిహార్ ఎన్నికల్లో ప్రతిపక్షాలు విజయం సాధించలేకపోవడం ఆశ్చర్యకరమైన విషయమే. ఆపరేషన్ సిందూర్‌ను ఆకస్మికంగా నిలిపివేయడంపై విపక్షాల విమర్శలను బిహార్ ప్రజలు పట్టించుకోలేదా? పెద్ద ఎత్తున ఓటర్లను తొలగించేందుకు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను చేపట్టారని తీవ్ర రభస చేసిన విపక్షాలను ఓటర్లు ఎందుకు విస్మరించారు? పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలు ప్రజలపై ప్రభావం చూపించడం లేదా? పార్లమెంట్ లోపలే కాదు, బయట కూడా 'సర్'పై విపక్షాలు నిరసన యాత్రలు, సభలు నిర్వహించాయి. అయినా ఎన్నికల ఫలితాలు మాత్రం వారు ఊహించని విధంగా వచ్చాయి.


అయినప్పటికీ శీతాకాల సమావేశాలు ప్రారంభమైన మొదటి రోజు నుంచే 'సర్'పై విపక్షాలు ఉభయ సభలను స్తంభింపచేయడం మొదలుపెట్టాయి. ఢిల్లీలో ఎర్రకోట వద్ద బాంబు పేలుళ్లపై చర్చ జరగాలని డిమాండ్ చేశాయి పార్లమెంట్ ఆవరణలో సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకతో సహా ప్రతిపక్ష నేతలు అందరూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. మోదీ సర్కార్ వీటన్నింటినీ మాత్రం లెక్కచేయకుండా మొదటి రోజునుంచే గందరగోళం మధ్య బిల్లులను ఆమోదింపచేసుకోవడం మొదలుపెట్టింది. చివరకు 'సర్'పై నిర్దిష్టంగా కాకపోయినా స్థూలంగా ఎన్నికల సంస్కరణలపై వచ్చే వారం చర్చకు ప్రభుత్వం అంగీకరించింది. చర్చించినంత మాత్రాన ఏమి జరుగుతుంది? సవరణ పేరుతో దళితులు, ఓబీసీలు, అణగారిన వర్గాల ఓటర్లను తొలగిస్తున్నారని విపక్ష నేతలు చేసే ఆరోపణలను ప్రభుత్వం అంగీకరిస్తుందా? ఎన్నికల సంఘం ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్ బీజేపీ ఏజెంట్‌లా వ్యవహరిస్తున్నారన్న విపక్షాల విమర్శలకు ప్రభుత్వం ఏ విధంగా ప్రతిస్పందిస్తుంది? ఓటర్ల జాబితా సవరణను వేగవంతం చేయడంతో భయాందోళనలను, పని ఒత్తిళ్లను ఎదుర్కోలేక ఒక్క బెంగాల్‌లోనే నలుగురు బీఎల్‌ఓలతో సహా దాదాపు 39 మంది మరణించారని ప్రతిపక్షాలు చెప్పిన విషయాల్లో వాస్తవాలు ఉన్నాయని కేంద్రం ఏకీభవిస్తుందా?

'సర్'పై చర్చకు ముందు ప్రభుత్వం ఈ నెల 8, 9 తేదీల్లో వందేమాతరం లిఖించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పార్లమెంట్‌లో చర్చను నిర్వహించడం ఈ శీతాకాల సమావేశాల్లో చెప్పుకోదగ్గ విశేషం. బంకించంద్ర చటర్జీ రచించిన ఈ గీతాన్ని రవీంద్రుడు తొలుత కాంగ్రెస్ సదస్సులో ఆలపించారు. తదాది ఆ గీతం భారత స్వాతంత్ర్య పోరాట చైతన్య గీతమై పల్లవించింది. వందేమాతరం ఆలపించినందుకే నిజాం ప్రభుత్వం పీవీ నరసింహారావుతో సహా పలువురు విద్యార్థులను ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బహిష్కరించింది. నిజానికి స్వాతంత్ర్య పోరాటం నిర్వహించిన చరిత్ర తమకు ఉన్నదని చెప్పుకుంటున్న కాంగ్రెస్ వందేమాతరం శతాబ్దిన్నర ఉత్సవాలను తానే ఘనంగా నిర్వహిస్తూ ప్రజల్లోకి వెళ్లాల్సిన విలువైన సందర్భమది. కానీ కాంగ్రెస్‌కు దక్కాల్సిన ఘనతను బీజేపీయే ఇప్పుడు దక్కించుకోవడమే కాక జాతీయవాద భావాలను పురికొల్పి తన రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకునేందుకు పెద్ద ఎత్తున సంకల్పించింది. పైగా మతశక్తులను బుజ్జగించేందుకు వందేమాతరంలో కొన్ని చరణాలను తొలగించడం ద్వారా దేశ విభజన బీజాలను కాంగ్రెస్ నాటిందని మోదీతో పాటు బీజేపీ నేతలు గుప్పించిన ఆరోపణలు కాంగ్రెస్‌ను మరింత ఆత్మరక్షణలో పడవేశాయి. ఏ చారిత్రక సందర్భంలో తాము అలా చేయవలసి వచ్చిందో, రాజ్యాంగ సభ దాన్ని ఎలా ఆమోదించిందో కాంగ్రెస్ సమర్థంగా సమర్థంగా వివరించలేకపోతున్నదా అన్న భావన కలుగుతోంది. ఇప్పుడు వందేమాతరంపై జరిగే చర్చను కూడా బీజేపీ పార్లమెంట్‌లో తమకే పూర్తిగా అనుకూలంగా, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మార్చేందుకు కచ్చితంగా ప్రయత్నిస్తుంది. ఇలాంటి విషయాల్లో కాంగ్రెస్‌కు కాలం అనుకూలంగా లేదన్న వాస్తవాన్ని ఆ పార్టీ నేతలు అంగీకరించలేకపోతున్నారు. పార్లమెంట్ సమావేశాల సమయంలోనే డిసెంబర్ 4, 5 తేదీల్లో రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్‌లో రెండు రోజులు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా రష్యాతో కీలకమైన సైనిక, వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేయడం మోదీ సర్కార్‌కు మరింత ఆత్మస్థైర్యం కలిగించే విషయం. రష్యాతో సంబంధాలను తగ్గించుకోవాలని అమెరికా తీవ్ర ఒత్తిడి చేస్తున్న సమయంలో ఆ దేశంతో ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా పెంపొందించుకునేందుకు భారత్ నిర్ణయించుకోవడం ఒక కీలక పరిణామం, సందేహం లేదు. పుతిన్ పర్యటననూ మోదీ తన ప్రతిష్ఠను పెంచుకునేందుకు ఆయన సద్వినియోగం చేసుకుంటారనడంలో సందేహం లేదు.

ఈ మొత్తం పరిణామాల క్రమంలో కాంగ్రెస్, ప్రతిపక్షాలు తమ భావి కార్యాచరణను ఏ విధంగా నిర్ణయించుకోవాలన్న విషయమై అయోమయంలో ఉన్నాయని చెప్పక తప్పదు. పార్లమెంటులో నినాదాలు చేస్తూ నిరసనలు వ్యక్తం చేయడం వల్ల సాధించేదేమీ ఉండదు. విపక్షాలను ఉద్దేశించి మోదీ చేసిన వ్యాఖ్యలను సలహాలుగా అవి ఎందుకు పాటించకూడదు? అందులో తప్పేమీలేదు. ప్రతిపక్షాలే కాదు, మన ప్రజాస్వామ్యం సుస్థిరంగా, క్షేమంగా ఉండాలని, ప్రజలు చైతన్యవంతులు కావాలని కోరుకునేవారంతా తమ పోరాట రూపాల్ని మరోసారి సమీక్షించుకోవాల్సిన అవసరం ఉన్నదేమో!

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

> **“ పార్లమెంటులో నినాదాలు చేస్తూ నిరసనలు వ్యక్తం చేయడం వల్ల సాధించేదేమీ ఉండదు. తమను ఉద్దేశించి మోదీ చేసిన వ్యాఖ్యలను సలహాలుగా విపక్షాలు ఎందుకు పాటించకూడదు? అందులో తప్పేమున్నది? ప్రతిపక్షాలే కాదు, మన ప్రజాస్వామ్యం సుస్థిరంగా, క్షేమంగా ఉండాలని, ప్రజలు చైతన్యవంతులు కావాలని కోరుకునేవారంతా తమ పోరాట రూపాల్ని మరోసారి సమీక్షించుకోవాల్సిన అవసరం ఉన్నది.**





తొలి జాతీయగీతం @ 1857!

1857 నాటి స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖపాత్ర వహించిన నానా సాహెబ్ ఆంతరంగిక కార్యదర్శి అజీమ్ ఉల్లాఖాన్. అతను వ్యవహారదక్షుడే గాక గొప్ప యుద్ధ వ్యూహకర్త కూడా. 1857 సంగ్రామ కాలంలో అజీమ్ ఉల్లాఖాన్ 'పయామ్–ఎ–ఆజాదీ' పేరుతో ఒక రహస్య పత్రికను నడిపాడు. అందులో అవధి (లక్నో) ప్రాంతానికి చెందిన సమరయోధుడు మౌల్వీ లియాఖత్ ఆలీ రాసిన గేయం ఒకటి ప్రచురితమైంది. మనం జాతీయ గీత రచయితలుగా ప్రముఖంగా చెప్పుకునే బంకించంద్ర, మహమ్మద్ ఇక్బాల్, రవీంద్రనాథ్ టాగోర్, గురజాడ, సుబ్రహ్మణ్య భారతి తదితరులు రాసిన గీతాలన్నిటికంటే ముందుగానే మౌల్వీ లియాఖత్ ఆలీ ఈ గీతాన్ని రాశారు కాబట్టి దీనినే తొట్టతొలి జాతీయ గీతం అనుకోవచ్చు. గుంటూరువాసి సయ్యద్ నశీర్ అహ్మద్ రాసిన 'స్వాతంత్ర్య సంగ్రామంలో ముస్లిం యోధులు' పుస్తకంలో ఈ ఉర్దూ గేయాన్ని తెలుగు అక్షరాలలో ప్రచురించారు. నేడు జాతీయ గీతాలపై చర్చ నేపథ్యంలో ఈ గీతం తెలుగులో....

హిందుస్థాను మన దేశం –
దీనికి మనమే వారసులం
పవిత్రమైనది మా దేశం –
స్వర్గం కంటే మహాప్రియం
సమస్త సంపద మాదేలే–హిందుస్థాను మనదేలే!

దీని వైభవం దీని ప్రాభవం
వెలుగులు చిమ్మును జగమంతా
అతి ప్రాచీనం ఎంతో ధాటి
దీనికి లేదుర ఇలలో సాటి!
హిందుస్థాను మన దేశం–దీనికి మనమే వారసులం!

గంగా యమునలు పారు నిండుగా
మా నేలల్లో బంగారు పండగ
దిగువన పరుచుకు మైదానాలు
దిగ్గున ఎగసే సంద్రపుటలలు
మంచు నిండినా ఎత్తు కొండలు
కావలి దండిగ, మాకు అండగా!
హిందుస్థాను మన దేశం–దీనికి మనమే వారసులం!

దూరం నుండి వచ్చిన దుష్టులు
చేసిరి కంతిరి మాయ చేష్టలు
ప్రియాతి ప్రియమవు దేశాన్నంత
దోచివేసిరి రెండు చేతులా!
హిందుస్థాను మన దేశం–దీనికి మనమే వారసులం!

అమరవీరులు విసిరిన సవాలు
దేశవాసులు వినరండి
బానిస సంకెలు తెంచండి
నిప్పుల వానై కురవండి!
హిందుస్థాను మన దేశం–దీనికి మనమే వారసులం!

హిందూ, ముస్లిం, సిక్కులందరం
ప్రియాతి ప్రియమవు సోదరులం
అదిగదిగో మన స్వతంత్ర జెండా
చేస్తాం సలాము గుండెల నిండా!
చేస్తాం సలాము గుండెల నిండా!

ఉర్దూ మూలం:
మౌల్వీ లియాఖత్ అలీ
తెలుగు అనువాదం: **దివికుమార్**

వికలాంగుల ప్రతిభను గౌరవించాలి!

కొన్నిసార్లు శరీర లోపాలను చూసి మనుషులను తక్కువగా అంచనా వేస్తాం. కానీ చరిత్ర చెబుతుంది– ప్రపంచాన్ని మార్చిన మహానుభావుల్లో ఎంతమంది వికలాంగులు ఉన్నారో. ఆ లోపం వారికి అడ్డంకి కాలేదు. వారు ముందుకు సాగడంలో అత్యంత అడ్డంకి శారీరక లోపం కాదు, సమాజపు దృక్కోణమే. అంగవైకల్యం శరీరంలో ఉండాలి గాని, మనసులో కాదు. మనసులో ధైర్యం ఉన్న వారికి ప్రపంచం కూడా నమస్కారం చేస్తుంది.



వికలాంగులు ఏ పని చేయలేరని కాదు, చేయనివ్వకపోవడం మనం చేస్తున్న పెద్ద తప్పు. అవకాశం ఇచ్చే చేయి, ప్రోత్సహించే మాట, అంగీకరించే మనసు– ఇవే వారికి నిజమైన ఆసరాలు. ప్రేమ, ఆదరణ, గౌరవం– ఇవి ఎడతెగని మానవ హక్కులు. వికలాంగులకు ఇవి దయ కాదు, వారి హక్కులు. ప్రభుత్వం ఇటీవల వికలాంగులకు కల్పిస్తున్న రాయితీలు, పింఛన్లు, విద్యా సదుపాయాలు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, వైద్య పరికరాలు వంటి పథకాలు ఎంతో అభినందనీయం. కానీ పథకాలు పెరగడం సరిపోదు, వాటి చేరువ పెరగాలి. గ్రామాల దాకా, ప్రతి వ్యక్తికీ అవి చేరాలి.

వికలాంగుల విద్య మనకు ఒక గొప్ప బాధ్యత. పాఠశాలల్లో వారికి ప్రత్యేక తరగతులు, సహాయక ఉపాధ్యాయులు, ప్రత్యేక వనరులు అవసరం. చదువుతో వారు సమర్థులవుతారు, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఉద్యోగావకాశాలు వికలాంగులను ఆధారపడే స్థితి నుంచి ఆత్మగౌరవం దిశగా తీసుకెళ్తాయి. వారి కోసం రూపొందించే ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు, కార్యాలయాలు, ఆసుపత్రులు, ప్రయాణ సదుపాయాలు వికలాంగులకు సౌకర్యం కలిగించే విధంగా ఉండాలి. ఒక ర్యాంప్ వారు నడవడానికి కాదు, వారి గౌరవం కోసం నిర్మించాలి. వికలాంగులపై కనికరం చూపడం కాదు, మనతో వారిని సమానంగా చూడడం నేర్చుకోవాలి. వారు సమాజానికి ఒక ఆస్తి. వారిలో ప్రతిభను కనుగొనడానికి మనకు మంచి సంకల్పం కావాలి. మానవత్వం అనేది మాటల్లో కాదు, అండగా నిలిచే చిన్న చిన్న పనుల్లో ఉంటుంది.

డిసెంబర్ 3ను ఒక ఉత్సవంలా జరపడం కాదు, ఒక ప్రమాణంలా స్వీకరించాలి. మనం ఎక్కడ ఉన్నా, ఏ స్థాయిలో ఉన్నా, ఒక వికలాంగుడికి సహాయం చేయడానికి ముందుండాలి. వికలాంగుల ఆనందం మన ఆనందంగా భావించే రోజు వచ్చినప్పుడు, అదే నిజమైన వికలాంగుల దినోత్సవం.

– తరిగోపుల నారాయణస్వామి

(నేడు ప్రపంచ వికలాంగుల దినోత్సవం)

రహదారి భద్రత.. చేరుకోలేనంత దూరమా?

రహదారులపై మృత్యు విలయం కొనసాగుతూనే ఉంది. తెలుగు రాష్ట్రాల్లో వరుస బస్సు ప్రమాదాలు ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. కర్నూలు దుర్ఘటన మరువకముందే చేవెళ్ల వద్ద జరిగిన మరో ప్రమాదం, ఆ తర్వాత పలు ప్రాంతాల్లో చోటుచేసుకున్న అయిదు బస్సు ప్రమాదాలు– ఇది కేవలం దురదృష్టకర ఘటనల పరంపర కాదు; ఇది వ్యవస్థాపరమైన లోపాలకు, నిర్లక్ష్యానికి అద్దం పడుతున్న విషాదం.

కేంద్ర రోడ్డు రవాణా శాఖ ఈ ఏడాది విడుదల చేసిన నివేదిక ప్రకారం 2023లో దేశ వ్యాప్తంగా 4.80 లక్షల రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా, వాటిలో 1.72 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. 4.62 లక్షల మంది గాయపడ్డారు. గత అయిదేళ్లలో ప్రమాదాల సంఖ్య 10శాతం పెరగడం చూస్తే రహదారి భద్రత గాల్లో దీపమైందని స్పష్టంగా తెలుస్తోంది. జాతీయ, రాష్ట్ర హైవేలపైనే దాదాపు 60 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారులపై మృత్యుఘోష పరంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వరుసగా 8, 9 స్థానాల్లో ఉన్నాయి. బాధితుల్లో ఎక్కువమంది మధ్యతరగతి, పేద ప్రజలే. సంపాదించే వయసులోని వ్యక్తులను బలి తీసుకుంటున్న ప్రమాదాలు– అనేక కుటుంబాలను ఆర్థికంగా, మానసికంగా ఛిద్రం చేస్తున్నాయి. తాజాగా తమిళనాడులోని శివగంగ జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదం పదిమందిని బలితీసుకోవడంతోపాటు ఎంతో మందిని క్షతగాత్రులుగా మార్చింది.



మన తెలుగు రాష్ట్రాల్లో ఇటీవలి కర్నూలు, చేవెళ్ల బస్సు ప్రమాదాలు కేవలం యాదృచ్ఛిక ఘటనలు కాదు. రహదారి మౌలిక వసతుల లోపాలు, అతివేగం, ఓవర్ లోడింగ్, డ్రైవర్లకు శిక్షణ లోపం, పథకాల ప్రభావం... ఇవన్నీ కలిసి భద్రతను తుంచేస్తున్నాయి. అధికారుల లెక్కల ప్రకారం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం అతివేగమే. అంతేకాదు, రహదారి రూపకల్పనలో లోపాలు, తప్పుడు ప్రాజెక్టు నివేదికలు, ఇంజనీరింగ్ వైఫల్యాలు, నిర్లక్ష్య పర్యవేక్షణ.. ఇవే నిజమైన హంతకులు. హైవేల బ్లాక్‌స్పాట్లను సరిదిద్దడంలో యంత్రాంగం విఫలమైందని ఇటీవలే పార్లమెంటరీ కమిటీ తేల్చింది.

ఏఐ, సెన్సార్లు, బ్రీత్ ఎనలైజర్లు, స్పీడ్ కెమెరాలు, డివైడర్లు, ఫ్లై ఓవర్లు... అన్నీ మనకు ఉన్నాయి. కానీ మన నగరాలు ఇంకా ప్రమాదాల గుట్టలే! టోక్యో, షాంఘై వంటి అధిక జనసాంద్రత నగరాలు భద్రతతో ఉన్నాయంటే.. అది మౌలిక వసతులు, చట్టపరమైన క్రమశిక్షణ ఫలితం. మన దగ్గర మాత్రం లైసెన్సుల జారీ అవకతవకలు, మద్యం దుకాణాలు హైవే పక్కనే, అశిక్షిత డ్రైవర్లు, ఇరుకు రోడ్లు.. ఇవన్నీ రోడ్డు ప్రమాదానికి కారణాలే.

ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఏడాదిలో ఇప్పటివరకు 3,000కు పైగా మరణాలు నమోదయ్యాయి. విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాల్లో అతివేగం 373 ప్రాణాలను బలితీసుకుంది. తెలంగాణలోనూ అదే పరిస్థితి! ఎన్‌హెచ్–65, ఎన్‌హెచ్–44, ఎన్‌హెచ్–163 వంటి జాతీయ రహదారులపై అత్యధిక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మహిళల ఉచిత ప్రయాణ పథకాలు 'మహాలక్ష్మి', 'స్త్రీ శక్తి' సమాజానికి ఆశీర్వాదమే. కానీ బస్సుల సంఖ్య పెంచకుండా రద్దీ పెరగడం డ్రైవర్లపై ఒత్తిడిని పెంచుతోంది.

ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కోవాలి. డ్రైవర్లకు శిక్షణ నివ్వాలి. నియమిత శిక్షణా కార్యక్రమాలు, లైసెన్స్ ప్రక్రియలో పారదర్శకత ఉండేలా చూసుకోవాలి. అతివేగ నియంత్రణకు స్పీడ్ కెమెరాలు, భారీ జరిమానాలు, ట్రాఫిక్ మానిటరింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. ప్రమాదకర రోడ్ల విస్తరణ, సైనేజ్, లైటింగ్, బారియర్లు ఏర్పాటు చేయాలి. మహాలక్ష్మి, స్త్రీ శక్తి వంటి పథకాల కోసం కొత్త బస్సులు సమకూర్చాలి. మీడియా, విద్యాసంస్థల ద్వారా ప్రజల్లో భద్రతా చైతన్యం పెంచాలి.

■ ముద్దం నరసింహస్వామి

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



ఎన్.టి.ఆర్
జిల్లా వార్తలు

బుధవారం 3 డిసెంబరు 2025

కమ్మేస్తున్న పొగ

నగరానికి పొంచి ఉన్న కాలుష్యం ముప్పు

విజయవాడ నగరానికి పొగ ముప్పు పొంచి ఉంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో వరి కోతలు ముమ్మరం కావడంతో పెద్ద ఎత్తున చేలల్లో ఎండుగడ్డి వ్యర్థాలను రైతులు తగలబెడుతున్నారు. దీంతో భారీగా పొగ వ్యాపిస్తుంది. ఈ పొగ అంతా విజయవాడ నగరాన్ని చుట్టుముడుతోంది. ఇప్పటికే వాయు కాలుష్యం డేంజర్ బెల్స్ మోగిస్తున్న తరుణంలో ఈ పొగతో ఇంకాస్త ప్రమాదకరంగా మారనుంది. ఈ విషయం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది.

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో వందలాది ఎకరాల్లోని గడ్డి వ్యర్థాలకు నిప్పు
- భారీగా వ్యాపిస్తున్న పొగ.. నగర ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- గుండె, క్యాన్సర్, ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులు ప్రబలే ప్రమాదం



ఆంధ్రజ్యోతి ఫోకస్

ప్రజారోగ్యంపై దుష్ప్రభావం

వరి చేలల్లో గడ్డి, ఇతర వ్యర్థాలు తగలబెట్టడం వల్ల వచ్చే పొగ ద్వారా కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్స్, పాలీసైక్లిక్ అరోమేటిక్ హైడ్రోకార్బన్స్, సల్ఫర్ డయాక్సైడ్స్‌తో పాటు ఫార్మాల్డిహైడ్, బెంజీన్, అసిటాల్డిహైడ్ వంటి అసిడిటీవ్ గ్యాసెస్, డయాక్సిన్స్, ఫ్యూరాన్లు, మీథేన్, కార్బన్ డై ఆక్సైడ్ తదితర విషతుల్య వాయువులు ఉత్పత్తి అవుతాయి. వీటిని పీల్చడం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉంది. గుండె, ఊపిరితిత్తులు, క్యాన్సర్, శ్వాశకోశ సమస్యలు, క్రానిక్ బ్రాంకైటిస్ వంటి తీవ్రమైన వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. దుమ్ము, పొగ వల్ల ఊపిరితిత్తులపై ప్రభావం పడటం వల్ల దగ్గు, ఉబ్బసం, శ్వాస తీసుకోవటంలో ఇబ్బందులు తలెత్తుతాయి. పొగ ద్వారా కళ్లల్లో మంట, నీరు కారడం, ముక్కు, గొంతు నొప్పి వంటి సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి కృష్ణాజిల్లాలో వరి కోతలు సగం వరకు పూర్తయ్యాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలను కూడా తెరిచారు. ఎన్టీఆర్ జిల్లాలో 1.20 లక్షల హెక్టార్లు, కృష్ణాజిల్లాలో 1.61 లక్షల హెక్టార్లలో వరి పంట వేశారు. దాదాపుగా రెండు జిల్లాల్లో 20 శాతం మేర ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. మళ్లీ పంటలకు భూములు సిద్ధం చేసుకునే దానిలో భాగంగా పొలాల్లోని ఎండు దుబ్బులను తొలగించటం ఖర్చుతో కూడుకున్న వ్యవహారంగా మారింది. ట్రాక్టర్‌తో దున్నటం, ఆ తర్వాత వాటిని ఏరటం రైతులకు పనిగా మారుతోంది. దీంతో ఖర్చు తగ్గించుకునేందుకు అనాలోచితంగా వరి దుబ్బులను కాల్చేస్తున్నారు.

చుట్టుముడుతున్న కాలుష్యం

ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో, విజయవాడ నగరానికి సమీపంలో ఉన్న మండలాల వరి చేలను ఎక్కువగా తగలబెడుతున్నారు. వందలాది ఎకరాల్లో నిప్పు పెట్టడం వల్ల దట్టంగా పొగ వ్యాపిస్తోంది. గాలి వాటుకు కొంత తెలంగాణ రాష్ట్రం మిగతా 4లో..

గడ్డిని కాల్చకుండా ఏం చెయ్యొచ్చు!

రైతులు ఖర్చును దృష్టిలో పెట్టుకుని గడ్డిని కాలుస్తున్నారు. అలా కాకుండా చేలకు నీరు పెట్టి వాటిని కుళ్లేలా చేయటం ద్వారా పంటకు కంపోస్టు ఎరువుగా అందించవచ్చునని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. దీని వల్ల మట్టి సారం పెరుగుతుంది. పంటలపై ఎరువుల ఖర్చు కూడా తగ్గుతుంది.

పర్యాటకశాఖ ఆస్తుల పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం వ్యవహారం వివాదాస్పదంగా మారింది. విజయవాడ డివిజన్‌లోని యూనిట్లకు ఇటీవల టెండర్లు ఆహ్వానిస్తే ప్రముఖ సంస్థలు ముఖం చాటేశాయి. ఎటువంటి అర్హతలు లేని ఒకే ఒక్క సంస్థ మాత్రం బిడ్‌ను దాఖలు చేసింది. ఈ విషయం రహస్యంగా ఉంచడంతో చర్చకు దారితీసింది. దీనిపై ఉన్నతాధికారులను సీఎంవో ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో చైర్మన్ ఆటంకాలు సృష్టిస్తున్నారని కార్యదర్శి అజయ్ జైన్ సీఎంకు ఫిర్యాదు చేశారు. ఇక్కడి వ్యవహారాలను చైర్మన్ బాలాజీ పీ4 చైర్మన్ ద్వారా సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన టెండర్లు, బిడ్లను పరిశీలించాలని సీఎంవోను ఆదేశించడం చర్చనీయాంశంగా మారింది.

పర్యాటక రచ్చ!

టూరిజం పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంపై భిన్న స్వరాలు

- విజయవాడ డివిజన్ యూనిట్ల పీపీపీకి ఇటీవల టెండర్ల ఆహ్వానం
- బిడ్ వేసేందుకు ముందుకురాని ప్రముఖ సంస్థలు
- అర్హతలు లేని ఒకే ఒక్క ప్రైవేటు సంస్థ బిడ్ దాఖలు
- ఈ విషయం రహస్యంగా ఉంచడంతో చర్చ
- దీనిపై ఉన్నతాధికారులను ప్రశ్నించిన సీఎంవో
- చైర్మన్ పీపీపీని అడ్డుకుంటున్నారని సీఎంకు సెక్రటరీ అజయ్ జైన్ ఫిర్యాదు
- ఇక్కడి వ్యవహారాలను పీ4 చైర్మన్ దృష్టికి తీసుకెళ్లిన బాలాజీ
- సీఎం వద్దకు విషయం.. టెండర్లు, బిడ్డను పరిశీలించాలని సీఎంవోకు ఆదేశం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ డివిజన్ పరిధిలోని పర్యాటక ఆస్తులను పీపీపీ (పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్య ప్రాజెక్టు)కి ఇవ్వాలన్న ప్రతిపాదనల నేపథ్యంలో టెండర్లు దక్కించుకునేందుకు అర్హత కలిగిన సంస్థలు ఒక్కటి కూడా ముందుకు రావటంలేదని తెలిసింది. హరిత బెర్మ్‌పార్క్, భవానీ ఐల్యాండ్, బాపట్ల సూర్యలంక బీచ్ రిసార్ట్స్, నాగార్జున సాగర్ రిసార్ట్స్‌ల క్లస్టర్‌కు పడిన ఒకే ఒక్క బిడ్ కూడా అర్హతలు లేని సంస్థ వేసిందన్న సంగతి వెలుగు చూసింది. ఇతర రాష్ట్రాల్లో పనిచేసిన అనుభవం కూడా లేని సంస్థ బిడ్‌ను వేసినట్టు సమాచారం. ఈ సంస్థకు తగిన ఆర్థిక పరిస్థితి కూడా లేదని తెలుస్తోంది. ఇప్పటివరకు ఎవరు మిగతా 4లో..

వ్యవసాయ శాఖ మాజీ జేడీ నాగమణెమ్మపై వేటు

- ఎరువుల డీలర్ల నుంచి వసూళ్ల ఆరోపణలు
- నాడు ఆర్‌బీకే సిబ్బంది పదోన్నతుల్లో చేతివాటం!
- సస్పెండ్ చేస్తూ వ్యవసాయశాఖ ఉత్తర్వులు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయశాఖ మాజీ జేడీ ఎస్.నాగమణెమ్మపై అధికారులు వేటు వేశారు. ఆమెను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో నాగమణెమ్మ జిల్లాలో వ్యవసాయ శాఖ జేడీగా పనిచేశారు. ఆ సమయంలో ఆమె ఎరువులు, విత్తన విక్రయ డీలర్లను వేధించినట్టు ఆరోపణలు ఉన్నాయి. వ్యవసాయ సంవత్సరం (జూన్ నుంచి) ప్రారంభమయ్యే సమయంలో నకిలీ విత్తనాల విక్రయాలు చేస్తున్నారని, నకిలీ ఎరువులను రైతులకు కట్టబెడుతున్నారని నాగమణెమ్మ ఆకస్మిక తనిఖీలు నిర్వహించేవారు. ఎరువులు, విత్తనాలు కృత్రిమ కొరత సృష్టిస్తున్న వారిని కట్టడి చేయడానికి దాడులు చేసేవారు. వాటి వెనుక ముడుపుల వ్యవహారాలు సాగినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఆమె తనిఖీలకు వెళ్లిన దుకాణాల యజమానుల నుంచి రూ.10 వేల నుంచి రూ. 20 వేల వరకు వసూలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై పలువురు డీలర్లు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కృష్ణాజిల్లా ఫెర్టిలైజర్స్ సీడ్స్ డీలర్ల అసోసియేషన్ తరఫున ఈ ఫిర్యాదులు అధికారులకు అందాయి. వాటిని పరిశీలించిన అధికారులు రాత పూర్వకంగా సంజాయిషీ ఇవ్వాలని నోటీసులు ఇచ్చారు. అభియోగాలు నమోదైన పది రోజుల్లో ఈ సంజాయిషి ఇవ్వాలని నోటీసులు ఇచ్చినప్పటికీ నాగమణెమ్మ స్పందించలేదు. ఈ అంశాలన్నింటిని పరిగణనలోకి తీసుకున్న అధికారులు ఆమెను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నాడు ఆర్‌బీకే సిబ్బంది విషయంలోనూ...

వైసీపీ ప్రభుత్వం రైతుల కోసం గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. రైతులు పండించిన పంటలను ఇక్కడ విక్రయించుకునేవారు. రైతు భరోసా కేంద్రాల్లో కార్యకలాపాలను నిర్వహించడానికి సిబ్బందిని నియమించారు. ఈ సిబ్బందికి పదోన్నతులు కల్పించే విషయంలో నాగమణెమ్మ అవకతవకలు చేసినట్టు విమర్శలు ఉన్నాయి. వారికి ఇవ్వాల్సిన పదోన్నతులు ఇవ్వకుండా అర్థాంతరంగా బదిలీలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై అందులోని సిబ్బంది ఆందోళన చేశారు. చివరికి వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించారు. నాగమణెమ్మ తీరుపై ఆర్‌బీకే సిబ్బంది ఆ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

జిల్లాలోని పురపాలక సంఘాల్లో తాగునీటి సమస్యకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెక్ పెట్టాయి. రూ.344.05 కోట్ల వ్యయంతో రక్షిత మంచినీటి పథకాలను మంజూరు చేశాయి. నందిగామ, కొండపల్లి, తిరువూరు మున్సిపాల్టీలకు ఆసియా పెట్టుబడులు, మౌలిక వసతుల అభివృద్ధి బ్యాంక్ (ఏఐఐబీ), కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకాల ద్వారా నిధులు విడుదలయ్యాయి. తలసరి నీటి వినియోగాన్ని గణనీయంగా పెంచేందుకు ఈ పథకాలు దోహదపడనున్నాయి.

జలం.. పుష్కలం

రూ.344.05 కోట్ల వ్యయంతో జిల్లాలో తాగునీటి ప్రాజెక్టులు

- నందిగామ, కొండపల్లి, తిరువూరు మున్సిపాల్టీల్లో నీటి సమస్యకు చెక్
- ఏఐఐబీ, అమృత్ పథకాల ద్వారా త్వరలో చేపట్టనున్న పనులు
- తీరనున్న ప్రజల తాగునీటి ఇబ్బందులు

(ఆంధ్రజ్యోతి, నందిగామ): నందిగామ, కొండపల్లి, తిరువూరు పురపాలక సంఘాల్లో దశాబ్దాల కాలం నాటి పథకాల ద్వారా నేటికీ మంచినీరు సరఫరా జరుగుతోంది. పట్టణాల్లో జనాభా మూడు రెట్లు పెరిగినా పాత పథకాలతోనే సర్దుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అరకొర నీటిని విడతల వారీగా సరఫరా చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. మూడు రోజులకోమారు కూడా ప్రజలకు మంచినీరు సరఫరా కావడం లేదు. వేసవిలో కనీసం వాడకానికి కూడా చుక్కనీరు అందక ప్రజలు ఇబ్బంది పడుతున్న పరిస్థితులు ఉన్నాయి. నందిగామ, కొండపల్లి మున్సిపాల్టీలకు కృష్ణా, మునేరు నదులు అతి దగ్గరలో ఉన్నప్పటికీ భూగర్భ జలాలు తగ్గి నీటి సరఫరా లేక ప్రజలు అల్లాడిపోతున్నారు. మరో వైపు జనాభా పెరుగుదలతో పట్టణాల విస్తరణ కూడా మరింత జరిగింది. విస్తరించిన ప్రాంతాలకు పైపులైన్లు వేయలేక ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. పాతకాలం నాటి పైపులైన్లు తరచూ మరమ్మతులకు గురి కావడంతో



సమర్థవంతంగా మంచినీటి సరఫరా చేయలేకపోతున్నారు. అప్పటి పైపులైన్లు ఇప్పుడు డ్రెయిన్‌ల పక్కన ఉండడం వల్ల లీకులు ఏర్పడి పలుమార్లు మురుగు నీరు సరఫరా అయ్యాయి. దీంతో అంటు వ్యాధులు ప్రబలిన సందర్భాలు కూడా ఉన్నాయి. వేసవి రాగానే మంచినీటి పథకాలకు నీరు అందకపోవడం, మిగతా 4లో..

రూ. 240.48 కోట్లతో తిరువూరులో రక్షిత మంచినీటి వ్యవస్థ

తిరువూరు మున్సిపాల్టీకి సంబంధించిన ఏఐఐబీ ద్వారా రూ.240.48 కోట్లతో మంచి నీటి పథకం ఫెర్రీ వద్ద నిర్మించనున్నారు. ఇక్కడి నుంచి 75 కిలోమీటర్ల మేర పైపులైన్ ద్వారా తిరువూరులో ఏర్పాటు చేసే నీటిశుద్ధి కేంద్రానికి చేరుస్తారు. మొత్తం 9 ఎంఎల్‌డీ లీటర్ల నీరు తిరువూరు చేరనుంది. అక్కడ ఏర్పాటు చేసే నాలుగు ట్యాంకల ద్వారా 3000 కేఎల్‌డీ నీటిని సరఫరా చేయనున్నారు. పట్టణంలో మొత్తం కుళాయిలు ఏర్పాటు చేయాలంటే 144 కిలో మీటర్ల పైపులైన్ అవసరం ఉంది. ఈ పథకంలో 87 కిలోమీటర్లు వేయనున్నారు. పట్టణంలో కేవలం 15 కిలో మీటర్ల మేర మాత్రమే పటిష్టమైన పైపులైన్ ఉంది. దీని ప్రకారం ఇక్కడ కూడా మరో 42 కిలో మీటర్ల పైపులైన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందు కోసం అదనంగా రూ.10 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. తిరువూరులో 4600 కనెక్షన్ల ద్వారా ఇంటింటికీ నీటిని అందిస్తారు.

నకిలీ మద్యం కేసులో మరో ఇద్దరు

మెమో దాఖలు చేసిన సిట్ » ఇద్దరూ నకిలీ మద్యం సరఫరాదారులే

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : నకిలీ మద్యం తయారీ కేసులో మరో ఇద్దరు కొత్త నిందితులు చేరారు. దీనికి సంబంధించి సిట్ విజయవాడలోని ఆరో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో మంగళవారం మెమో దాఖలు చేసింది. జినేష్(ఏ24), శిబు(ఏ25)లను నిందితులుగా చేర్చారు. ఈ విషయాన్ని సిట్ అధికారులు కోర్టుకు తెలియజేశారు. ఈ కేసులో తిరులశెట్టి శ్రీనివాసరావు(ఏ13)కు వారు నకిలీ మద్యం సరఫరా చేసినట్టు అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు నిందితులను కస్టడీలోకి తీసుకుని విచారించి, వారు ఇచ్చిన వాంగ్మూలాలను



పరిశీలించిన అధికారులు కొత్త నిందితుల నిగ్గు తేల్చుకున్నారు. ఈ ఇద్దరు అద్దేపల్లి జనార్దనరావు వద్ద పనిచేసినట్టు నిర్ధారించారు. ఈ ఇద్దరు నిందితులు ఒడిసా రాష్ట్రానికి చెందిన వారని సమాచారం. ఈ కేసులో నిందితులుగా అంతా దాస్, మిథున్‌దాస్, బాదల్ దాస్ ఒడిసాలోని గంజాం జిల్లాకు చెందిన వారు. వారు ప్రస్తుతం జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. వాళ్లందరినీ సిట్ కస్టడీకి తీసుకుని విచారించింది. ప్రస్తుతం జినేష్, శిబు పరారీలో ఉన్నారు. వారి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. త్వరలోనే వారిని పట్టుకుంటామని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ఈ ఇద్దరు నిందితులు జనార్దనరావు తయారు చేసిన నకిలీ మద్యాన్నే శ్రీనివాసరావుకు సరఫరా చేశారా, లేక ఎక్కడి నుంచైనా తీసుకొచ్చి ఇచ్చారా అన్నది తేలాల్సి ఉంది.

ఫలించిన ఎంపీ కేశినేని చిన్ని కృషి

- జగ్గయ్యపేటలో భారీ ఎంఎస్ఎంఈ పార్క్!
- రూ. 2,872 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చిన పారిశ్రామికవేత్తలు
- 198 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ఆసక్తి .. అసోసియేషన్‌గా ఏర్పాటు
- 50 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ
- భూములు కేటాయించాల్సిందిగా మంత్రి లోకేశ్‌ను కోరిన ఎంపీ చిన్ని 4
- మంత్రి శీనివాస్‌ను కలవాలని లోకేశ్ సూచన

జిల్లా రిజిస్ట్రార్ నుంచి నకళ్లు ఇప్పించండి

- పులివాగు వరదలకు కేడీసీసీబీలో పెట్టిన డాక్యుమెంట్లు, పాస్ పుస్తకాలు తడిచిపోయాయి
- మైలవరం ప్రజా దర్బార్‌లో కలెక్టర్‌కు పీఏసీఎస్ చైర్మన్ల వినతి



కలెక్టర్ లక్ష్మీశకు వినతిపత్రం అందిస్తున్న జి.కొండూరు మండల పీఏసీఎస్‌ల చైర్మన్లు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జి.కొండూరు కేడీసీసీ బ్యాంక్‌లో భద్ర పరిచిన రైతులకు చెందిన డాక్యుమెంట్స్, పట్టాదారు పాస్ పుస్తకాలు తడిచిపోయాయని, వారికి న్యాయం చేసేందుకు తక్షణం జిల్లా రిజిస్ట్రార్ నుంచి సర్టిఫైడ్ కాపీస్, పట్టాదారు పాస్ పుస్తకాలు, ఫ్లడ్ డ్యామేజ్ సర్టిఫికెట్లు ఇప్పించాలని మైలవరంలో మంగళవారం జరిగిన ప్రజా దర్బార్‌లో కలెక్టర్ లక్ష్మీశకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జి.కొండూరు మండలానికి చెందిన ఎనిమిది పీఏసీఎస్‌ల చైర్మన్లు అర్జీలు సమర్పించారు. జి.కొండూరు మండలంలోని ఎనిమిది పీఏసీఎస్‌ల నుంచి పంట రుణాలు పొందిన రైతులకు చెందిన పొలాల డాక్యుమెంట్స్, పట్టాదారు పాస్ పుస్తకాలు జి.కొండూరు కేడీసీసీ బ్యాంక్ సేఫ్ కస్టోడిలో ఉంచగా, గతేడాది ఆగస్టు 31న వరదలకు మిగతా 4లో..

కొక్కొ రొక్కో..

సంక్రాంతికి వస్తున్నాం..

- పౌష్టికాహారంతో రహస్యంగా, సురక్షితంగా..
- విజయవాడ శివారు ప్రాంతాల్లో భారీగా పెంపకం
- సంక్రాంతి బరులే లక్ష్యం.. రంగు, జాతిని బట్టి రేటు
- రూ.30 వేల నుంచి రూ. 2 లక్షల వరకు ధర పలుకుతున్న పుంజులు
- నచ్చిన పుంజుకోసం ఎంతైనా తగ్గేదే లేదంటున్న పందెపు రాయుళ్లు



విజయవాడ శివారు ప్రాంతంలో భారీగా పెంచుతున్న పందెపు పుంజులు





కాకి నెమలి

కాకి

కోడి డేగ

యాబ్రాస్

రసంగి

ఎర్ర కక్కెర



సేతువ



పెట్టమారి

నెమలి



తెల్ల నెమలి



కక్కెర

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ)

భోగిమంటలు, రంగ వల్లులు, గొబ్బెమ్మలు, హరిదాసు కీర్తనలు సంక్రాంతి పండుగలకు శోభ తీసుకొస్తాయి. అయితే ఇదంతా నాణెనికి ఒక వైపు మాత్రమే. మరోవైపు సంక్రాంతి పండగ మూడురోజులూ విశాలమైన బరుల్లో కొక్కో రోక్కో.. అంటూ కూతలతో కదనరంగంలో హోరెత్తించే కోడిపుంజుల రాజసం పండుగ సాంప్రదాయాల్లో అంతర్భాగమైపోయింది. జూద క్రీడ, జంతు హింస అనే నినాదాలు తరుచూ వస్తున్నప్పటికీ పందేల హోరు ప్రతీ ఏడాది నూతనత్వాన్ని సంతరించు కుంటూ అభివృద్ధి చెందుతుందన్నది జగమెరిగిన సత్యం.

బరులే లక్ష్యంగా..

ఈ ఏడాది సంక్రాంతి బరులు ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎక్కువ గానే ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనికోసమే విజయవాడ నగర శివారులోని పలు ప్రాంతాల్లో పలువురు మూడునుంచి ఐదు ఎకరాల మామిడి తోటలను లీజుకు తీసుకుని పందెపు పుంజుల పెంప కాన్ని సాగిస్తున్నారు. మంచి పిల్లలను సేకరించి వాటిని అత్యంత శ్రద్ధగా పెంచుతూ పందేలకు సిద్ధం చేస్తున్నారు. పుంజుల శిక్షణ కోసం అక్కడే స్విమ్మింగ్ పూల్ ఏర్పాటుచేశారు. కదనరంగంలో కోడి అలసిపోకుండా.. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పుంజును ఈత వేయిస్తున్నారు. జీడి పప్పు, బాదంపప్పు, రాగులు, సజ్జలు, ఉడికించిన కోడి గుడ్లు, మటన్ తదితర పౌష్టికాహారాన్ని ఇచ్చి బలిష్టంగా తయారు చేస్తున్నారు. సాధారణంగా ఏడునెలల వయసు దాటితే పుంజు కూతకు వస్తుంది. అప్పుడప్పుడు ప్రాక్టీస్ కోసం వామప్ పోటీలు నిర్వహిస్తుంటారు. పుంజుల కోసం 24/7 మెడికల్ కేర్, ప్రత్యేక శునకాలతో రక్షణ ఏర్పాట్లు చేశారు.

కొక్కో రోక్కో.. అంటూ సంక్రాంతి పందెపు పుంజులు కూతపెడుతున్నాయి.. ఏడాదిగా పౌష్టికాహారం తీసుకుని బలిష్టంగా తయారై.. బరిలో దిగేందుకు ఉదయం సాయంత్రం చెరువుల్లో ఈతకొడుతూ యజమాని కనుసన్నల్లో వామప్ మ్యాచ్‌ల్లో పాల్గొంటూ కదనరంగానికి రెడీ అవుతున్నాయి. విజయవాడ నగర శివారులోని మామిడి తోటల్లో 24/7 మెడికల్ కేర్, ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్న శునకాల రక్షణ వలయంలో సురక్షితంగా, రహస్యంగా ఇవి పెరుగుతున్నాయి. మరో నెలరోజుల్లో సంక్రాంతి సంబరాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పందెపు రాయుళ్లు అనువైన రంగుల పుంజుల కోసం ఇప్పటి నుంచే వెదుకులాట ప్రారంభించారు. కావాల్సిన పుంజు దొరికితే ఎంత ధరైనా తగ్గేదే లేదంటున్నారు.

పూర్వం రాజుల కాలంలో రాజ్యాల మధ్య జరిగే యుద్ధాల్లో మనుషుల ప్రాణ నష్టాన్ని నివారించేందుకు ముందుగా రాజులు కోడి పందేలు వేసేవారని, గెలిచిన పుంజు యజమాని రాజుకు ఓడిన పుంజు యజమాని రాజు తన రాజ్యాన్ని అప్పగించే సంస్కృతి కొనసాగేది.. అని కోళ్ల కోసమే పుట్టుకొచ్చిన కుక్కుట శాస్త్రం చెబుతోంది. నాటి నుంచి రాజుల పౌరుషానికి ప్రతీకగా కోడి పందేలు సాంప్రదాయంగా మారిపోయాయి. కోడిపుంజు ఈకలను బట్టి ఒక్కో కోడికి ఒక్కో రంగును కుక్కుట శాస్త్రం కేటాయించింది. ఏఏ సమయాల్లో ఏఏ రంగు పుంజు గెలుస్తుందో ఈ శాస్త్రంలో పేర్కొనబడింది. శాస్త్రాన్ని అవపోసన పట్టిన ఇరువురు వ్యక్తులు బరిలో వదిలే రెండు పుంజుల్లో ఒకటి మాత్రమే గెలవడం కొసమెరుపు.

రంగును బట్టి రేటు

కోడి డేగ, కాకి డేగ, కాకి, తెల్ల నెమలి, సేతువా, కాకి నెమలి, నెమలి, కొంకిరాయి, ఎర్ర కొంకిరాయి, పచ్చ కాకి, రసంగి, పెట్టమారి.. ఇవీ బరిలో పాల్గొనే కోడి పుంజుల పేర్లు. వీటిల్లో కోడి డేగకు అత్యధికంగా పందెపు రాయుళ్ల ఫ్యాన్స్ ఉంటారు. సంక్రాంతి సమయంలో బరుల వద్ద ఎక్కువగా కోడి డేగలకే స్థానం ఇస్తారు. విజయవాడ నగర శివారులో పెరుగుతున్న కోడి పుంజుల కోసం ఇప్పటి నుంచే పందెపు రాయుళ్లు జల్లెడ పడుతున్నారు. జూదగాళ్లు జాతకాలను అత్యధికంగా విశ్వసిస్తారని నానుడి ఉంది. పందెపు రాయుళ్లు ముందుగా వారి జాతకాన్ని తెలుసుని దానికి కుక్కుట శాస్త్రంలోని కోడి రంగుకు సింక్ చేసి అలాంటి వాటి కోసం వెదుకులాట ప్రారంభించారు. డిమాండ్‌ను బట్టి పెంపకందారులు ఒక్కో పుంజును రూ.35 వేలనుంచి రూ.2 లక్షలకు విక్రయిస్తున్నారు. ఏడాదిన్నర పెంచితే రూ. లక్షల్లో ఆదాయం వస్తుండటంతో పెంపకం ఓ కుటీర పరిశ్రమగా మారిపోయింది.



భవానీల దీక్ష విమరణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో

భవానీల దీక్ష విరమణ ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయండి

- ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 11 నుంచి 15 వరకు జరగనున్న భవానీ దీక్ష విరమణల ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలని ఈవో వీకే శీనానాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఇంజనీరింగ్ అధికారులతో కలసి దుర్గగుడి పరిసర ప్రాంతాలు, క్యూలు, దుర్గగుడి ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న హోమగుండాలు, ఇరుముడుల కౌంటర్లు, కేశఖండనశాల, స్నానఘాట్లను పరిశీలించి ఆయాప్రాంతాల్లో చేపట్టనున్న ఏర్పాట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. పనుల నాణ్యతలో ఎటువంటి అలసత్వం వహించొద్దని, ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని సూచించారు. దర్శన సమయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భవానీ దీక్షల విరమణలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందుస్తుగానే లోటుపాట్లను గుర్తించి తగినచర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కమ్మేస్తున్న పొగ

(3వ పేజీ తరువాయి)

సూర్యాపేట, ఖమ్మం జిల్లాల వైపు వెళ్తోంది. మరికొంత రాజధాని అమరావతి, విజయవాడ నగరాలను చుట్టిముట్టేస్తోంది. కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గంలోని బాపులపాడు మండలంలో ప్రస్తుతం పెద్ద ఎత్తున చేలలో వ్యర్థాలను దగ్ధం చేస్తున్నారు. తూర్పుకృష్ణాలో పెడన, బంటుమిల్లి, పెదపారుపూడి మండలాల్లో వరి కోతలు పూర్తి కావటంతో వందలాది ఎకరాల్లో వ్యర్థ గడ్డిని తగలబెడుతున్నారు. పశ్చిమ ఎన్టీఆర్ జిల్లా, తూర్పు కృష్ణాజిల్లాలకు మధ్యన విజయవాడ నగరం ఉంది. దీంతో రెండు జిల్లాల ప్రభావం విజయవాడ మీద పడుతోంది. గాలి వాటుకు కొంత తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట, ఖమ్మం జిల్లాల వైపు వెళ్తోంది. మరికొంత రాజధాని అమరావతి, విజయవాడ నగరాలను చుట్టిముట్టేస్తోంది. కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గంలోని బాపులపాడు మండలంలో ప్రస్తుతం పెద్ద ఎత్తున చేలలో వ్యర్థాలను దగ్ధం చేస్తున్నారు. తూర్పుకృష్ణాలో పెడన, బంటుమిల్లి, పెదపారుపూడి మండలాల్లో వరి కోతలు పూర్తి కావటంతో వందలాది ఎకరాల్లో వ్యర్థ గడ్డిని తగలబెడుతున్నారు. పశ్చిమ ఎన్టీఆర్ జిల్లా, తూర్పు కృష్ణాజిల్లాలకు మధ్యన విజయవాడ నగరం ఉంది. దీంతో రెండు జిల్లాల ప్రభావం విజయవాడ మీద పడుతోంది.

పర్యావరణానికి చేటు

చేలల్లో గడ్డి తగలబెట్టడం వల్ల పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. భూమిలో వేడిని పెంచడంతో పాటు అత్యధిక వర్షాలు, కొండ చరియలు విరిగిపడటం వంటి సహజ విపత్తులకు కూడా పరోక్షంగా ఈ కాలుష్యం కారణం కానుంది. మట్టి సారాన్ని నష్టపరచటమే కాకుండా వృక్ష సంపద, వన్య ప్రాణులపై ప్రభావాన్ని చూపిస్తుంది.

కాలుష్యంపై రైతులకు అవగాహన అవసరం

పంటలు వేసే ముందు, కోతల ముందు రైతులకు అధికారులు పెద్ద ఎత్తున వ్యర్థ నిర్వహణ పద్ధతులపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. పర్యావరణానికి హాని కల్పిస్తున్న తీరు, ప్రజల ఆరోగ్యం ఎలా దెబ్బతింటుందో వివరించాలి. విద్యార్థుల ద్వారా తమ తల్లిదండ్రులకు చెప్పించటం వంటివి చేయాలి. అయినా పట్టించుకోకపోతే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

గడ్డిని కాల్చకుండా ఏం చెయ్యొచ్చు!

రైతులు ఖర్చును దృష్టిలో పెట్టుకుని గడ్డిని కాలుస్తున్నారు. అలా కాకుండా చేలకు నీరు పెట్టి వాటిని కుళ్లేలా చేయటం ద్వారా పంటకు కంపోస్టు ఎరువుగా అందించవచ్చునని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. దీని వల్ల మట్టి సారం పెరుగుతుంది. పంటలపై ఎరువుల ఖర్చు కూడా తగ్గుతుంది.

అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్ల ఆధ్వర్యంలో ధర్నా

విజయవాడ : అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు విజయవాడ రైల్వే స్టేషన్ నుంచి ధర్నాచౌక్ వరకు అగ్రిగోల్డ్ బాధితుల ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం 11 గంటలకు ధర్నాచౌక్‌లో ఆవేదన దీక్ష జరుగుతుందన్నారు. ఈ ధర్నాలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు, పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు.

జగ్గయ్యపేటలో ఎంఎస్ఎంఈ పార్క్!

- ఫలించిన ఎంపీ కేశినేని చిన్ని కృషి
- రూ. 2,872 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చిన పారిశ్రామికవేత్తలు
- 198 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ఆసక్తి
- 50 వేల మందికి ఉద్యోగాలకు హామీ
- భూములు కేటాయించాల్సిందిగా మంత్రి లోకేశ్‌ను కోరిన ఎంపీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో భారీ ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు కాబోతోంది. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కృషి కారణంగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు రూ. 2,872 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చారు. ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు స్థలం కేటాయించాల్సిందిగా విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని మంగళవారం ఢిల్లీలో లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. జగ్గయ్యపేటలో ప్రతిపాదించిన ఎంఎస్ఎంఈ పార్కుకు 826 ఎకరాల స్థలం అవసరమౌతోంది. గతంలో ఎంపీ చిన్ని, కలెక్టర్ లక్ష్మీశ జగ్గయ్యపేటలో రెండు వేల ఎకరాల ప్రభుత్వ భూములను గుర్తించారు. ఆ భూముల్లో 826 ఎకరాలను ఎంఎస్ఎంఈ పార్కుకు కేటాయించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. లోకేశ్ దీనిపై సానుకూలంగా స్పందించి పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో సమావేశం కావాలని సూచించారు. జగ్గయ్యపేటలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు 198 మంది ముందుకు వచ్చారు. రూ. 2,872 కోట్ల పెట్టుబడికి, 57 వేల ఉద్యోగాల కల్పనకు హామీ ఇచ్చారు.

ఎంఎస్ఎంఈ అసోసియేషన్‌కు భూ కేటాయింపులు ఇలా

మొత్తం 198 పరిశ్రమల్లో ఎకరం లోపు భూములు అడిగిన వారు 56 మంది ఉన్నారు. వీరికి 18 ఎకరాల భూమి కావాల్సి వస్తోంది. మొత్తం 856 మందికి ఉపాధి కల్పించనున్నాయి. రూ.37 కోట్లు మేర పెట్టుబడులు పెట్టనున్నాయి. వీటి° నిరంతరాయ విద్యుత్ కోసం 1900 కేవీఏ విద్యుత్‌ను అందించాల్సి ఉంటుంది. ఎకరం పైన భూమి అడిగిన పారిశ్రామికవేత్తలు 142 మంది ఉన్నారు. మొత్తం 408 ఎకరాల భూములు కావాల్సిన అవసరం ఉంది. మొత్తం 6,247 మందికి ఉపాధి కల్పించనున్నారు. రూ. 585 కోట్ల మేర వీరంతా పెట్టుబడి పెట్టనున్నారు. వీరి కోసం 13,800 కేవీఏ విద్యుత్‌ను అందించాల్సి ఉంటుంది. భారీ పరిశ్రమ ఏర్పాటుకు ఒకరు ముందుకు వచ్చారు. ఆ సంస్థకు 400 ఎకరాల భూములు కావాలని ప్రతిపాదించారు. మొత్తం 50 వేల ఉద్యోగావకాశాలను ఇవ్వనున్నారు. రూ. 250 కోట్ల మేర పెట్టుబడులు పెట్టనున్నారు. ఈ పరిశ్రమ కోసం 24,700 కేవీఏ విద్యుత్‌ను అందించనున్నారు.

సాగునీటి సంఘాల వ్యవస్థతో రైతులకు భాగస్వామ్యం

- సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆళ్ల గోపాలకృష్ణ

కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి వ్యవసాయానికి కేవలం సాంకేతిక నైపుణ్యం మాత్రమే చాలదని, సామాజిక పరిజ్ఞానం కూడా అవసరమని భావించిన రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి సంఘాల వ్యవస్థతో రైతులకు నిర్ణయాత్మక భాగస్వామ్యాన్ని కల్పించిందని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు అన్నారు. మంగళవారం విజయవాడ జలవనరులశాఖ ఆవరణలో రైతుశిక్షణ కేంద్రంలో ఉమ్మడి కృష్ణాజిల్లా నాగార్జున సాగర్ ఎడమకాలువ పరిధిలోని సాగునీటి వినియోగదారుల సంఘాలకు బాధ్యతలను పెంపొందించడంపై జలవనరులశాఖ అధ్వర్యంలో సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎం.ఆర్.మొహిద్దీన్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆళ్ల మాట్లాడుతూ, సాగునీటి సంఘాల అధ్యక్షులు పంట క్యాలెండర్లు, వారబందీ అమలులో సహకరించడం, వివాదాల పరిష్కారం, నేల-నీటి నాణ్యతను అంచనాకు కృషి చేయాలని సూచించారు. సాగర్ ఎడమకాలువ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు మాట్లాడుతూ, నాగార్జునసాగర్ కాలువ రెండు, మూడు జోన్‌లలో 3.67 లక్షల ఎకరాల ఆయకట్టు వుందని దీన్ని ఆనుకొని చెరువులు, బోర్లు కింద 1.77 లక్షల ఎకరాల ఆయకట్టును పెంచడానికి సాగునీటి సంఘాల ప్రతినిధులు కృషిచేయాలని, నీటి సంఘాలకు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు అప్పగించిన పనులను డిసెంబరు నెలాఖరు లోపు పూర్తిచేయాలని సాగునీటి సంఘాల ప్రతినిధులకు సూచించారు. భూగర్భ జలశాఖ డిప్యూటీ డైరక్టర్ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ, వాగులపై చెక్ డ్యాంలు, చెరువుల పూడికతీత, కాలువల పూడిక తీత తదితర నీటి సంరక్షణ పనులను సాగునీటి సంఘాల ప్రతినిధులు చేపట్టి భూగర్భ జలాల పరిరక్షణ పెంపొందించాలన్నారు. సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎం.ఆర్.మోహిద్దీన్ మాట్లాడుతూ ప్రాజెక్టు కమిటీ పరిధిలోని నీటి నిర్వహణను మెరుగుపరచడానికి 9 సబ్ డివిజన్ పరిధిలో 90 మంది అవుట్‌సోర్సింగ్ కింద లస్కర్లను నియమించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాద నలు పంపామని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు, నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు, ఎన్ఎస్పీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కె.రామదాసు, కె.కిషోర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు మరియు జలవనరుల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటక రచ్చ!

(3వ పేజీ తరువాయి)

టెండర్లు వేశారన్నది కూడా ఏపీటీడీసీ అధికారులు రహస్యంగా ఉంచారు. ఈ బిడ్‌ల వ్యవహారం వివాదాస్పదం కావటంతో తాజాగా సీఎంవో కార్యాలయం ఆరా తీయటంతో అర్హతలు లేని సంస్థ బిడ్లు వేసినట్టుగా తెలిసింది. దీనిపై సీఎంవో కార్యాలయం పర్యాటక శాఖ ఉన్నతాధికారులను ప్రశ్నించినట్టు సమాచారం. దీనిపై ఏం చేయాలో తెలియక పర్యాటక శాఖ ఉన్నతాధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. నగరంలోని మినర్వా, లెమన్ ట్రీ, స్టెర్లింగ్స్ అనే సంస్థలను బిడ్లు వేయాల్సిందిగా ఓ ఉన్నతాధికారి వారికి ఫోన్లు చేసి బతిమిలాడుతున్నట్టు సమాచారం. సీఎంవో కార్యాలయానికి వెళ్లే వరకు ఈ వ్యవహారాలేవీ బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

ఏపీటీడీసీ చైర్మన్‌పై సీఎంకు ఫిర్యాదు

ఏపీటీడీసీ చైర్మన్ బాలాజీపై రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక కార్యదర్శి అజయ్ జైన్ ఫిర్యాదు చేసినట్టు సమాచారం. పర్యాటక యూనిట్ల పీపీపీకి సంబంధించి ఔత్సాహిక సంస్థలను రానీయకుండా ఆయన అడ్డుకుంటున్నారని ఆరోపించినట్టు తెలిసింది.

కుటుంబరావును కలిసిన బాలాజీ

తనపై సీఎం చంద్రబాబుకు అజయ్ జైన్ ఫిర్యాదు చేసిన నేపథ్యంలో.. ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ రాష్ట్ర ప్రభుత్వ పీ4 చైర్మన్ కుటుంబరావును కలిసినట్టు తెలిసింది. పర్యాటక యూనిట్లను అజయ్ జైన్ బలవంతంగా పీపీపీ చేయాలని చూస్తున్నారని చెప్పినట్టు సమాచారం. లాభదాయకంగా మధ్య తరగతి వర్గాలకు అందుబాటులో ఉన్న పర్యాటక యూనిట్లను పీపీపీకి ఇవ్వాల్సిన అవసరం లేదని, బలవంతంగా ప్రైవేటు సంస్థల చేతుల్లో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని వివరించినట్టు తెలిసింది. దీనిపై స్పందించిన కుటుంబరావు ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతానని బాలాజీకి చెప్పినట్టు సమాచారం. ఆ తర్వాత సీఎంతో ఆయన మాట్లాడినట్టు తెలిసింది. స్పందించిన చంద్రబాబు అసలేం జరుగుతుందో ఆరా తీయమని సీఎంవో కార్యాలయ ఉన్నతాధికారులను ఆదేశించినట్టు తెలిసింది. ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు టెండర్లను ఎలా పిలిచారు? నిబంధనలు ఏమిటి? బిడ్లు వేసిన సంస్థలు, వాటి అర్హతల పూర్తి సమాచారాన్ని తెప్పించుకున్నారని సమాచారం. టెండర్ల విధానం బాగానే ఉన్నా.. బిడ్లు వేసిన సంస్థలు అర్హతలు కలిగినవి కాదని గుర్తించి వాటి గురించి ప్రశ్నించినట్టు తెలిసింది.

లాభదాయక యూనిట్ల పీపీపీని వ్యతిరేకిస్తున్న చైర్మన్, ఎండీ!

పర్యాటక యూనిట్ల పీపీపీపై రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి అజయ్ జైన్ చూపిస్తున్న అత్యుత్సాహం ఏపీటీడీసీలో కింది స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు అందరికీ తీవ్ర ఆగ్రహం తెప్పిస్తోందని తెలిసింది. కొత్తగా అభివృద్ధి చేయాలనుకున్న వాటిని పీపీపీ కిందకు తీసుకురావాలికానీ, లాభదాయక యూనిట్లను పీపీపీకి అప్పగించాల్సిన అవసరం ఏముందని అభిప్రాయపడుతున్నారని సమాచారం. లాభదాయక యూనిట్ల పీపీపీని ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి, చైర్మన్ బాలాజీలు తీవ్రంగా వ్యతిరేకించినట్టు తెలిసింది.

మెగా పీటీఎం 3.0కి పకడ్బందీ ఏర్పాట్లు

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్,డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర లక్ష్యాలు, విద్యారంగ సంస్కరణలకు అనుగుణంగా రాష్ట్రప్రభుత్వం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలల మధ్య సంబంధాలను బలోపేతం చేస్తూ విద్యార్థుల సమగ్ర వికాసం లక్ష్యంగా మెగా పీటీఎం (తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు) కార్యక్రమాలు నిర్వహిస్తోందని, ఇందులో భాగంగా ఈనెల 5న మెగా పీటీఎం 3.0 జరగనుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కార్యక్రమ సన్నద్ధతపై కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం కలెక్టరేట్‌లో ఎంఈవోలు, ఇంటర్మీడియట్ అధికారులతో ప్రత్యక్షంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మెగా పీటీఎం స్ఫూర్తికి అనుగుణంగా కార్యక్రమ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, అకడమిక్‌గా విద్యార్థుల సమగ్ర ప్రగతి నివేదికల (హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు)పై ముఖాముఖి చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందించడంపై దృష్టిసారించాలన్నారు. పాఠశాలల్లో ఈ ఏడాది కొత్తగా అసెస్‌మెంట్ బుక్‌లెట్‌ను ప్రవేశపెట్టారని, ఇందులో పిల్లలు పరీక్షలు ఎలా రాశారు, వారు సాధించిన పురోగతి, పొందిన ఫలితాలు ఇవన్నీ ప్రోగ్రెస్ కార్డులో ఉంటాయన్నారు. కేవలం మార్కులే కాకుండా పిల్లల విద్యాభివృద్ధి, శారీరక ఆరోగ్యం, సామాజిక నైపుణ్యాలు, భావోద్వేగ సమతుల్యత, మేధో సామర్థ్యాలు, సైన్స్ ప్రయోగ సామార్థ్యాలు వంటివన్నీ నమోదై ఉంటాయన్నారు. చిన్నారుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచడంలో తల్లిదండ్రులు ఎలాంటి సహాయసహకారాలు అందించాలనే విషయంపైనా దిశానిర్దేశం చేయాల్సి వుంటుందని కలెక్టర్ తెలిపారు. రాష్ట్రప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మెగా పీటీఎం 3.0కు ఏర్పాట్లు చేయాలని, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులను కార్యక్రమానికి ఆహ్వానించాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు. సమావేశంలో డీఈవో యూవీ సుబ్బారావు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి బి.ప్రభాకర్, సమగ్ర శిక్ష ఏపీసీ ఎం.రజనీకుమారి, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

జలం.. పుష్కలం

(3వ పేజీ తరువాయి)

మరమ్మతులతో నీటి సరఫరా రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శిథిలావస్థకు చేరుతున్న ఈ పథకాల వినియోగం కోసం మునిసిపల్ నిధులు పెద్దయెత్తున వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం మంజూరైన మంచి నీటి పథకాల నిర్మాణం పూర్తయితే ఈ మూడు మున్సిపాల్టీల ప్రజలు మినరల్ వాటర్ బాటిళ్ల కంటే అత్యంత శుద్ధితో కూడిన నీటిని అందుకోనున్నారు. కేవలం తాగునీరే కాకుండా సాధారణ వినియోగానికి కూడా ఈ నీటినే వినియోగించే అవకాశం ఉంది. మొదటి ఏడు సంవత్సరాల పాటు పథకాలు నిర్మించిన కాంట్రాక్టర్లే నిర్వహణ బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. దీని వల్ల నిర్మాణ లోపాలను వారే సరి చేస్తారు. దీని వల్ల మున్సిపాల్టీలపై ఆర్థిక భారం పడదు.

నందిగామకు రూ.103 కోట్లు మంజూరు

నందిగామ మున్సిపాల్టీలో 55 వేల జనాభా ఉంది. పరిసర గ్రామాల నుంచి నిత్యం పది వేల మంది వరకూ వచ్చి వెళుతుంటారు. దీంతో మొత్తం 65 వేల మంది జనాభా లెక్కన ప్రతి ఒక్కరికీ 135 లీటర్ల నీటిని అందించేందుకు రూ.103 కోట్లతో ఏఐబీ ప్రాజెక్ట్ నిర్మిస్తున్నారు. కృష్ణానదిపై గుడిమెట్ల వద్ద నిర్మించే ఈ పథకం ద్వారా 18 కిలో మీటర్ల మేర నీరు ప్రవహించి నందిగామ పట్టణంలోని అనాసాగర వద్ద ఏర్పాటు చేసిన ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు 12.5 మిలియన్ లీటర్ల నీరు చేరుతుంది. అత్యాధునిక విధానంతో ఇక్కడ నీటిని శుద్ధి చేసి పట్టణంలో ఏర్పాటు చేయనున్న నాలుగు ట్యాంక్‌లకు చేరుస్తారు. వీటి సామర్థ్యం 3800 కిలో లీటర్లు. అక్కడి నుంచి కుళాయిల ద్వారా ఇంటింటికీ నీటిని అందించనున్నారు. ఇందు కోసం పట్టణంలో 4500 కుళాయిలను ఇంటింటికీ ఇవ్వనున్నారు. నలభై కిలో మీటర్ల మేర పైపులైన్ నిర్మాణం చేపట నున్నారు. వాస్తవానికి విస్తరించి ఉన్న నందిగామ పట్టణంలో 103 కిలో మీటర్ల మేర పైపులైన్ వేయాల్సి ఉంది. ఈ పథకం ద్వారా నలభై కిలోమీటర్ల వేస్తున్నారు. పాత పైపులైన్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన 24 కిలో మీటర్ల పైపులైన్ మాత్రమే ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు. పురాతన కాలం నాటి సిమెంట్ పైపులైన్ ద్వారా నీటి పంపిణీ సురక్షితం కాదని, వాటి స్థానంలో కొత్త పైపులైన్ వేయాల్సి ఉంది. ఇందు కోసం ప్రాజెక్ట్ అంచనా రూ.8.5 కోట్ల మేర పెంచాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. అలా చేస్తే పట్టణంలోని అన్ని ప్రాంతాలకూ సమర్థవంతంగా నిరంతరాయ నీటి సరఫరా చేయవచ్చని చెబుతున్నారు. ఈ పథకం పూర్తయితే 2050 నాటికి పెరగనున్న జనాభాకు కూడా తలకు 135 లీటర్ల నీరు అందించే అవకాశం ఉంది.

కొండపల్లిలో రూ.57.15 లక్షలతో ఏర్పాటు

కొండపల్లి మున్సిపాల్టీకి ఇప్పటికే పురా పథకం ద్వారా మంచి నీరు సరఫరా అవుతుంది. పట్టణ జనాభా 71 వేలపైనే ఉంది. ఈ మున్సిపాల్టీకి అమృత్ పథకం ద్వారా రూ.57.15 లక్షలతో ఫెర్రీ వద్ద పథకాన్ని ఏర్పాటు చేస్తున్నారు. అక్కడి నుంచి 2.9 కిలోమీటర్ల మేర పైపులైన్ ద్వారా నీటిని వీటీపీఎస్ సమీపంలో ఏర్పాటు చేయనున్న నీటిశుద్ధి పథకానికి చేరుస్తారు. అక్కడి నుంచి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న ఐదు ట్యాంకుల ద్వారా కుళాయిలకు సరఫరా చేయనున్నారు. మొత్తం 4100 కిలో లీటర్ల నీటిని పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే పట్టణంలో యాభై కిలో మీటర్ల మేర అంతర్గత పైపులైన్ ఉండగా, కొత్త పథకం కింద 46 కిలో మీటర్ల పైపులైన్ ఏర్పాటు చేయనున్నారు. వీటి ద్వారా ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేస్తారు. కొండపల్లి పట్టణ విస్తీర్ణం, స్వరూపం ఆధారంగా మొత్తం 164 కిలో మీటర్ల మేర పైపులైన్ వేస్తేనే ఇంటింటికీ కుళాయి ఇచ్చే అవకాశం ఉంటుందని అధికారులు అభిప్రాయ పడుతు న్నారు. ఇందు కోసం మరో రూ.15 కోట్ల అంచనాలు రూపొందించినట్లు తెలిపారు. పైపులైన్ పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసి పట్టణంలో 12,200 ట్యాప్‌లు ఏర్పాటు చేయనున్నట్లు చెబుతున్నారు. ఇదే పనిలో భాగంగా అసంపూర్ణంగా నిలిచి ఉన్న పాత పురా పథకం పనులు కూడా పూర్తి చేసి పూర్తి సామర్థ్యంతో పని చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	137,146, 157
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 665

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

భారతీనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర లయోలా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎ.శామ్యూల్ దయాకర్, డాక్టర్ ఆర్.జాన్, కె.ప్రకాశరావు ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు, వలంటీర్ల సహాయంతో నిర్వహిస్తున్న పరిసరాల పరిశుభ్రత, సమాజంలో మార్పు కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వారం రోజుల నుంచి మూడో డివిజన్‌లోని అరుల్‌నగర్, విజయనగర్ కాలనీ, గంగిరెద్దుల దిబ్బ ప్రాంతాల్లో పరిసరాలను శుభ్రం చేయటం, శీతాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలపడం వంటి పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 150మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

19వ డివిజన్‌లో ప్రజాదర్బార్

లబ్బీపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 19వ డివిజన్ లబ్బీపేట వైవీరావు హాస్పటల్ ఏరియాలో మంగళవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించి, సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంక్షేమ పాలనకు నాంది పలుకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు భాగం సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

పాలకవర్గం వస్తేనే సమస్యలు పరిష్కారం

● ఐలా మాజీ చైర్మన్ దుర్గాప్రసాద్

ఆటోనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జవహర్ ఆటోనగర్‌లోని ఐలా సర్వీస్ సొసైటీకి ఎన్నికలు జరిగి పాలకవర్గం వస్తేనే అన్ని సమస్యలు పరిష్కారం అవతాయని ఐలా మాజీ చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత మూడేళ్ల నుంచి ఆటోనగర్ ఐలాకు ఎన్నికలు జరగలేదని, దీంతో ఆటోనగర్‌లో అధ్వానంగా రోడ్లు, అస్తవ్యస్తంగా డ్రెయినేజీ ఉన్నాయని తెలిపారు. మేజర్ డ్రెయినేజీలు పూడికతో నిండి మురుగునీరు ముందుకు వెళ్లక నిలిచిపోతుందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భారతీనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలోని విద్యుత్‌లైన్లు మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వహక ఇంజనీర్ పి.హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళానగర్, నలంద స్కూల్ ఏరియా, మున్సిపల్ ఎంప్లాయీస్ కాలనీ, ఎంజీ రోడ్డు, పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

5 నుంచి నేచర్ ఎగ్జిబిషన్

మొగల్రాజపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రోజ్ సొసైటీ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 8వరకు నేచర్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మొగల్రాజపురం సిద్ధమనేని రోడ్డులో ఉన్న సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో జరిగే ఈ ప్రదర్శనలో దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి మొక్కలు, పూలతో పాటు గార్డెనింగ్ సామగ్రి ఉంటాయని తెలిపారు.

టీటీలో శాతవాహన జట్టుకు ప్రథమ స్థానం



టీటీ క్రీడాకారులను అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో సోమవారం జరిగిన కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల టేబుల్ టెన్నిస్ పోటీల్లో శాతవాహన కళాశాల జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.బ్రహ్మయ్య తెలిపారు. ఈ విజయంతో క్రీడాకారులు సాయితేజ, గోవిందులు కేయూ తరపున సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జట్టులోని విద్యార్థులను ప్రిన్సిపాల్ బ్రహ్మయ్య, ఫిజికల్ డైరెక్టర్ బి.సిహెచ్ సంగీతరావు, లెక్చరర్లు తదితరులు అభినందించారు.

నగరాభివృద్ధే లక్ష్యంగా బడ్జెట్ ఉండాలి

కమిషనర్ ధ్యానచంద్ర



మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా బడ్జెట్ ఉండాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం ప్రధాన కార్యాలయంలో కమిషనర్ తన చాంబర్‌లో శాఖధిపతులతో 2026-27 బడ్జెట్ అంచనాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా రెవెన్యూ, క్యాపిటల్, ఆదాయం, ఖర్చులపై సమీక్షించారు. నగరాభివృద్ధికి, శాఖలవారీగా అయ్యే ఖర్చులను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ప్రజా సంక్షేమం, నగరాభివృద్ధి కోసం చేసే అభివృద్ధి కార్యక్రమాలు, నగర స్వచ్ఛత, ప్రజారోగ్యానికి ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో శాఖధిపతులు తెచ్చిన బడ్జెట్ అంచనాలపై తమ సిబ్బందితో మరొకసారి సమీక్షించి వచ్చేవారం నిర్వహించే సమీక్ష సమావేశంలో సమర్పించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి. చంద్రశేఖర్, సీసీపీ కె. సంజయ్ రత్నకుమార్, సీఎంహెచ్‌వో డాక్టర్ కె. అర్జునరావు, ఇన్‌చార్జి సీఈ పి. సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ జి. సృజన, ఎస్టేట్ ఆఫీసర్ ఎ.శ్రీధర్, డీఎఫ్‌వో మాల్యాద్రి, డిప్యూటీ డైరెక్టర్ హార్టీకల్చర్ చంద్రశేఖర్, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ లత, తదితరులు పాల్గొన్నారు.

పటమట రైతుబజార్‌లో మంత్రి నాదెండ్ల తనిఖీలు



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల

విజయవాడ, డిసెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): పటమట రైతు బజార్‌ను పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం తనిఖీ చేసి, కూరగాయల ధరలను పరిశీలించారు. అక్కడికి వచ్చిన ప్రజల నుంచి అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకున్నారు. అనంతపురం నుంచి వస్తున్న గింజరకం చిక్కుడుకాయలు, గోరుచిక్కుడు, టమాటా తదితర కూరగాయలు అందుబాటులో లేవని వినియోగదారులు మంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన ఆయన అన్ని రకాల కూరగాయలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బియ్యం, ఇతర ధాన్యాలు నాణ్యతతో విక్రయించాలన్నారు. రైతుబజార్, పరిసర ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో రైతుబజార్ అధికారి ఎం.రమేష్, ఇతర అధికారులు ఉన్నారు.

సిద్ధార్థ వైద్య కాలేజీకి ఉత్తమ ప్రదర్శన అవార్డు



ప్రశంసాపత్రాన్ని ప్రదర్శిస్తున్న ప్రిన్సిపాల్ ఏడుకొండలరావు, తదితరులు

ప్రభుత్వాసుపత్రి, డిసెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా సిద్ధార్థ మెడికల్ కాలేజీలోని మైక్రో బయాలజీ విభాగం ఇచ్చిన ప్రదర్శనకు జిల్లా స్థాయి ఉత్తమ ప్రదర్శన అవార్డు వచ్చినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఏడుకొండలరావు తెలిపారు. కాలేజీ మైక్రోబయాలజీ విభాగంలోని హెచ్ఐవీ వైరల్ లోడ్ ల్యాబొరేటరీ, హెచ్ఐవీ స్టేట్ రిఫరెన్స్ ల్యాబొరేటరీలకు ఈ అవార్డు వచ్చినట్లు వివరించారు. ఈ అవార్డును కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, ఏపీఎస్ఏసీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కె.నీలకంఠరెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ సుహాసిని చేతుల మీదుగా అందుకున్నట్లు చెప్పారు. ఈ ప్రశంసాపత్రం సాధించేందుకు కృషి చేసిన అధ్యాపకులు, టెక్నీషియన్‌లను మంగళవారం ప్రిన్సిపాల్ ఆయన చాంబర్‌లో అభినందించారు.

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకి భవనం నిర్మించాలి

● ఇండియన్ అంబేడ్కర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్

విజయవాడ , డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి నూతన భవనాలు నిర్మించి, అధ్యాపకులను నియమించడంతో పాటు తరగతులను ప్రారంభించాలని ఇండియన్ అంబేడ్కర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ మంగళవారం ప్రభుత్వానికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం యూనివర్సిటీకి వైస్‌చాన్సలర్‌ను నియమించినప్పటికీ ఇంత వరకు ఏ విధమైన చర్యలు తీసుకోలేదన్నారు. యూనివర్సిటీకి అనుబంధంగా స్టడీసర్కిల్ అభివృద్ధి చేసి యూపీఎస్సీ, ఏపీపీఎస్సీ సంబంధించిన పోటీ పరీక్షలకు కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయలన్నారు. డిసెంబరు 6న జరిగే అంబేడ్కర్ వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆయన ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

గుణదల పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేస్తాం

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



పాఠశాలలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుణదలలోని దాసరి వెంకటగిరిధర కుమార్ అవంతి నగరపాలక సంస్థ ఎలిమెంటరీ పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌తో మాట్లాడి సానుకూలంగా స్పందించేలా చూస్తానని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. మంగళవారం 3వ డివిజన్ గుణదల ఏరియాలో పాఠశాల ఆవరణలో లయన్స్ క్లబ్ సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సభ్యులు జాస్తి నవీన్ వారి నాయనమ్మ జాస్తి కృపాదేవి జ్ఞాపకార్థం సుమారు రూ.35 వేలతో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు అవకాశం ఉందని, ఈ విషయాన్ని విద్యాశాఖా మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వ డిస్ట్రిక్ట్ గవర్నర్, మల్టిపుల్ డిస్ట్రిక్ట్ 316జీఏటీ ఏరియా లీడర్ లయన్ ఇంజనీర్ మూల్పూరి ఉపేంద్ర, లయన్స్ క్లబ్ సెక్రటరీ రంగా శ్రీనివాసరావు, సభ్యులు గుడ్డేటి అనిల్‌కుమార్, జాస్తి ప్రసాద్, జాస్తి నవీన్‌కుమార్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఎస్ఆర్‌కే విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ



మొగల్రాజపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా మంగళవారం వీబీ సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో మొగల్రాజపురం జమ్మిచెట్టు వద్ద ఉన్న బోయపాటి శివరామకృష్ణయ్య పాఠశాల (బీఎస్ఆర్‌కే) విద్యార్థులకు కళాశాలలో కంప్యూటర్ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా పీబీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ మాట్లాడుతూ డిజిటల్ యుగంలో విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు పెంచుకోవాలని సూచించారు. ఉదయం పాఠశాలలో 100 మంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి థియరీ క్లాసులు, మధ్యాహ్నం కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్‌లో శిక్షణ తరగతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం డిప్యూటీ హెడ్ డాక్టర్ కోనేరు సుధీర్, సీనియర్ అధ్యాపకులు, అధ్యాపకులు, కార్పొరేటర్ ఉషారాణి, అమ్మ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు యార్లగడ్డ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మలుపులో పొంచి ఉన్న ప్రమాదం



పటమట, ఆంధ్రజ్యోతి: ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నుంచి బాగయ్యబజారు వెళ్లే రోడ్డు మలుపులో మెడ్‌ప్లస్ మెడికల్ స్టోర్ పక్కన ఓపెన్ డ్రెయినేజీపై ఎగుడు దిగుడుగా ఉన్న సిమెంట్ దిమ్మెలు వేశారు. దీని వల్ల వేగంగా వచ్చే ద్విచక్రవాహనదారులు సిమెంట్ దిమ్మెలు తగిలి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. వెంటనే సిమెంట్ దిమ్మెలను తొలగించి దాని స్థానంలో ఐరన్ మెస్‌ను ఏర్పాటు చేసి ద్విచక్ర వాహనదారులను ప్రమాదాలకు గురి కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

బస్టాపా.. పార్కింగ్ స్థలమా..



భారతీనగర్, ఆంధ్రజ్యోతి: గుణదల మద్ది రావమ్మ తల్లి గుడి సెంటర్ వద్ద ఉన్న బస్టాప్ అక్రమ పార్కింగ్ స్థలంగా మారింది. పలువురు తమ వాహనాలను బస్టాప్‌కు ఎదురుగా పార్కింగ్ చేస్తున్నారు. బస్టాప్‌లోకి వెళ్లడానికి ప్రయాణికులకు అడ్డంగా ఉండడంతో ఎండలో నిలబడాల్సి వస్తోందంటున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 81 మందికి జరిమానా

విజయవాడ లీగల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన 81 మందికి రూ.8,70,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి లెనిన్‌బాబు మంగళవారం తీర్పు చెప్పారు.

2వ, 4వ, 5వ ట్రాఫిక్ పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని మంగళవారం కోర్టులో ప్రవేశపెట్టారు. 12 మందికి రూ.15 వేల చొప్పున, 69 మందికి రూ.10 వేల చొప్పున జరిమానాగా విధించారు.

అయ్యప్పలకు అన్నదానం



అయ్యప్పలకు అన్నదానం చేస్తున్న గద్దె అనురాధ, క్రాంతి కుమార్

పటమట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పలకు అన్నదానం చేయడం పూర్వజన్మ సుకృతంలో పాటు అదృష్టంగా భావిస్తున్నామని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ తెలిపారు. మంగళవారం అయ్యప్పనగర్‌లోని అయ్యప్పల అన్నదాన కేంద్రంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కుటుంబ సభ్యుల పేరుతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆమె గద్దె క్రాంతికుమార్‌తో పాటు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఆరేళ్లుగా అయ్యప్ప నగర్‌లో అన్నదానం నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో సాయన బుజ్జి, యుగంధర్, ఉమా మహేశ్వరరావు, పేరేపి ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోండి

● మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి సత్యానందం



ప్రసంగిస్తున్న మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి సత్యానందం

విజయవాడ లీగల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవాలని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానందం న్యాయ వాదులకు విన్నవించారు. బెజవాడ బార్ అసోసియేషన్‌లో మంగళవారం లోక్ అదాలత్‌ల ఆవశ్యకతను న్యాయవాదులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులతో పాటు రోజు రోజుకీ పెరిగిపోతున్న కేసులను తగ్గించుకోవాలంటే లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవడం ఒక్కటే మార్గమన్నారు. ఈనెల 13న జరుగనున్న మెగా లోక్ అదాలత్‌లో తమ తమ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. బెజవాడ బార్ అధ్యక్షుడు ఏకే బాషా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కమర్షియల్ కోర్టు న్యాయమూర్తి భూపాల్‌రెడ్డి, 12వ అదనపు జిల్లా జడ్జి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాతపద్ధతిలోనే ఫిట్‌నెస్ చార్జీలు కొనసాగించాలి

● ట్రక్కర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డ శేషగిరి



ఆటోనగర్‌లో సమస్యలను ప్రదర్శిస్తున్న ట్రక్కర్స్ అసోసియేషన్ నేతలు

ఆటోనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గూడ్స్ రవాణా వాహనాలపై అమలు చేస్తున్న ఫిట్‌నెస్ చార్జీలను పాతపద్ధతిలోనే కొనసాగించాలని న్యూ ఆంధ్ర మోటర్ ట్రక్కర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డ శేషగిరి డిమాండ్ చేశారు. జవహర్ ఆటోనగర్ 5వ లైన్‌లో మంగళవారం సమస్యలను ప్లకార్డుల ద్వారా ప్రదర్శించారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫిట్‌నెస్ ఫీజుల పెంపుతో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉందని, ఫలితంగా ప్రజలపై భారం పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి డీవీ నరసింహారావు, ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి గరకపాటి భాస్కరరావు, ప్రతినిధులు ఏడుకొండలు, మధుబాబు, వెంకటేశ్వరరావు, వేణుగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గోతుల రోడ్లు...వాహనదారులకు గాయాలు



రావిచెట్టు సెంటర్ వద్ద ..

రామలింగేశ్వరనగర్, ఆంధ్రజ్యోతి: ఎస్ఎస్ఎం స్కూల్ పక్కన రావిచెట్టు సెంటర్ వద్ద మెయిన్ రోడ్డు, అంతర్గత రోడ్డు గోతులతో ప్రమాదకరంగా ఉందని పటమట సత్యనారాయణ నగర్, అంబేడ్కర్ నగర్ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సత్యనారాయణనగర్, లంబాడిపేట, అంబేడ్కర్ నగర్ కాలనీవాసులు పటమట సెంటర్ వెళ్లాలంటే ఈ మార్గాన్నే వెళ్లాలి. మెయిన్ రోడ్డు, అంతర్గత రోడ్డు పాడవడంతో వాహనాలు అదుపుతప్పి వాహనదారులు గాయపడుతున్నారు. ఒక్కోసారి వాహనాలు పాదచారులపై దూసుకువచ్చి ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

పీఎంఈజీపీ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆటోనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం(పీఎంఈజీపీ) కింద సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎం. మధు చెప్పారు. మంగళవారం ఆయన జవహర్ ఆటోనగర్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 18ఏళ్ల పైబడిన వ్యక్తులు ఈపథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. తయారీ రంగానికి రూ. 50 లక్షల వరకు, సేవా రంగానికి రూ. 20 లక్షల వరకు ప్రాజెక్టు వ్యయం పరిమితి ఉందన్నారు. నిరుద్యోగ యువత ఈపథకాన్ని వినియోగించుకొని ప్రయోజనం పొందాలని జీఎం మధు సూచించారు. మార్జిన్‌మనీ సబ్సిడీ సాధారణ వర్గం గ్రామీణులకు 25 శాతం, పట్టణానికి 15 శాతం, ప్రత్యేక వర్గాలు గ్రామీణులకు 35 శాతం, పట్టణంలో యూనిట్‌లు పెట్టేవారికి 25 శాతం ఉంటుందని ఆయన తెలిపారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన కో-ఆప్షన్ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

కొండపల్లి మున్సిపాలిటీ కో-ఆప్షన్ సభ్యులు ఏకగ్రీవం

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కొండపల్లి మున్సిపాలిటీ కో.ఆప్షన్ సభ్యుల ఎన్నిక మంగళవారం ఏకగ్రీవంగా జరిగింది. చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, ఇన్‌చార్జి కమిషనర్ వెంకటరత్నం ఆధ్వర్యంలో టీడీపీ నుంచి మాబు సుభానీ, జనసేన నుంచి యర్రంశెట్టి సాంబశివరావు (నాని), బీజేపీ నుంచి షేక్ నగీనా కో-ఆప్షన్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ వారిని అభినందించారు. కూటమిలో భాగంగా మూడు పార్టీల అభ్యర్థులకు ప్రాధాన్యతనిచ్చినట్లు చెప్పారు. ప్రజలకు అత్యుత్తమ సేవలందించాలని కో.ఆప్షన్ సభ్యులకు ఆయన సూచించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు బొమ్మసాని సుబ్బారావు, జంపాల సీతారామయ్య, బీజేపీ నేతలు నూతులపాటి బాలకోటేశ్వరరావు, రేగళ్ల రఘునాథ రెడ్డి, తమ్మినేని మాధురి, జనసేన నేతలు అక్కల రామ్మోహన్‌రావు (గాంధీ), చెరుకుమిల్లి సురేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు మందులు ఇవ్వాలి

బస్‌స్టేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు మందులు ఇవ్వాలని ఎంప్లాయీస్ యూనియన్ (ఈ.యూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.దామోదరరావు, జి.వి.నరసయ్య కోరారు. ఈమేరకు మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. సంస్థ విలీనానికి ముందు ఉద్యోగి దంపతులకు జీవిత కాలంలో వైద్య సౌకర్యాల నిమిత్తం రిఫరల్ ఆసుపత్రులకు రూ.4 లక్షలు ఇవ్వటంతో పాటు ఆర్టీసీ ఆసుపత్రులలో వైద్య సౌకర్యాలు, మందులు ఇచ్చేవారన్నారు. విలీనం అనంతరం ఈ స్కీమ్‌ను గత ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. జీవో పొందుపరచిన చికిత్సలతో పాటు మందులు కూడా ఇచ్చేలా ఆదేశాలు ఇచ్చి, ఆర్టీసీలో విలీనం అనంతరం రిటైర్డ్ ఉద్యోగులను ఆదుకోవాలని ఒక ప్రకటనలో కోరారు.

మాదిగల విజయోత్సవ సభ రేపు : పేరుపోగు

గాంధీనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేసి సామాజిక న్యాయం చేసిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఈనెల 4న మాదిగల విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్టు ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ తెలిపారు. జింఖానగ్రౌండ్‌లో జరిగే ఈ సభకు రాష్ట్రవ్యాప్తంగా మాదిగలు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్గీకరణ అంశంలో సామాజిక సీఎం చంద్రబాబు న్యాయం పక్షాన నిలబడి ఎస్సీ వర్గీకరణపై చట్టం చేశారన్నారు. ఆలేటి యేసుపాదం, నల్లూరు శేఖర్‌బాబు, సింగంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణావర్సిటీ వాలీబాల్ జట్ల ఎంపిక నేడు, రేపు

విజయవాడ(స్పోర్ట్స్), డిసెంబరు2(ఆంధ్రజ్యోతి) : కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల వాలీబాల్ టోర్నమెంట్, యూనివర్సిటీ జట్ల ఎంపిక ఈ నెల 4, 5 తేదీల్లో జరుగుతాయని శాతవాహన కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బి.సిహెచ్.సంగీతరావు తెలిపారు. 4వ తేదీ 10.30 టోర్నమెంట్ ప్రారంభం అవుతుందన్నారు. క్రీడాకారులు 5వ తేదీ ఉదయం 10.30 గంటలకు అర్హత పత్రాలతో హాజరుకావాల్సిందిగా కోరారు. ఇతర వివరాలకు 9492939377లో సంప్రదించాల్సిందిగా కోరారు.

ఆత్మవిశ్వాసంతో అన్నింటా రాణిస్తూ...

చెదరని ఆత్మవిశ్వాసం వారి సొత్తు.. తాము అన్నింటా రాణిస్తామనే నమ్మకం వారిలో ఉంది. తాము దేనిలోనూ తీసిపోమంటున్నారు. ఉన్నతంగా ఎదగాలనే దృఢసంకల్పానికి వైకల్యం అడ్డురాదని ఎంతో మంది దివ్యాంగులు నిరూపిస్తున్నారు. చదువు, క్రీడలు, వ్యాపారాల్లో రాణిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వాలు ప్రోత్సాహం అందిస్తే మరింత అద్భుతాలు సృష్టించేందుకు సిద్ధంగా ఉన్నామంటున్నారు. డిసెంబరు 3 అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ)

జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారుల లెక్కల ప్రకారం ఉమ్మడి కృష్ణాజిల్లాలో 1.50 లక్షల మంది దివ్యాంగులున్నారు. వీరిలో దాదాపు ఆరు వేల మంది ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. మరికొంత మంది క్రీడల్లో రాణిస్తూ జిల్లా ఖ్యాతిని ప్రపంచానికి చాటుతున్నారు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వాలు అందిస్తున్న సహకారంతో చాలా మంది దివ్యాంగులు చిన్న చిన్న వ్యాపారాల్లో స్థిరపడుతున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుంటూ అభివృద్ధి దిశగా సాగుతున్నారు.

నేడు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

ప్రతిభను గుర్తించడమే లక్ష్యం

డిసెంబరు 3 అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం. దివ్యాంగుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, తద్వారా వారికి కావాల్సిన వనరులను సమకూర్చడమే ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం.దివ్యాంగుల హక్కులు కాపాడుతూ, వారికి అవకాశాలు కల్పిస్తూ, వారిలో విశ్వాసం ప్రోదికల్పడమే ఈ దినోత్సవ సారాంశం. పని ప్రదేశాల్లో వారిపై కరుణ కాకుండా గౌరవం చూపాలని మానసిక వైదులు చెబుతున్నారు.

నేడు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో వేడుకలు

విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు పూర్తి చేసింది. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి, సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పాల్గొంటారు. సీఎం చేతుల మీదుగా దివ్యాంగులకు మూడు చక్రాల మోటారు వాహనాలు, ల్యాప్‌ట్యాప్‌లు, స్మార్ట్ ఫోన్‌లు, వీల్ చైర్‌లు, ఇతర ఉపకరణాలు అందించనున్నట్లు జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారులు ప్రకటించారు.

ధైర్యంగా ముందుకెళ్లాలి



వైకల్యం అనేది బలహీనత ఏమాత్రం కాదు. ధైర్యంగా ముందడుగు వేయడమే నాకు తెలిసిన విజయ రహస్యం. నాకు స్విమ్మింగ్ అంటే ఇష్టం. ఎంత కష్టమైనా శిక్షణ తీసుకున్నాను. ఇప్పటి వరకు రెండు అంతర్జాతీయ పతకాలు, 20 జాతీయ పతకాలు సాధించాను. గాంధీనగర్‌లోని సర్ విజ్జి స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ ఇస్తున్నాను.

- ఎ.లక్ష్మణ్, అంతర్జాతీయ స్విమ్మర్, విజయవాడ

కష్టపడితే ఏదైనా సాధ్యమే



చిన్ననాటి నుంచి నా స్నేహితులు ఎంతో ప్రేమగా ఉండేవారు. వారితో గడుపుతుంటే నా లో వైకల్యం ఉందనే విషయమే మర్చిపోయేవాడిని. ఇంటర్, ఐటీఐ పూర్తి చేసి రైల్వేలో ఉద్యోగం సాధించాను. విజయవాడ రైల్వే స్టేషన్‌లో పీఎస్ఆర్‌గా డ్యూటీ చేస్తున్నాను. సమాజం నుంచి ఆదరణ లభిస్తే దివ్యాంగులు అద్భుతాలు సాధిస్తారు.

- కె.లవకుమార్, రైల్వే ఉద్యోగి, విజయవాడ

లోకోపైలెట్ల 48 గంటల దీక్ష ప్రారంభం



రైల్వేస్టేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైల్వేల ప్రైవేటీకరణ ఆలోచన విరమించాలని సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. దీర్ఘకాల సమస్యలు పరిష్కారం కోరుతూ లోకో పైలెట్లు డీఆర్ఎం కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం 10 గంటల నుంచి గురువారం ఉదయం 10 గంటల వరకు నిర్వహించే 48 గంటల నిరసన దీక్ష చేపట్టారు. శిబిరాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభు త్వం కార్మిక వ్యతిరేక విధానా లోకో రన్నింగ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఐదు సంవత్సరాలుగా నియామకాలు నిలిపివేయడం వల్లే సిబ్బంది కొరత తీవ్రమైందని యూనియన్ ఆరోపించింది. లోకో రన్నింగ్ స్టాఫ్ విజయవాడ డివిజన్ అధ్యక్షుడు ఎం.వెంకటేశన్ అధ్యక్షత వహించారు.

లైంగికదాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

విజయవాడ లీగల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిపై నేరం రుజువుకావడంతో 20 సంవత్సరాల జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి వేల్పుల భవానీ మంగళవారం తీర్పు చెప్పారు. బాలిక (15) డాబా కొట్ల సెంటర్‌లోని కిరాణా షాపులో పని చేస్తోంది. రాత్రి ఇంటికి వచ్చే సమయంలో 2021 జులై 20న ప్రకాష్‌నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ వల్లెపు వసంతకుమార్ (25) తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడినట్లు బాలిక చెప్పింది. తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో పైవిధంగా న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

కేఎల్ హాస్టల్‌లో విద్యార్థి ఆత్మహత్య



తాడేపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తాడేపల్లి మండల పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ హాస్టల్‌లో మంగళవారం ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల మండలం పోతినికొత్తపాలెంకు చెందిన వి.సురేష్‌రెడ్డి (20) యూనివర్సిటీ హాస్టల్‌లో ఉంటూ కేఎల్‌యూలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం రూమ్‌లో సురేష్‌రెడ్డితో పాటు ఉండే ఇద్దరు విద్యార్థులు పరీక్ష రాయడానికి వెళ్లారు. సురేష్‌రెడ్డి పరీక్షకు వెళ్లకుండా ఉండిపోయాడు. వారు పరీక్ష ముగించుకుని మధ్యాహ్నం తిరిగి వచ్చి చూసే సరికి ఫ్యానుకు ఉరేసుకుని సురేష్‌రెడ్డి మృతి చెంది ఉన్నాడు. అయితే పోలీసులకు సమాచారం ఇవ్వకుండా యూనివర్సిటీ యాజమాన్యం తాడేపల్లిలోని మణిపాల్ హాస్పిటల్‌కు తరలించింది. హాస్పిటల్ నుంచి సమాచారం అందుకున్న తాడేపల్లి ఎస్ఐ ప్రతాప్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతి చెందిన విద్యార్థి సూసైడ్ లెటర్ రాసినట్టు తోటి విద్యార్థుల సమాచారం. కాగా.. యూనివర్సిటీ యాజమాన్యం ఎటువంటి కారణాలు తెలపకుండా సురేష్‌రెడ్డి మృతదేహాన్ని వైద్యశాలకు తరలించడంతో విద్యార్థులందరూ మంగళవారం హాస్టల్స్ వద్ద బైఠాయించి, న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు.

6 నుంచి సహకార ఉద్యోగుల రాష్ట్రవ్యాప్త ఆందోళన



హనుమాన్‌జంక్షన్ రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సహకార సంఘ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరపనేని రాజేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు కార్యాచరణతో కూడిన పోస్టర్‌ను మంగళవారం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీపీఎస్ హనుమంతరావు, జిల్లా అధ్యక్షుడు తోట కృష్ణారావు, సభ్యులతో కలిసి ఆయన అవిష్కరించారు. న్యాయమైన సమస్యలను పరిష్కరించే వరకూ డిసెంబరు 6వ తేదీ నుంచి పోరాటం చేస్తామన్నారు. డిసెంబరు 6వ తేదీన నల్లబాడ్జీలతో నిరసన తెలుపుతూ విధుల నిర్వహణ, 8వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా డీసీసీబీ బ్రాంచిల వద్ద ఉద్యోగుల ధర్నా, 16, 22 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా సహకార కార్యాలయాలు, డీసీసీబీ ప్రధాన కార్యాలయాల వద్ద ధర్నా, వినతిపత్రం అందజేయడం, 29వ తేదీన విజయవాడ ధర్నా చౌక్‌లో మహాధర్నా చేపడతామని వివరించారు. ప్రభు త్వం స్పందించని పక్షంలో జనవరి 5వ తేదీ నుంచి విజయవాడ ధర్నా చౌక్‌లో జిల్లాల వారీగా ప్రతిరోజు 26 జిల్లాలు పూర్త య్యే వరకూ రిలే నిరాహారదీక్ష చేపడతామని హెచ్చరించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వై.వి.ఆర్.మోహనరావు, కార్యవర్గ సభ్యులు నాగరాజు, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు పది ప్రత్యేక రైలు సర్వీసులు

రైల్వేస్టేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప భక్తుల రద్దీని పురస్కరించుకుని శబరిమలకు పది ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు విజయవాడ డివిజన్ పీఆర్వో నుస్రత్ మండ్రూపకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 07117 సిరిపూర్ కాగజ్‌నగర్ - కొల్లం జంక్షన్ ఈనెల 13న శనివారం నాడు నడుస్తుంది. 07119 చర్లపల్లి - కొల్లం జంక్షన్ బుధవారాలలో నడుస్తుంది. ఈనెల 17, 31 తేదీలలో రెండు సర్వీసులు నడుస్తుంది. 07121 చర్లపల్లి - కొల్లం జంక్షన్ ఈనెల 20వ తేదీ శనివారం ఒక సర్వీసుగా నడుస్తుంది. 07123 హెచ్.ఎస్.నాందేడ్ - కొల్లం జంక్షన్ ఈనెల 24వ తేదీ బుధవారం ఒక సర్వీసుగా నడుస్తుంది. 07118 కొల్లం జంక్షన్ - చర్లపల్లి సోమవారం నడుస్తుంది. ఈనెల 15వ తేదీన ఒక సర్వీసుగా నడుస్తుంది. 07120 కొల్లం జంక్షన్ - చర్లపల్లి రెండు సర్వీసులుగా ఈనెల 19, జనవరి 2 తేదీల్లో శుక్రవారాలలో బయలుదేరుతుంది.. 07122 కొల్లం జంక్షన్ - చర్లపల్లి ఈనెల 22వ తేదీ సోమవారం ఒక సర్వీసుగా నడుస్తుంది. 07124 కొల్లం జంక్షన్ - చర్లపల్లి ఒక సర్వీసుగా ఈనెల 26వ తేదీ శుక్రవారం నడుస్తుంది.

26 మంది మావోయిస్టులకు రిమాండ్ పొడిగింపు

విజయవాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు మండలం కానూరులోని కొత్త ఆటోనగర్‌లో అరెస్టయి రిమాండ్ ఖైదీలుగా ఉన్న 26 మంది మావోయిస్టులకు విజయవాడ ఆరో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు రిమాండ్‌ను పొడిగించింది. పెనమలూరు పోలీసులు మొత్తం 28 మందిని గడచిన నెల 18వ తేదీన కొత్త ఆటోనగర్‌లో ఉన్న శ్రీ మారుతి భవనం మూడో అంతస్తులో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వారిలో ఇద్దరు మావోయిస్టులు మైనర్లని వైద్యులు ధ్రువీకరించారు. 26 మంది మావోయిస్టులు రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్నారు. రిమాండ్ గడువు ముగియడంతో వీడియో కాన్ఫరెన్స్‌లో న్యాయాధికారి ముందు హాజరుపరిచారు. ఈనెల 15 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ జి.లెనిన్‌బాబు ఆదేశాలు ఇచ్చారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు పూర్తి సహకారం : కలెక్టర్ లక్ష్మీశ


కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఈనెల 27, 28 తేదీల్లో జరిగే ప్రపంచ తెలుగు రచయితల మహాసభల విజయవంతానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. మహాసభలకు చేయూత నివ్వాల్సిందిగా ఆర్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పొట్లూరి హరికృష్ణ, గోళ్ల నారాయణరావు మంగళవారం కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

బొమన్ సాబ్ లుక్

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాజాసాబ్'. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. జనవరి 9న విడుదలవుతోంది. ఈ చిత్రంలో అతీంద్రియ శక్తుల పరిశోధకుడిగా బాలీవుడ్ నటుడు బొమన్ ఇరానీ కీలక పాత్ర పోషిస్తున్నారు. మంగళవారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. హారర్ కామెడీ జానర్‌లో ఎవర్‌గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా 'రాజా సాబ్'ను రూపొందిస్తున్నారు దర్శకుడు మారుతి. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్లుగా నటిస్తున్నారు.



కథను మలుపుతిప్పే పాత్ర పోషించాను

- సంయుక్త



'అఖండ 2: తాండవం' చిత్రంలో అవకాశం వచ్చినప్పుడు నేను చాలా బిజీగా ఉన్నాను. ఒక మంచి సినిమాలో అవకాశం వస్తే తిరస్కరించకూడదు అని భావించి డేట్స్ అడ్జెస్ట్ చేసుకొని నటించాను. ఈ సినిమాలో కథను మలుపు తిప్పే పాత్ర పోషించాను' అని సంయుక్త అన్నారు. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అఖండ 2: తాండవం'. నందమూరి తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. ఈ నెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కథానాయిక సంయుక్త సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- "అఖండ 2: తాండవం' చిత్రం 'అంచనాలకు మించి ఉండబోతోంది. బోయపాటి గారు గ్రేట్ విజన్‌తో తెరకెక్కించారు. విజువల్స్ అద్భుతంగా ఉంటాయి.
- ఈ చిత్రంలో నా పాత్ర చాలా కీలకంగా, స్టైలిష్‌గా ఉంటుంది. నా కెరీర్‌లో తొలిసారి ఓ మాస్ సాంగ్ చేశాను. ఇలాంటి మాస్ సాంగ్ ఇప్పటివరకూ చేయలేదు. చాలా కష్టపడ్డాను. ప్రాక్టీస్ చేసే సమయంలో మోకాలు దెబ్బతిని సహకరించకపోవడంతో ఫిజియోథెరపీ చేయించుకున్నా.
- బాలకృష్ణ గారు దర్శకుల నటుడు. వారు ఎలా చెబితే అలా చేస్తారు. నటుడిగానూ ఆయన విజన్ అద్భుతం. సెట్‌లో ఆయన చాలా స్నేహంగా ఉండేవారు. ఆయన నటించిన 'డాకు మహరాజ్' నా ఫేవరేట్ చిత్రం.
- తమన్ సంగీతం, ముఖ్యంగా సంస్కృత శ్లోకాలతో సాగే నేపథ్య సంగీతం ప్రేక్షకులను అలరిస్తుంది. మా నిర్మాతలు రామ్, గోపీ గారు మేకింగ్‌లో రాజీ పడలేదు. సినిమాను ప్రేక్షకులకు చేరువ చేసేందుకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కథానాయికగా స్వయంభు, నారీ నారీ నడుమ మురారి చిత్రాలు చేస్తున్నాను.

అఖండ 2 టికెట్ ధరల పెంపు

- ఏపీ ప్రభుత్వ అనుమతి

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'అఖండ 2' సినిమా టికెట్ ధరల పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం అనుమతిచ్చింది. ఈ నెల 5న ఈ చిత్రం విడుదలవుతోంది. నిర్మాతల వినతి మేరకు భారీ బడ్జెట్ సినిమాలకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతి జారీ చేస్తోంది. అందులో భాగంగానే ఈ సినిమా విడుదలైన తొలి పది రోజులు టికెట్ ధరలు పెంచుకునేందుకు డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లకు పూర్తి అనుమతి లభించింది. సింగిల్ స్క్రీన్లలో సాధారణ రేటుపై రూ. 75, మల్టీప్లెక్స్‌ల్లో రూ. 100 పెంపునకు అనుమతించింది. ఈ నెల నాలుగున ప్రదర్శించే ప్రీమియర్ షో టికెట్ ధర రూ. 600గా నిర్ణయించారు.

విందు భోజనంలా ఎంజాయ్ చేసే సినిమా




క్రికెట్ క్రీడ నేపథ్యంలో కామెడీ ప్రధానాంశంగా రూపుదిద్దుకున్న చిత్రం 'గోట్'. సుడిగాలి సుధీర్, దివ్యభారతి జంటగా నటించారు. ఎం. చంద్రశేఖర్ నిర్మించారు. మంగళవారం నిర్మాత దిల్‌రాజు టీజర్‌ను విడుదల చేసి, యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ 'అడ్డంకులను దాటుకొని ఈ సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దాం. మంచి అభిరుచితో చేసిన సినిమా ఇది. ప్రేక్షకులు విందు భోజనంలా ఎంజాయ్ చేస్తారు. మణిశర్మ నేపథ్య సంగీతం సినీ ప్రియులను మెప్పిస్తుంది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అని చెప్పారు. సహ నిర్మాత రవీందర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమాను మాస్ ఎంటర్‌టైనర్‌గా తీశాం. చంద్రశేఖర్ రెడ్డి ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు' అని తెలిపారు. ఆద్యంతం వినోదం పంచే చిత్రమిదని దివ్యభారతి తెలిపారు.

యువతకు కనెక్ట్ అయ్యే కథ



రివేంజ్ స్టోరీతో సాగే థ్రిల్లింగ్ ప్రేమ కథా చిత్రం 'సైక్ సిద్ధార్థ్'. శ్రీనందు, యామిని భాస్కర్ జంటగా నటించారు. వరుణ్‌రెడ్డి దర్శకత్వంలో శ్రీనందు, శ్యామ్ సుందర్‌రెడ్డి నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా శ్రీనందు మాట్లాడుతూ 'ఇప్పుడున్న సమాజానికి, యువతకు కనెక్ట్ అయ్యే కథతో తెరకెక్కిన చిత్రమిది. సురేశ్‌బాబు గారు సినిమా చూసిన వెంటనే పంపిణీ చేసేందుకు అంగీకరించారు. సురేశ్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను తీసుకోవడంతో నా కల నెరవేరినట్లయింది' అని చెప్పారు. వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ 'ప్రచార చిత్రాలకు చక్కని ప్రేక్షకాదరణ దక్కింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే చిత్రమిది. తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా స్క్రీన్‌ప్లేలో చాలా మార్పులు చేశాం' అని చెప్పారు.

అనుమాన పక్షి వచ్చేది అప్పుడే



రాగ్ మయూర్, మెరిన్ ఫిలిప్ జంటగా 'డీజే టిల్లు' ఫేమ్ విమల్ కృష్ణ తెరకెక్కిస్తున్న చిత్రం 'అనుమాన పక్షి'. చిలక ప్రొడక్షన్స్‌పై రాజీవ్ చిలక, రాజేశ్ జగ్తియాని, హీరాచంద్ దండ్ నిర్మిస్తున్నారు. తాజాగా సినిమా విడుదల తేదీని వెల్లడిస్తూ ఓ వీడియోను షేర్ చేశారు మేకర్స్. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు. వినోద ప్రధానంగా సాగే ఈ సినిమా విమల్ కృష్ణ మార్క్‌తో స్టైలిష్‌గా ఉండనుందని చెప్పారు. రాగ్ మయూర్ పాత్ర చాలా విభిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. అతిగా ఆలోచిస్తూ, అతి జాగ్రత్తతో ఉండే ఆయన రోల్ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాక, కడుపుబ్బా నవ్విస్తుందని మేకర్స్ అన్నారు. బ్రహ్మాజీ, ప్రిన్స్ సెసిల్, అనన్య, చరిత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ: సునీల్‌కుమార్ నామా, సంగీతం: శ్రీచరణ్ పాకాల.


ప్రేమ కోసం యుద్ధం



రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ జంటగా 'కలర్ ఫోటో' ఫేమ్ సందీప్ రాజ్ తెరకెక్కించిన చిత్రం 'మోగ్లీ 2025'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మించారు. ఈ నెల 12న సినిమా విడుదలవుతోంది. మంగళవారం చిత్రం ట్రైలర్‌ను హీరోయిన్ రష్మిక మందన్న విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ట్రైలర్‌లో పాత్రలను, కథా నేపథ్యాన్ని పరిచయం చేసిన విధానం ఆకట్టుకుంది. 'తన ప్రేమ కోసం యుద్ధం చేసే ప్రతీవాడు హీరోనే' అంటూ కథానాయకుడు పలికిన సంభాషణలు ఆకట్టుకున్నాయి. బండి సరోజ్‌కుమార్ ఈ సినిమాలో విలన్‌గా నటించారు. హర్ష చెముడు కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోదాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: రామ మారుతి ఎమ్, సంగీతం: కాలభైరవ.

కాంతారపై కామెడీ

రణ్‌వీర్ క్షమాపణలు



కాంతార చిత్రంపై తాను చేసిన వ్యాఖ్యలకు బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ మంగళవారం క్షమాపణలు చెప్పారు. ఎవరినీ కించపరచడం తన ఉద్దేశం కాదని తెలిపారు. 'రిషబ్ శెట్టి బాగా నటించారని చెప్పడం కోసమే నేను అలా నటించాను. అలాంటి సన్నివేశాల్లో నటించాలంటే చాలా కష్టం. అయినా ఏ ఇబ్బంది లేకుండా అటువంటి సన్నివేశాలను ఎంతో ఈజ్‌తో చేసే ఆయనంటే నాకు చాలా ఇష్టం. మన దేశంలోని ప్రతీ సంప్రదాయం మీద నాకు అపారమైన గౌరవం ఉంది. నా వ్యాఖ్యలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే క్షమించండి' అని పేర్కొన్నారు. 'కాంతార'పై రణ్‌వీర్ చేసిన వ్యాఖ్యలపై హిందూ జనజాగృతి సమితి ఫిర్యాదు చేసింది. ఆయన చేసిన కామెంట్స్ హిందువుల విశ్వాసాన్ని దెబ్బతీశాయని పేర్కొంది. గోవాలో ఇటీవలె ముగిసిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ) వేడుకల్లో రణ్‌వీర్ 'కాంతార' చిత్రంపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. వేదికపై మాట్లాడుతూ "కాంతార' సినిమాలో రిషబ్ శెట్టి నటన అద్భుతం. హీరో పాత్రలోకి దెయ్యం ప్రవేశించినప్పుడు వచ్చే సన్నివేశాలు చాలా బాగున్నాయి" అని రణ్‌వీర్ పేర్కొన్నారు. ఆ సినిమాలో ఎంతో పాపులర్‌గా మారిన 'ఓ' అనే శబ్దాన్ని స్టేజీపై అనుకరించారు. దేవతను ఆయన దెయ్యంగా పోల్చాడని కర్ణాటక వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు.

వినూత్నంగా వన్ బై ఫోర్



నూతన నటీనటులతో సరికొత్త తరహాలో తెరకెక్కిన కామెడీ థ్రిల్లర్ 'వన్ బై ఫోర్'. వెంకటేష్ పెద్దపాలెం, అపర్ణ మల్లిక్ జంటగా నటించారు. బాహుబలి పళని కె. దర్శకత్వంలో రంజన రాజేశ్ గుంజల్, రోహిత్ రాందాస్ గుంజల్ సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా వెంకటేష్ పెద్దపాలెం మాట్లాడుతూ 'కొత్త తరహా కథాంశంతో ఈ క్రైమ్ డ్రామాను తీశాం. పళని గారి టేకింగ్ సినిమాకు ప్రత్యేకాకర్షణ. 'హారర్, సస్పెన్స్ అంశాలు, పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'క్రైమ్ అంశాలతో పాటు మానవ సంబంధాలను చర్చిస్తూ సందేశాత్మకంగా సాగే చిత్రమిది. పతాక ఘట్టాలే సినిమాకు హైలెట్' అని చెప్పారు. కథ మీద నమ్మకంతో ఈ చిత్రాన్ని నిర్మించాం, ప్రేక్షకులు ఆశించే అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది అని నిర్మాతలు తెలిపారు.

విడుదలకు సిద్ధం



భాస్కర్, కోటేశ్వర రావు ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'విధాత'. మణికంఠ రాజేంద్రబాబు దర్శకత్వంలో అప్పిని పల్లె భాస్కర చారి నిర్మించారు. విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా మణికంఠ రాజేంద్రబాబు మాట్లాడుతూ 'ఇదో వైవిధ్యభరితమైన చిత్రం. పాత్రలన్నీ సహజ సిద్ధంగా ఉంటాయి' అని అన్నారు. 'ఓ యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించాము' అని అప్పిని పల్లె భాస్కర చారి తెలిపారు.

అల్లూరి జిల్లా ఎస్పీ ఎదుట మావోయిస్టు లొంగుబాటు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అమిత్‌బర్దార్. చిత్రంలో లొంగిపోయిన మావోయిస్టు ముచ్చకీ నందా (ముసుగు ఉన్న వ్యక్తి)

పాడేరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన మావోయిస్టు ముచ్చకీ నందా (21) మంగళవారం అల్లూరి సీతారామ రాజు జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్ ఎదుట లొంగిపోయాడు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. సుక్మా జిల్లా గోగోండ మిస్సీపార గ్రామానికి చెందిన ముచ్చకీ నందా పందొమ్మిది ఏళ్ల వయస్సులో మావోయిస్టు పార్టీలో చేరినట్టు తెలిపారు. బస్తర్ ప్రాంతంలో గల కేరళపాల్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఉన్న 26వ ప్లాటూన్‌లో సభ్యుడిగా నందా పనిచేస్తున్నట్టు తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు ప్రతికూల పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో నందా తమకు లొంగిపోయినట్టు వివరించారు. మావోయిస్టులు వచ్చే ఏడాది మార్చి నెలాఖరులోపు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలోకి కలవాలని ఎస్పీ అమిత్‌బర్దార్ పిలుపునిచ్చారు.

పాఠశాలల్లోకి 'అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్'లు

- 1,146 మంది నియామకానికి పాఠశాల విద్యాశాఖ అనుమతి
- ఈ నెల 8 నుంచి ఐదు నెలల పాటు విధుల్లోకి..
- ఎస్‌ఏలకు 12,500, ఎస్జీటీలకు 10 వేల పారితోషికం

సుదీర్ఘకాలం తర్వాత తాత్కాలిక టీచర్ల విధానం

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు పాఠశాల విద్యాశాఖ 'అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల' విధానాన్ని తీసుకొచ్చింది. విద్యార్థులకు బోధనలో అంతరం ఏర్పడకుండా ఈ మేరకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. సుదీర్ఘకాలం కిందట రెగ్యులర్ టీచర్ల కొరత ఉన్న పాఠశాలల్లో విద్యా వలంటీర్లు పనిచేసేవారు. తాత్కాలిక ప్రాతిపదికన వారిని తీసుకొని పారితోషికం చెల్లించేవారు. అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పేరుతో ఆ విధానాన్ని తిరిగి ఇప్పుడు ప్రవేశపెట్టారు. ఇటీవల మెగా డీఎస్సీతో భారీఎత్తున టీచర్లను భర్తీ చేసినప్పటికీ.. ఇంకా ఖాళీలున్న చోట్ల ఇన్‌స్ట్రక్టర్లను నియమించనున్నారు. వీరి నియామకానికి అనుమతిస్తూ పాఠశాల విద్యాశాఖ మంగళవారం ఉత్తర్వు లు జారీచేసింది. 1,146 పోస్టుల్లో ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి అనుమతిచ్చింది. అందులో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 892, ఎస్జీటీ 254 ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్‌కు నెలకు రూ.12,500, ఎస్జీటీకి రూ.10 వేలు పారితోషికంగా చెల్లిస్తారు. ఐదు నెలల కాలం వీరు విధుల్లో ఉంటారు. ఇందుకోసం రూ.8.21 కోట్లను సమగ్రశిక్ష నిధులు కేటాయించారు. ఈనెల 8 నుంచి విధుల్లోకి వచ్చే ఇన్‌స్ట్రక్టర్లు మే 7వ తేదీ వరకు కొనసాగుతారు. ఆ తర్వాత ఆటోమేటిక్‌గా తొలగింపబడతారని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది. అత్యధికంగా హిందీ స్కూల్ అసిస్టెంట్ 300, తెలుగు స్కూల్ అసిస్టెంట్ 130 పోస్టుల్లో ఇన్‌స్ట్రక్టర్లను తీసుకుంటున్నారు. ఈ నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

నియామక ప్రక్రియ ఇలా..

మండల స్థాయిలో ఎంఈవో ఖాళీలపై ప్రకటన జారీచేస్తారు. అర్హులైన అభ్యర్థులు ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలి. బుధవారం నుంచి ఈ నెల 5 వరకు దరఖాస్తులు సమర్పించవచ్చు. ఆ తర్వాత ఆ జాబితాలను ఎంఈవోలు డీఈవో కార్యాలయాలకు పంపుతారు. వారి అకడమిక్, ప్రొఫెషనల్ అర్హత ఆధారంగా మెరిట్ జాబితా తయారు చేస్తారు. అకడమిక్‌కు 75 శాతం, ప్రొఫెషనల్ అర్హతకు 25 శాతం వెయిటేజీ ఇస్తారు. స్థానిక గ్రామాలు, మండలాలకు చెందిన వారికి ప్రాధాన్యత ఇస్తారు. కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ తుది ఎంపిక జాబితాను ఖరారు చేస్తుంది. ఈ ప్రక్రియను ఈనెల 7లోగా పూర్తి చేస్తారు. ఆ తర్వాత రోజు నుంచే అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు విధులకు హాజరు కావాలి. ఏదైనా జాతీయ బ్యాంకులో ఖాతా తెరవాలని ఇన్‌స్ట్రక్టర్లకు పాఠశాల విద్యాశాఖ సూచించింది. ఆ ఖాతాలకే పారితోషికం జమ చేస్తారు.

ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ల పరీక్షలకు షెడ్యూలు

- జనవరి 27 నుంచి ఫిబ్రవరి 13 వరకు పరీక్షలు

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఈ క్యాలెండర్ సంవత్సరంలో విడుదల చేసిన 21 ఉద్యోగ నోటిఫికేషన్లకు ఏపీపీఎస్సీ పరీక్షల తేదీలను ప్రకటించింది. గతంలో జారీచేసిన నోటిఫికేషన్లలో మిగిలిపోయిన పోస్టుల భర్తీకి ఈ ఏడాది ఈ నోటిఫికేషన్లు జారీచేసింది. వాటికి సంబంధించిన రాత పరీక్షలు జనవరి 27 నుంచి ప్రారంభమవుతాయని తెలిపింది. జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ (పేపర్-1) పరీక్ష జనవరి 27, 31, ఫిబ్రవరి 9, 11, 12 తేదీల్లో జరగనుంది. సంబంధిత సబ్జెక్టు పేపర్ల పరీక్షలు జనవరి 28 నుంచి ఫిబ్రవరి 13 వరకు జరుగుతాయి. ఒకే తరహా నోటిఫికేషన్లకు ఒకటి కంటే ఎక్కువ వాటికి దరఖాస్తు చేసుకుంటే పేపర్-1 ఒక్కసారి రాస్తే మిగిలిన నోటిఫికేషన్లకూ పరిగణనలోకి తీసుకుంటారు. 18 నోటిఫికేషన్ల పరీక్షలను విశాఖపట్నం, తూర్పుగోదావరి, ఎన్టీఆర్, తిరుపతి, అనంతపురం జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తారు. మిగిలిన నోటిఫికేషన్ల పరీక్షలను ఉమ్మడి జిల్లాల కేంద్రాల్లో నిర్వహిస్తారు. అగ్రికల్చర్ ఆఫీసర్, భూగర్భ జలవనరుల్లో టెక్నికల్ అసిస్టెంట్, జూనియర్ లెక్చరర్, గ్రేడ్-2 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఏఈ, హార్టికల్చర్ ఆఫీసర్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, దేవదాయ శాఖ గ్రేడ్-2 ఈవో పోస్టులకు నోటిఫికేషన్లు జారీకాగా ఇప్పుడు పరీక్షల తేదీలు ప్రకటించింది.

వైకుంఠ ద్వార దర్శనాలకు 1.76 లక్షల టోకెన్లు జారీ

- తొలి మూడు రోజులకు ఈ-డిప్ ద్వారా కేటాయించిన టీటీడీ

తిరుమల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఈ-డిప్ ద్వారా తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనాలకు 1.76 లక్షల టోకెన్లను టీటీడీ మంగళవారం భక్తులకు కేటాయించింది. ఈ నెల 30న వైకుంఠ ఏకాదశి, 31న ద్వాదశి, జనవరి 1వ తేదీలకు సంబంధించి టోకెన్లను ప్రస్తుతం కేటాయించారు. నవంబరు 27 నుంచి 25,72,111 లక్షల మంది భక్తులు టీటీడీ వెబ్‌సైట్, మొబైల్ యాప్, ప్రభుత్వ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా డిసెంబరు 1వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ఈ-డిప్ సిస్టమ్ ద్వారా 1.76 లక్షల మంది పేర్లను ఎంపిక చేశారు. దర్శనానికి ఎంపికైన వారికి సెల్‌ఫోన్, ఈమెయిల్ ద్వారా సమాచారం పంపారు. ఏపీ నుంచి 58,923 మందికి, తెలంగాణ నుంచి 41,965, కర్ణాటక నుంచి 20,929, తమిళనాడుకు చెందిన 11,703 మంది భక్తులు దర్శనాలకు ఎంపికయ్యారు.

6,983 మంది వెంకట్‌లు

ఈ-డిప్ విధానంలో వైకుంఠ ద్వార దర్శనాలు పొందిన వారిలో 6,983 మంది వెంకట్ అనే పేరు కలిగినవారు ఉండడం విశేషం. అలాగే లక్ష్మి పేరుతో 6,961 మంది, శ్రీనివాస్ పేరుతో 3,312మంది, పద్మ పేరుతో 1,645 మందికి టోకెన్లు లభించాయి. వైకుంఠ ద్వార దర్శనాలు దక్కించుకున్న వారిలో 145 మంది ముస్లింలు కూడా ఉన్నారు.

5న శ్రీవాణి, రూ.300 దర్శన టికెట్ల విడుదల

జనవరి 2 నుంచి 8 వరకు వైకుంఠ ద్వార దర్శనాలకు శ్రీవాణి ట్రస్టు టికెట్లను ఈ నెల 5వ తేదీన ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో టీటీడీ విడుదల చేయనుంది. రోజుకు వెయ్యి చొప్పున ఏడు రోజులకు 7 వేల టికెట్లను అందుబాటులో ఉంచనున్నారు. అలాగే మధ్యాహ్నం 3 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లనూ విడుదల చేస్తారు. రోజుకు 15 వేల చొప్పున 1.05 లక్షల టికెట్లను జారీ చేయనున్నారు. ఇవి పూర్తిగా ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ కింద కేటాయించనున్నారు.

నేడు నల్లజర్లలో 'రైతన్నా-మీకోసం'

- రైతులతో ముఖాముఖి నిర్వహించనున్న సీఎం

రాజమహేంద్రవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లలో రైతన్నా-మీ కోసం కార్యక్రమంలో రైతులతో ముఖాముఖి నిర్వహించి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమంలో 1000 మంది రైతులు పాల్గొంటారు. సీఎం పర్యటన వివరాలను తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. బుధవారం ఉదయం 10.55 గంటలకు నల్లజర్లకు రానున్న ముఖ్యమంత్రి సాయంత్రం 4 గంటల వరకూ ఇక్కడే ఉంటారు. రైతుల పొలాల పరిశీలన, స్టాల్స్ సందర్శన తర్వాత ముఖాముఖి నిర్వహిస్తారు. సభలో మాట్లాడిన అనంతరం గోపాలపురం నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. ఆయన పర్యటన సందర్భంగా 1200 మంది పోలీసులతో భారీ భద్రత, బందోబస్తు ఏర్పాటు చేశారు.

నెల్లూరు బంద్ ప్రశాంతం

- వామపక్షాలతోపాటు కాంగ్రెస్, ఆర్పీఐ నేతల ర్యాలీలు

నెల్లూరు (వైద్యం) డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): లేడీ డాన్ ఆరవ కామాక్షి అనుచరుల చేతిలో హతమైన సీపీఎం కార్యకర్త పెంచలయ్య మృతికి నిరసనగా వామపక్షాలు మంగళవారం చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. నెల్లూరునగరంతోపాటు కావలి, కందుకూరు, ఆత్మకూరు డివిజన్లలో సీపీఎం, సీపీఐ నాయకులు, కార్యకర్తలు భారీగా బంద్‌లో పాల్గొన్నారు. నెల్లూరులోని గాంధీబొమ్మ వద్ద జరిగిన ఆందోళనలలో సీపీఎం నేతలను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. సీపీఎం, సీపీఐలతోపాటు కాంగ్రెస్, స్త్రీ విముక్తి సంఘటన, ఆర్పీఐ నేతలు నగరంలో భారీ ర్యాలీ చేపట్టారు. గంజాయి మాఫియాను అరికట్టాలని, పెంచలయ్యను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని నేతలు డిమాండ్ చేశారు.

'సెయిల్' రిటైర్డ్ ఉద్యోగికి మూడేళ్ల జైలు

విశాఖపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులో 'సెయిల్' రిటైర్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రాగం కిశోర్‌కు మూడేళ్ల జైలుశిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ సీబీఐ కోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా(సెయిల్)లో పనిచేస్తున్నప్పుడు కిశోర్ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారని సీబీఐ సోదాలు నిర్వహించింది. 1988 జనవరి నుంచి 2000 ఏప్రిల్ 19 వరకు ఆస్తులు పరిశీలించగా స్థిర, చరాస్తులన్నీ కలిపి రూ.60,25,825 ఉన్నట్టు గుర్తించారు. వాటిని ఎలా సంపాదించారనే దానిపై ఆయన సంతృప్తికరమైన సమాధానం ఇవ్వలేకపోయారు. సీబీఐ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టింది. సుదీర్ఘంగా సాగిన ఈ కేసులో విశాఖపట్నం సీబీఐ కోర్టు మూడేళ్ల జైలుశిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది.

ఆంధ్రజ్యోతి

నవ్య

కుటుంబ కదంబం

బుధవారం • 3 డిసెంబరు 2025



సినీ నటి సమంతకు పెళ్లయిపోయింది. ప్రముఖ సినీ నిర్మాత, దర్శకుడు రాజ్ నిడిమోరును ఆమె వివాహం చేసుకున్నారు. పెళ్లిలో సమంత ఎర్రని చీర ధరించి బంగారు ఆభరణాలు పెట్టుకుని, పూల కొప్పుతో అందంగా మెరిసిపోయారు. సింపుల్ మేకప్, చేతులకు ఎర్రగా పండిన గోరింటాకు ఆమె అందాన్ని మరింత పెంచాయి. ముఖ్యంగా ఆమె ఎడమచేతి వేలికి ఉన్న పెళ్లి ఉంగరం అందరి దృష్టినీ ప్రత్యేకంగా ఆకర్షించింది.

ఆ వేడుకలో ఆకర్షణలివే



అందమైన చీర

ఎర్రని బనారస్ పట్టుచీరను సంప్రదాయ పద్ధతిలో కట్టుకుని ఆకర్షణీయంగా కనిపించారు సమంత. చీర బార్డర్ మొత్తం గోల్డ్ జరీ వర్క్, సీక్విన్ వర్క్, జర్దోసి వర్క్‌లతో నిండి ఉంది. చీర అంతటా జరీ పూల మోటిఫ్‌లు ప్రత్యేకంగా కనిపించాయి. చీర కొంగు కూడా జరీ దారాల ఎంబ్రాయిడరీ వర్క్‌తో విభిన్నంగా టెంపుల్ డిజైన్‌ను తలపించేలా ఉంది. ఈ చీర మీద సమంత ధరించిన ఫుల్ స్లీవ్ రెడ్ కలర్ బ్లౌజ్ చక్కగా మ్యాచ్ అయ్యింది. నెక్ లైన్ మీద, చేతుల అంచులకు చేసిన జరీ ఎంబ్రాయిడరీ వర్క్, అద్దాల వర్క్‌లు కలిసి రిచ్‌లుక్ నిచ్చాయి. రాజ్ నిడిమోరు కూడా తెల్లని కుర్తా, పైజమా, గోధుమ రంగు నెహ్రూ జాకెట్‌తో హుందాగా కనిపించారు.

పెళ్లి ఉంగరం ప్రత్యేకమైనదే...

గత రెండు రోజులుగా సమంత పెళ్లి ఉంగరం ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఆ ఉంగరంలో ఉన్నది వజ్రమా? క్రిస్టలా? దాని ధర ఎంత? ఆ మోడల్ ప్రత్యేకత ఏంటీ? అంటూ నెట్టింట్లో తెగ వెతికేస్తున్నారు అమ్మాయిలు. సమంత పెళ్లి ఉంగరం.. పొడవాటి షడ్భుజి (హెక్సాగోనల్) ఆకృతిలో పారదర్శకంగా మెరుస్తూ కనిపించింది. దీనికి స్పష్టమైన కోణీయ ముఖాలు ఉన్నాయి. ప్రముఖ జ్యువెలరీ డిజైనర్ అభిలాష భండారి చెప్పిన వివరాల ప్రకారం ఇది వజ్రపుటుంగరం. దీన్ని పోర్ట్రెయిట్ కట్‌తో ప్రత్యేకంగా రూపొందించారు. దీని ఉపరితలం పెద్దగా పలుచగా ఉంటుంది. చూడడానికి ఓ పెద్ద రాంబస్ మధ్యలో మరో చిన్న రాంబస్ ఉన్నట్లు కనిపిస్తుంది. ఉంగరం మధ్యలో ఉన్న పోర్ట్రెయిట్ కట్ డైమండ్ దాదాపు రెండు క్యారెట్ల బరువుంటుంది. దీని చుట్టూ ఎనిమిది సన్నని పోర్ట్రెయిట్ కట్ వజ్రాల రేకులను పొందికగా కూర్చారు. ఈ ఉంగరం మీద కాంతి పడినప్పుడు తళ తళ మెరుస్తూ తెల్లగా కాంతులీనుతుంది. విలక్షణమైన ఈ పోర్ట్రెయిట్ కట్‌కు చారిత్రక నేపథ్యం కూడా ఉంది. మొఘలుల కాలంలో వజ్రాన్ని సన్నని పలకల మాదిరి కట్ చేసేవారు. అరుదైన పెయింటింగ్‌లు, రాజుల తైలవర్ణ చిత్రాలను భద్రపరచేందుకు వాటి మీద ఈ తరహా డైమండ్ కట్ ప్లేట్‌ను పెట్టి ఉంచేవారు. అద్దంలా మెరుస్తూ పారదర్శకంగా ఉండే ఈ ప్లేట్‌లో నుంచి పెయింటింగ్‌లు, చిత్రాలు స్పష్టంగా కనిపించేవి. ఈ డైమండ్ పలకలతో పలుచని ఉంగరాలను కూడా తయారుచేసేవారు. షాజహాన్ భార్య ముంతాజ్ ఇలాంటి ఉంగరాలను అమితంగా ఇష్టపడేవారు. ఈ టెక్నికల్ కట్ ఆధారంగానే సమంత పెళ్లి ఉంగరాన్ని థియోడోరోస్ జ్యువెలరీ బ్రాండ్ ప్రత్యేకంగా కస్టమైజ్ చేసింది. దీని ధర సుమారు 50 లక్షల వరకు ఉండవచ్చని అంచనా! బలం, తేజస్సు, వ్యక్తిత్వం, స్పష్టత, నిబద్ధత, ప్రేమ, విశ్వాసం, నిజాయితీలకు ప్రతీకగా నిలుస్తుందీ ఉంగరం.



అలంకరణ

సమంత తన పొడవైన శిరోజాలను కొప్పులా చుట్టి దాని చుట్టూ మల్లెమాల పెట్టుకున్నారు. ముఖానికి సింపుల్ మేకప్ మాత్రమే వేసుకున్నారు. మెడలో గుండ్రని పెద్ద బంగారు చోకర్, చెవులకు జుంకాలు, బంగారు గాజులు, వేళ్లకు బంగారు ఉంగరాలు పెట్టుకుని చిరునవ్వుతో అహ్లాదంగా కనిపించారు సమంత. భూత శుద్ధి పద్ధతిలో వివాహం జరిగింది కాబట్టి ఆనవాయితీ ప్రకారం సమంత మెడలో నల్ల పూసల గొలుసుకు దేవీ మాత పెండెంట్ కనిపించింది.

బహుమతులు

వివాహానికి హాజరైన అతిథులకు అరుదైన బహుమతులను అందించారు. వీటిలో... సద్గురువు సందేశం, ఈషా పూలతో తయారుచేసిన అగరుబత్తులు, ఇండియాలో తయారైన చాక్లెట్ బార్లు, సమంతకు ఇష్టమైన సీక్రెట్ ఆల్కెమిస్ట్ బ్రాండ్ పెర్ఫ్యూమ్ తదితరాలు ఉన్నాయి.

సంకల్పం



అభినయం... అద్భుతం. నాట్యం సమ్మోహనం. కోవెలలో దీపంలా... సుప్రభాత సేవలా... దేవతలను నాట్యాభినయంతో అర్చిస్తోంది. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు శిథిల ఆలయాల జీర్ణోద్ధరణకు పూనుకొని... సామాజిక మాధ్యమాల ద్వారా ప్రభుత్వాలను కదిలించేందుకు ప్రయత్నిస్తోంది. 'టెంపుల్ డ్యాన్స్'ను నెలకొల్పి... కూచిపూడి వైభవాన్ని దేశవిదేశాల్లో ఘనంగా చాటుతోంది. ప్రత్యేక ప్రదర్శనలతో నిధులు సేకరించి... ప్రకృతి విపత్తు బాధితులకు అండగా నిలుస్తున్న నాట్య మయూరి... 24 ఏళ్ల కాట్రగడ్డ హిమాన్సీ చౌదరిని 'నవ్య' పలుకరించింది.

కోవెలలో దీపంలా

"మా అమ్మ శ్రీలక్ష్మికి ఒక కల... నన్ను కూచిపూడి నర్తకిగా చూడాలని. తన అభీష్టాన్ని గ్రహించి నేను నాట్యం నేర్చుకోవాలని అనుకున్నాను. ఇంటర్ చదివే రోజుల్లో కూచిపూడి శిక్షణలో చేరాను. తరువాత మద్రాస్ ఆర్కిటెక్చర్ కళాశాలలో సీటు వచ్చింది. అయితే అప్పటికే కూచిపూడితో నాకు మంచి అనుబంధం ఏర్పడింది. దాంతో సీటు వదులుకుని, మా స్వస్థలం వరంగల్‌లోనే బీటెక్ చదవాలని నిర్ణయించుకున్నాను. ఇంజనీరింగ్‌తో పాటు నాట్యాన్ని కూడా కొనసాగించాను. పోటీల్లో పాల్గొన్నాను. పలు ప్రదర్శనలు కూడా ఇచ్చాను. ఈ క్రమంలోనే అమెరికాలో జరిగే 'తానా, ఆటా' సభల్లో కూచిపూడి ప్రదర్శించాను. ఆహూతులు, ప్రముఖుల నుంచి ఎన్నో ప్రశంసలు అందాయి. రానురాను కూచిపూడితో నాకు విడదీయరాని అనుబంధం ఏర్పడింది. నా జీవితంలో ఒక భాగం అయిపోయింది.

రాష్ట్రపతి ప్రశంసలు...

మహారాష్ట్ర ఖజురహోలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక నృత్య పోటీల్లో నాకు ఎన్నో బహుమతులు వచ్చాయి. మహాకుంభమేళా, గంగా ఉత్సవాలతో పాటు చిదంబరం, అయోధ్య తదితర ప్రముఖ ఆలయాల్లో ప్రదర్శనలు ఇచ్చాను. ముఖ్యంగా రెండేళ్ల కిందట జరిగిన రిపబ్లిక్ పరేడ్ సందర్భంగా రాష్ట్రపతి, ప్రధాని సమక్షంలో నర్తించడం, ప్రముఖుల ప్రశంసలు అందుకోవడం మరిచిపోలేని అనుభవం.

శిథిల ఆలయాల జీర్ణోద్ధరణకు...

ప్రదర్శనలు, పోటీల కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లే క్రమంలో పురాతన ఆలయాలు నన్ను ఆకర్షించాయి. శిథిలావస్థలో ఉన్న వాటిని చూసినప్పుడు బాధనిపించింది. చారిత్రక ప్రాధాన్యం గల వాటిని పునరుద్ధరించేందుకు నా వంతు ప్రయత్నం చేయాలని అనుకున్నాను. అందుకు కూచిపూడి నాట్యాన్ని ఒక సాధనంగా మలచుకున్నాను. తద్వారా ప్రజలు, ప్రభుత్వాల దృష్టిని ఆకర్షించే ప్రయత్నం నాది. దాని కోసం 'టెంపుల్ డ్యాన్స్' పేరిట ఒక సంస్థను నెలకొల్పాను. దాని ద్వారా కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశంలోని శిథిల ఆలయాల జీర్ణోద్ధరణకు సంకల్పించాను. ఎక్కడెక్కడ ఇలాంటి ఆలయాలు ఉన్నాయో తెలుసుకోవడానికి, వాటి వివరాలు పొందుపరచడానికి ఒక వెబ్‌సైట్ కూడా ప్రారంభించాను. కొందరు కళాకారులతో కలిసి ఈ మహత్తర కార్యానికి శ్రీకారం చుట్టాను.



భావితరాలకు అందించేందుకు...

మా కార్యక్రమంలో భాగంగా మా దృష్టికి వచ్చిన దేవాలయాలకు వెళతాం. ఆ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తాం. ఆధ్యాత్మికత మిళితమైన గీతాలతో కూచిపూడి నాట్య ప్రదర్శన ఇస్తాం. దానిపై ఒక డాక్యుమెంటరీ రూపొందించి, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం కల్పిస్తాం. దీనివల్ల రెండు ప్రయోజనాలు. ఒకటి ఆలయ ప్రాశస్త్యం, ప్రాముఖ్యత దేశమంతటికీ తెలుస్తుంది. ప్రభుత్వాల దృష్టిని ఆకర్షిస్తుంది. తద్వారా మరమ్మతులు జరిగి, పూర్వ వైభవం సంతరించుకొంటుందనేది మా ఆలోచన. మా ఈ ప్రయత్నంవల్ల ఇప్పటికే కొన్ని ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలు పునఃప్రారంభమయ్యాయి. ఏదిఏమైనా మన ఘనమైన వారసత్వ సంపదను భావి తరాలకు అందించడమే ధ్యేయంగా పెట్టుకున్నాం.

విశ్వమోహతి అకాడమీ...

నా జీవితం కళకు అంకితం. నాట్యంతో సమాజంలో మార్పు తేవచ్చనేది నా నమ్మకం. అందుకే నా నాట్య, ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు ఒక వేదిక ఉండాలనుకున్నాను. దాని కోసం వరంగల్‌లో 'విశ్వమోహతి అకాడమీ' నెలకొల్పాను. ఈ అకాడమీ ద్వారా కూచిపూడి నేర్పిస్తున్నాను. ప్రస్తుతం 130 మంది మా అకాడమీలో నాట్యం అభ్యసిస్తున్నారు. నా ఆశయాలకు అనుగుణంగా, సామాజిక బాధ్యతగా వారిని కూడా సేవా మార్గం వైపు నడిపిస్తున్నాను.

బాధితులకు అండగా...

ప్రస్తుతం నేను న్యాయశాస్త్రం అభ్యసిస్తున్నాను. చదువు, నాట్యం, శిథిల ఆలయాల జీర్ణోద్ధరణ సంకల్పం.. ఇవన్నీ చేయగలుగుతున్నానంటే అందుకు మా అమ్మ శ్రీలక్ష్మి, నాన్న శ్రీనివాసరావు సహకారం, ప్రోత్సాహంవల్లే సాధ్యమవుతోంది. బాల్యం నుంచి నేను ఏది అడిగినా వారు కాదనలేదు. అయితే నా ప్రదర్శనలు ఆలయాలకే పరిమితం కాలేదు. ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారు. వారి కోసం ఆయా ప్రాంతాల్లో నాట్య ప్రదర్శనలు ఇచ్చి, నిధులు సేకరిస్తాను. ఆ సొమ్మును బాధితులకు అందచేస్తాను."

• ఎస్.మల్లిఖార్జునరావు, నందిగామ

పిల్లల పెంపకానికి పుస్తకమా?

పిల్లలను పెంచడం కత్తిమీద సాములాంటిది. అయితే ఈ తరంలో చాలామందికి పిల్లలను ఎలా పెంచాలో తెలియదు. పిల్లల పెంపకంలో ఏమైనా సమస్యలు వస్తే ఒకప్పుడు అమ్మనో, అమ్మమ్మనో అడిగేవారు. ప్రస్తుతం ఉద్యోగాలు, ఇతరత్రా కారణాలతో కుటుంబానికి దూరంగా ఉంటుండంతో ఆ వెసులుబాటు లేకుండా పోయింది. దీంతో ఇప్పుడు ఏ సమస్య వచ్చినా వెంటనే తమ ఫోన్లలో ఇన్‌స్టాగ్రామ్‌ను తెరుస్తున్నారు. ఇప్పుడిది కొత్త పేరెంటింగ్ పుస్తకంగా మారిపోయింది. పిల్లలకు ఏం పెట్టాలి? రాత్రంతా నిద్రపోవాలంటే ఏం చేయాలి? వంటి ప్రతి ప్రశ్నకు ఇక్కడ సమాధానం దొరకడమే ఇందుకు కారణం. మానసిక నిపుణులు మాత్రం దీనితో ఏకీభవించడం లేదు. ఇది ఆకర్షణీయంగా, సులభంగా కనిపిస్తుంది కానీ, ప్రయోజనం ఉండదని చెబుతున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆకర్షణీయమైన ఆహార పదార్థాలతో కూడిన ప్లేట్‌ను చూసినప్పుడు, తమ పిల్లలకు అలాంటి దానిని అందించలేకపోతున్నామన్న అపరాధ భావానికి తల్లిదండ్రులు గురవుతారని అంటున్నారు. నిజమైన పేరెంటింగ్ అనేది కొంత కష్టంగా ఉంటుందని, ఇన్‌స్టాగ్రామ్ పేరెంటింగ్ దీనికి పూర్తి విరుద్ధంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.



విశ్వాసం కోల్పోయే ప్రమాదం

ప్రతి చిన్న విషయానికి ఆన్‌లైన్‌లో సలహాల కోసం వెతకడం వల్ల తల్లిదండ్రులు తమపై తమకుండే విశ్వాసాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రతి రోజు ఇంట్లో ఐదు రకాల ఆహార పదార్థాలను సిద్ధం చేయకపోతే తాము మంచి తల్లిదండ్రులం కాదేమోనని భావించడం, ఇతరులతో పోలికలు వంటివి వారిని అపరాధ భావంలోకి నెట్టేస్తాయని అంటున్నారు. నిజానికి పిల్లలకు ఇన్‌స్టాగ్రామ్ తల్లిదండ్రులు అవసరం లేదని, వారికి అందుబాటులో ఉండి, తమ అవసరాలకు వెంటనే స్పందించేవారు మాత్రమే కావాలని చెబుతున్నారు. ఇంకా చెప్పాలంటే పిల్లలకు వారి సహజ సిద్ధమైన ఎదుగుదలకు తోడ్పడటమే నిజమైన పేరెంటింగ్ అని అంటున్నారు.

బొమ్మలు సర్దేద్దాం రండి..!

ఇంట్లో పిల్లలు బొమ్మలతో ఆడుకునే క్రమంలో వాటిని ఇల్లంతా చిందరవందరగా పడేస్తుంటారు. తరువాత వాటిని సర్దడం పెద్ద పని అయిపోతుంది. దీనివల్ల ఇంటి అందం పాడవుతుంది. అలాకాకుండా ఆడుకున్న తరువాత బొమ్మలను చక్కగా ఎలా సర్దాలో తెలుసుకుందాం.

- పిల్లలు ఆడుకోవడానికి ఇంట్లో ఒక చోటును కేటాయించాలి. అలా కుదరని పక్షంలో హాల్ లేదా పడకగదిలో ఓ పక్కగా ఆడుకోమని పిల్లలకు చెప్పాలి. దీనివల్ల బొమ్మలు సర్దడం సులువవుతుంది. రోజూ రాత్రి పడుకునేముందు పిల్లలతో కలిసి బొమ్మలు సర్దుతుంటే వాళ్లు కూడా దాన్నే అలవాటు చేసుకుంటారు.




- ఇంట్లో చాలా రకాల బొమ్మలు ఉన్నట్లయితే వాటిని కేటగిరీల వారీగా విభజించాలి. సాఫ్ట్ టాయ్స్, బిల్డింగ్ బ్లాక్స్, మాగ్నటిక్ ఆల్ఫాబెట్స్, రైల్ ట్రాక్‌లు, కార్లు, ట్రక్కులు, పజిల్స్, ఎలక్ట్రిక్ టాయ్స్, కిచెన్ సెట్ ఇలా అన్నింటినీ వేరుచేసి పెట్టాలి. తరువాత వాటిని ప్లాస్టిక్ బాక్స్‌లు, షూ బాక్స్‌లు, జిప్‌లాక్ కవర్లలో వేసి అరల్లో సర్దేయాలి. పారదర్శకంగా ఉండే స్టోరేజ్ బాక్సులను ఎంచుకుంటే లోపల ఏ బొమ్మలు ఉన్నాయో కనిపిస్తుంటుంది. అలా లేని పక్షంలో బాక్సుల మీద లేబుల్స్ రాసి పెట్టాలి. బొమ్మలన్నింటినీ ఒకేసారి తీయకుండా.. కావాల్సిన వాటిని తీసుకుని ఆడుకునేలా పిల్లలకు అలవాటు చేయాలి.
- నాలుగైదు వరుసల్లో నిలువుగా అయిదారు అరలు ఉండే ప్లాస్టిక్ స్టాండ్‌ను కొని పిల్లలు ఆడుకునే చోట ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. టెడ్డీబేర్లు, కిండర్‌జాయ్ లాంటివాటిలో వచ్చే బొమ్మలు, డ్యాన్సింగ్ డాల్, బార్బీ గర్ల్స్, ఎలక్ట్రిక్ టాయ్స్‌ను ఒక క్రమంలో అందంగా కనిపించేలా స్టాండ్‌లో సర్దాలి. ఆడుకున్న తరువాత వాటిని ఎక్కడి నుంచి తీశారో అక్కడే పెట్టాలని పిల్లలకు గట్టిగా చెప్పాలి.
- డ్రాయింగ్‌కు సంబంధించిన కలర్ పెన్సిల్స్, వాటర్ కలర్స్, ఆయిల్ కలర్స్ బ్రష్‌లు, కలరింగ్ బుక్స్ క్లే సింబల్స్, క్లే మెటీరియల్ తదితరాలను ఒక అరలో సర్దాలి. స్టోరీ బుక్స్, కామిక్ బుక్స్, పజిల్ బుక్స్, ట్యాబ్ తదితరాలను మరో అరలో పెట్టాలి.

ఫ్యాషన్


కాలి వేళ్లకు ధరించే మట్టెలు తాజా ఫ్యాషన్‌గా మారిపోయాయి. వెండితో పాటు బంగారంతోనూ రూపొందుతున్న ఈ మట్టెలు, పలు రకాల డిజైన్లతో మహిళల మనసులను దోచుకుంటున్నాయి. అలాంటి కొన్ని టో రింగ్స్ మీకోసం...

మనసు దోచే మట్టెలు





పెళ్లైన హిందూ మహిళలు తప్పనిసరిగా ధరించే ఆభరణమిది. వీటిని ధరించడం వెనక కొన్ని ఆరోగ్య ప్రయోజనాలు కూడా దాగి ఉన్నాయి. పాదంలోని రెండో వేలుకు ధరించే మట్టెలతో కీలకమైన నాడులు ప్రేరేపితమై పునరుత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని అంటారు. తాజాగా మట్టెల ఫ్యాషన్ మళ్లీ ఊపందుకుంది. ఎనామిల్, జాతిరాళ్లను పొదిగి తయారుచేసే మట్టెలు మార్కెట్లో దొరుకుతున్నాయి. బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్న ఈ రోజుల్లో ఆకట్టుకునే మెట్టెలు కొనడాన్ని తెలివైన పెట్టుబడిగానే భావించవచ్చు. తాజాగా ట్రెండ్ అవుతున్న మట్టెలను ఎంచుకోవడంలో కొన్ని చిట్కాలు పాటిస్తే, ట్రెండ్ సెటర్‌గా కూడా మారిపోవచ్చు. అవేంటో తెలుసుకుందాం!



- ధరించే దుస్తులకు తగిన మట్టెలు ఎంచుకోవాలి. చీరకట్టుకు సంప్రదాయబద్ధంగా కనిపించే వెండి మట్టెలు బాగుంటాయి. మువ్వలు, వంకీల మట్టెలు చాలా బాగా నప్పుతాయి
- ఆధునిక దుస్తులతో ధరించే మట్టెలు కూడా ఆధునికంగానే ఉండాలి. వీలైనంత సన్నగా, ట్రెండీగా ఉండే మట్టెలు ఎంచుకోవాలి. రంగురంగుల ఎనామిల్ కలిగిన మట్టెలు డ్రస్సులతో మ్యాచ్ అవుతాయి
- కాళ్లకు బంగారం ఆభరణాలు పెట్టుకోకూడదనే నమ్మకాలకు రోజులు చెల్లాయి. కాబట్టి మట్టెల విషయంలో ఈ నియమం పాటించవలసిన అవసరం లేదు



- పార్టీ వేర్ ధరించినప్పుడు కాస్త భారీగా ఉండే రాళ్ల మట్టెలు ఎంచుకోవచ్చు
- మట్టెలు, పట్టీలు సరిజోడి కాబట్టి రెండూ మ్యాచ్ అయ్యేలా చూసుకుంటే పాదాల అందం రెట్టింపు అవుతుంది
- మువ్వల పట్టీలు వినసొంపైన ధ్వనిని వెలువరిస్తాయి. వీటికి అదే తరహా మట్టెలు జోడించుకోవచ్చు.

మొటిమల మచ్చలు మాయం ఇలా

శరీరంలో హార్మోన్ల మార్పులు, ఒత్తిడి, వాతావరణ కాలుష్యం తదితర కారణాల వల్ల ముఖం మీద మొటిమలు వాటి నుంచి మచ్చలు ఏర్పడుతుంటాయి. మొటిమల మచ్చలను త్వరగా మాయం చేసే చిట్కాలు ఇవే...

- కలబంద గుజ్జును తీసుకుని మచ్చల మీద రాసి సున్నితంగా మర్దన చేయాలి. కలబందలోని యాంటీ బ్యాక్టీరియల్ గుణాల వల్ల చర్మం పొరలు వేగంగా వృద్ధి పొంది మచ్చలు తొలగిపోతాయి.
- రాత్రి పడుకునేముందు మొటిమల మీద కొద్దిగా తేనె రాయాలి. తేనెలోని మైక్రోబియల్ గుణాల వల్ల మొటిమలు త్వరగా తగ్గిపోతాయి. చర్మం మీద మచ్చలు ఏర్పడవు.
- ఒక గిన్నెలో రెండు చెంచాల పసుపును తీసుకుని అందులో పాల చుక్కలు చిలకరిస్తూ ముద్దలా చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించుకుని అరగంట తరువాత గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకుంటే క్రమంగా మొటిమలు, మచ్చలు తొలగిపోతాయి.
- చిన్న గిన్నెలో రెండు చెంచాల టీ ట్రీ ఆయిల్, ఒక చెంచా ఆలివ్ ఆయిల్ వేసి బాగా కలపాలి. ఈ నూనెల మిశ్రమాన్ని చూపుడు వేలితో కొద్దికొద్దిగా తీసుకుంటూ మచ్చల మీద మర్దన చేయాలి. అరగంట తరువాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. వారానికి మూడుసార్లు ఇలా చేస్తుంటే మచ్చలు తగ్గిపోతాయి.
- రోజుకు రెండుసార్లు రోజ్ హిప్ సీడ్ ఆయిల్‌తో ముఖాన్ని సున్నితంగా మర్దన చేసుకోవాలి. ఈ నూనెలోని ఎ, సి, ఇ విటమిన్లు; యాంటీ ఆక్సిడెంట్లు కలిసి చర్మానికి పోషణను అందిస్తాయి. మచ్చలు, ముడతలు, గీతలు తగ్గి చర్మం కాంతివంతంగా మారుతుంది.
- మచ్చల మీద.. చల్లారిన గ్రీన్ టీ, కీరా గుజ్జు, వేపాకుల పేస్టు, బంగాళదుంపల రసం లాంటివి రాసినా మంచి ఫలితం కనిపిస్తుంది.





డీఆర్‌డీవో రాకెట్ స్లెడ్ టెస్ట్ విజయవంతం!

» యుద్ధ విమానం నుంచి పైలట్ తప్పించుకునే ఎజెక్ట్ సీటు వ్యవస్థను పరీక్షించిన శాస్త్రవేత్తలు

న్యూఢిల్లీ, డిసెంబరు 2: అత్యంత వేగంగా దూసుకెళ్లే యుద్ధ విమానాల్లో, రాకెట్లలో ఉపయోగించే పరికరాలను పరీక్షించే 'హైస్పీడ్ రాకెట్-స్లెడ్ టెస్ట్'ను డీఆర్‌డీవో విజయవంతంగా పరీక్షించింది. ఛత్తీస్‌గఢ్‌లోని టెర్మినల్ బాలిస్టిక్ రీసెర్చ్ ల్యాబొరేటరీ (టీబీఆర్ఎల్)లో ఏర్పాటు చేసిన 'రైల్ ట్రాక్ రాకెట్ స్లెడ్ (ఆర్‌టీఆర్ఎస్)' కేంద్రంలో యుద్ధ విమాన పైలట్ ఎజెక్ట్ వ్యవస్థను ప్రయోగాత్మకంగా పరిశీలించింది. విమానం ప్రమాదానికి గురైనప్పుడు లేదా నియంత్రణ కోల్పోయినప్పుడు పైలట్ ప్రాణాలు కోల్పోకుండా.. కేవలం సెకన్ల వ్యవధిలో సీటుతో సహా గాల్లోకి ఎగిరి, తర్వాత ప్యారాచూట్ సాయంతో సురక్షితంగా నేలపైకి దిగేందుకు ఈ వ్యవస్థ వీలు కల్పిస్తుంది. ఈ సీటు దిగువన చిన్నపాటి రాకెట్ ఇంజన్లు ఉంటాయి. అవి క్షణాల్లోనే మండి సీటు గాల్లోకి ఎగురుతుంది. తేజస్ విమానాల కోసం డీఆర్‌డీవో ఈ వ్యవస్థను అభివృద్ధి చేస్తోంది. దీనిని ఇప్పటివరకు కదలకుండా ఉండే ఒక వేదిక మీది నుంచి ప్రయోగించి చూశారు. కానీ గంటకు వందల కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లే విమానంలో అది ఎలా పనిచేస్తుందన్నది పరీక్షించేందుకు 'రాకెట్-స్లెడ్ టెస్ట్' నిర్వహించారు. అమెరికా, రష్యా, ఫ్రాన్స్ చైనా తదితర కొన్ని దేశాలకు మాత్రమే 'రాకెట్-స్లెడ్ టెస్ట్' చేసే సామర్థ్యం ఉంది. ఇప్పుడా దేశాల జాబితాలో భారత్‌కూడా చేరింది. ఇప్పుడు ఆర్‌టీఆర్ఎస్ కేంద్రంలో తేజస్ ఫైటర్ ముందుభాగాన్ని రాకెట్‌కు అమర్చి, గంటకు 800 కిలోమీటర్ల వేగం వద్ద పైలట్ ఎజెక్ట్ వ్యవస్థ'ను విజయవంతంగా పరీక్షించారు.

ఆపిల్ ఇంటెలిజెన్స్ వైస్ ప్రెసిడెంట్‌గా అమర్



న్యూఢిల్లీ, డిసెంబరు 2: ఆపిల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సంస్థ వైస్ ప్రెసిడెంట్‌గా భారత సంతతికి చెందిన అమర్ సుబ్రమణ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఆపిల్ సంస్థ ఓ ప్రకటన విడుదల చేసింది. ఆపిల్ సంస్థకు చెందిన కృత్రిమ మేధ విభాగమే ఈ ఆపిల్ ఇంటెలిజెన్స్ సంస్థ. అయితే, తమ ఫోన్ల కోసం సమర్థమంతమైన సొంత జనరేటివ్ ఏఐ వ్యవస్థను నిర్మించుకోవడంలో ఆపిల్ వెనకబడిపోయిందన్న విమర్శలున్నాయి. ఏఐ రంగంలో గూగుల్, ఓపెన్ ఏఐ నుంచి తీవ్ర పోటీ నెలకొన్న వేళ అమర్ నియామకం ప్రాధాన్యం సంతరించుకొంది. అమర్ ఏఐలో నిష్ణాతుడు. అంతకుముందు గూగుల్‌లో పనిచేశారు. గూగుల్ జనరేటివ్ ఏఐ చాట్‌బాట్ 'జెమిని' రూపకల్పనలో కూడా పాలుపంచుకున్నారు. జూన్‌లో ఆ సంస్థకు రాజీనామా చేశారు. కాగా, అమర్ 2001లో బెంగళూరు యూనివర్సిటీ నుంచి ఇంజనీరింగ్ పూర్తి చేశారు. తర్వాత ఐబీఎంలో చేరారు. ఆ తర్వాత అమెరికాలో స్థిరపడ్డారు.

2వేల శ్లోకాలతో దండక్రమ పారాయణం

» 19 ఏళ్ల యువ వేదమూర్తికి ప్రధాని అభినందన



మహేశ్ రేఖే

న్యూఢిల్లీ, డిసెంబరు 2: శుక్ల యజుర్వేదం లోని 2,000 శ్లోకాలను 50 రోజుల్లో నిరంతరంగా పఠనం చేసి దండక్రమ పారాయణం పూర్తిచేసిన ఓ యువ వేద పండితుడిని ప్రధాని మోదీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ అద్భుతమైన ఘనత సాధించిన యువకుడు మహారాష్ట్రకు చెందిన వేదమూర్తి దేవవ్రత మహేశ్ రేఖే (19). పటిష్ఠమైన ధ్వని నియమాలు, పఠన పద్ధతులు కలిగిన ఈ దండక్రమ పారాయణాన్ని వేద పఠనంలో అత్యున్నతమైనదిగా భావిస్తారు. అంతటి గొప్ప పారాయణాన్ని మహేశ్ కాశీలోని వల్లభరామ్ శాలిగ్రామ్ సంగ్‌వేద్ విద్యాలయంలో అక్టోబరు 2 నుంచి నవంబరు 30 వరకు పూర్తిచేశారు. ఈ యువ పండితుడికి సహకారం అందించిన శృంగేరి మఠం ఎక్స్‌లో ఒక పోస్ట్ చేస్తూ, దాదాపు 200 ఏళ్ల తర్వాత తొలిసారిగా ఇంతటి స్వచ్ఛతతో ఈ పారాయణ పఠనం పూర్తి కావడం అరుదైన విషయం అని పేర్కొంది. ఈ అసాధారణమైన ఘనత కాశీ నగరంలో జరగడం తనకు సంతోషాన్ని ఇచ్చిందని మోదీ తెలిపారు.

చైనాలో కండోమ్స్‌పై 13% పన్ను

బీజింగ్, డిసెంబరు 2: రోజురోజుకి పడిపోతున్న జననాల సంఖ్య దేశ ఆర్థిక ప్రగతికి ముప్పుగా మారడంతో చైనా దిద్దుబాటు చర్యలకు సిద్ధమైంది. దేశ జనాభాను పెంచుకోవడమే లక్ష్యంగా కండోమ్‌లపై 13 శాతం పన్ను విధించింది. కండోమ్‌లతోపాటు గర్భనిరోధానికి వినియోగించే మందులు, పరికరాలపై కూడా పన్నులు విధించింది. ఒకరికి ఒకే బిడ్డ అనే నిబంధనను 1993లో అమలులోకి తెచ్చిన చైనా జనాభా నియంత్రణను ప్రోత్సహించింది. కానీ ఇప్పుడు జనాభాను పెంచుకునేందుకు గాను కండోమ్‌లు, గర్భనిరోధకాలపై పన్నుల భారం మోపింది. అదే సమయంలో చైల్డ్ కేర్ సర్వీసులు, వృద్ధుల సంరక్షణ కేంద్రాలు, వికలాంగుల సేవలు, వివాహ సంబంధిత సేవలపై పన్ను మినహాయింపులు ప్రకటించింది.

5, 10 ఏళ్లలో అణు యుద్ధం జరగొచ్చు: మస్క్

న్యూఢిల్లీ, డిసెంబరు 2: ప్రపంచానికి వణుకు పుట్టించే విషయం ఒకటి అపర కుబేరుడు ఎలాన్ మస్క్ చెప్పారు. వచ్చే 5, 10 ఏళ్లలో అణు యుద్ధం జరగవచ్చన్నారు. అయితే ఆ యుద్ధం ఎలా ప్రారంభమవుతుంది, ఎవరి మధ్య జరుగుతుంది అనేది మాత్రం వెల్లడించలేదు. తనకు చెందిన ఎక్స్‌లో ఓ పోస్టుకు సమాధానం ఇస్తూ మస్క్ ఆ వ్యాఖ్యలు చేశారు. ఎక్స్‌లో హంటర్ యాష్ అనే వ్యక్తి యుద్ధాలపై తన అభిప్రాయం వెల్లడించారు. "ప్రధాన శక్తుల మధ్య యుద్ధాలను, యుద్ధ ముప్పును అణ్వాయుధాలు నిరోధిస్తాయని నమ్మడం వల్ల ప్రపంచ దేశాలపై బాగా పనిచేయాలనే ఒత్తిడి ఉండటం లేదు" అని హంటర్ తన పోస్టులో పేర్కొన్నారు. దీనికి వెంటనే మస్క్.. యుద్ధం అనివార్యమని సమాధానం ఇచ్చారు.

సూసైడ్ బాంబర్‌తో విమానాన్ని పేల్చేస్తాం

» కువైట్ నుంచి శంషాబాద్ వస్తున్న విమానానికి బెదిరింపు

శంషాబాద్ రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కువైట్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న 6ఈ ఇండిగో 1234 విమానాన్ని సూసైడ్ బాంబర్‌తో పేల్చేస్తామని శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మంగళవారం ఉదయం 5.25గంటలకు బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. అప్రమత్తమైన భద్రత, ఎయిర్‌లైన్స్ అధికారులు విమానాన్ని ముంబైకి దారి మళ్లించారు. ముంబై విమానాశ్రయంలో డాగ్, బాంబు స్క్వాడ్‌లతో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఎలాంటి బాంబు దొరకలేదు. దీంతో, విమానాన్ని ముంబయి నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు పంపించారు. మరోవైపు శంషాబాద్ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే 8విమాన సర్వీసులు మంగళవారం వాతావరణం అనుకూలించకపోవడం లేదా విమానసిబ్బంది కొరత వల్ల రద్దయ్యాయి.

జాతీయ రహదారులపై భద్రతా హెచ్చరికలు

» జియో వినియోగదారులకు జారీ..ఎన్‌హెచ్‌ఏఐ ఒప్పందం

న్యూఢిల్లీ, డిసెంబరు 2: దేశంలో జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి భద్రతాపరమైన హెచ్చరికలు జారీ చేసేందుకు రిలయన్స్ జియోతో ఎన్‌హెచ్‌ఏఐ ఒప్పందం కుదుర్చుకుంది. జియో వినియోగదారులు జాతీయ రహదారులపై ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలు, పశువులు సంచరించే ప్రాంతాలు, మంచు అధికంగా కురిసే ప్రదేశాలకు లేదా అత్యవసరంగా దారి మళ్లించిన ప్రదేశాలకు దగ్గరవుతున్నప్పుడు ముందుగానే హెచ్చరికలు జారీ అవుతాయి. తద్వారా జాతీయ రహదారులపై వారు వేగాన్ని తగ్గించుకుని తగు జాగ్రత్తలు తీసుకుని ప్రయాణించే అవకాశం ఉంటుంది. మెసేజ్, వాట్సాప్, అత్యవసర కాల్స్ ద్వారా ఈ సందేశాలను జారీ చేస్తారు. జియో వినియోగదారులు జాతీయ రహదారులపై ప్రయాణిస్తున్నా లేదా వాటికి దగ్గరగా ఉన్నా.. వారు ప్రమాదాలు జరిగే ప్రదేశాలకు చేరక ముందే ఆటోమెటిక్ వ్యవస్థ ద్వారా హెచ్చరికలు జారీ అవుతాయి.

ప్రతిష్టంభనకు తెర

(మొదటి పేజీ తరువాయి)



కొనసాగింది. ఈ క్రమంలో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా నేతృత్వంలో బిజినెస్ అడ్వయిజరీ కమిటీ(బీఏసీ) సమావేశం జరిగింది. భేటీ ముగిసిన అనంతరం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రిజిజు 'ఎక్స్' వేదికగా ఒక పోస్టు పెట్టారు. ఎన్నికల సంస్కరణలపై డిసెంబరు 9న చర్చించనున్నట్టు ఆయన ఆ పోస్టులో తెలిపారు. "డిసెంబర్ 8వ తేదీ సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి జాతీయ గీతం 'వందేమాతరం' 150వ వార్షికోత్సవంపై.. డిసెంబర్ 9వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో చర్చించాలని నిర్ణయించాం" అని వివరించారు. ఎన్నికల సంస్కరణలపై అవసరమైతే రెండో రోజూ చర్చించేందుకు అధికారపక్షం అంగీకరించిందని కాంగ్రెస్ చీఫ్ విప్ కె.సురేష్ మీడియాకు తెలిపారు. బీఏసీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో రెండోరోజూ వాయిదాల పర్వం కొనసాగింది. ఎస్ఐఆర్ అంశం ఉభయ సభలనూ కుదిపేసింది. ఎస్ఐఆర్‌పై చర్చించాలని పట్టుబడుతూ మంగళవారం సైతం విపక్షాలు ఆందోళనను కొనసాగించాయి. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా.. జార్జియన్ పార్లమెంట్ అధ్యక్షులు షల్వా పాపువాష్విలీ నేతృత్వంలోని జార్జియా పార్లమెంట్ బృందానికి స్వాగతం తెలిపారు. ఇంతలోనే.. ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షం పట్టుబట్టడంతో కేవలం 16 నిమిషాల్లోనే సభను మధ్యాహ్నం 12 గంటల వరకూ వాయిదా వేశారు. మళ్లీ సభ ప్రారంభం కాగానే.. కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ సహా ఇతర విపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఎస్ఐఆర్‌పై చర్చించాల్సిందేనని డిమాండ్ చేశారు. విపక్షాలు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. రాజ్యసభలోనూ ఎస్ఐఆర్‌పై చర్చించాల్సిందేనని విపక్షాలు పట్టుబట్టాయి. తొలుత రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్ జార్జియా బృందానికి స్వాగతం పలికారు. అనంతరం జీరో అవర్‌ను ప్రారంభించారు. వెంటనే ప్రతిపక్ష ఎంపీలు ఎస్ఐఆర్ సహా ఇతర అంశాలపై చర్చకు పట్టుబట్టారు. వెల్‌లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. విపక్షాల నినాదాలతో సభను వాయిదా వేశారు.


విపక్షాల ఆందోళన

ఎస్ఐఆర్‌పై చర్చించాలనే డిమాండ్‌తో మంగళవారం సైతం విపక్షాలు ఆందోళనను కొనసాగించాయి. ఉదయం పార్లమెంట్ సమావేశాల ప్రారంభానికి ముందు మకర ద్వారం ముందు నిరసన తెలిపాయి. కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ, లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రతిపక్ష నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేతోపాటు ప్రియాంక గాంధీ, కనిమొళి, టీఆర్ బాలు, తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు సహా ఇతర సభ్యులు ఈ నిరసనలో పాల్గొన్నారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు, 'స్టాప్ ఎస్ఐఆర్ - స్టాప్ ఓట్ చోరీ' అని రాసి ఉన్న భారీ బ్యానర్ పట్టుకుని నినాదాలు చేశారు.

సభ వెలుపలా 'సర్' సెగలు

పనికిమాలిన వాడా.. అంటూ రిజిజుపై రేణుకా చౌదరి ఫైర్

న్యూఢిల్లీ, డిసెంబరు 2 : 'సర్' అంశంపై పార్లమెంటు లోపలే కాకుండా, వెలుపల కూడా రాజకీయ వాతావరణం వేడెక్కిపోతోంది. 'నువ్వో పనికిమాలిన వాడివి...' అంటూ కేంద్ర మంత్రి కిరణ్ రిజిజును ఉద్దేశించి సీనియర్ కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. "నువ్వొక పనికిమాలిన వాడివి. సభను నిర్వహించడం మీకు చేతకావడం లేదు. దానికి మేమేం చేయగలం? సమస్యలపై సభలో మేం మాట్లాడాలా? వద్దా? మేం ఎస్ 'సర్', నో 'సర్' అని మాత్రమే అనాలా?" అంటూ రిజిజుపై రేణుక ధ్వజమెత్తారు. అంతకుముందు లోక్‌సభలో రిజిజు మాట్లాడుతూ... 'ప్రతి అంశం కూడా ముఖ్యమైనదే. కానీ, దానినే ఒక ఆయుధంగా చేసుకుని సభా కార్యకలాపాలను స్తంభింపజేయడం సరి కాదు" అని ఆయన సర్‌ను ఉద్దేశించి అన్నారు. మరోవైపు, "మన సైన్యం దయనీయ స్థితిలో ఉంది. ప్రభుత్వ ఒత్తిడిని తీవ్రస్థాయిలో ఎదుర్కొంటోంది." అంటూ రేణుకా చౌదరి చేసిన వ్యాఖ్యలు కూడా దుమారం రేపాయి. ఓ వార్తా సంస్థతో రేణుకా చౌదరి మాట్లాడుతూ... "ప్రభుత్వానికి మద్దతుగా ఉండాలంటూ తమపై ఒత్తిళ్లు వస్తున్నాయని ఆర్మీ అధికారులు స్వయంగా బయటకు వచ్చి మాట్లాడటం గతంలో ఎన్నడూ లేదు" అని ఆమె అన్నారు. రేణుకాచౌదరి ఓ వీధికుక్కను పార్లమెంటు ప్రాంగణంలోకి తీసుకురావడంపై జరుగుతున్న వివాదంపై రాహుల్‌గాంధీ స్పందించారు. "కుక్కలను పార్లమెంటు ప్రాంగణంలోకి అనుమతించరు. కానీ, సభలోకి మాత్రం రానిస్తారు" అంటూ వ్యాఖ్యానించారు.



'సేవా తీర్థ్'లో పీఎంవో

(మొదటి పేజీ తరువాయి)

రూపకల్పన కేంద్రంగా 'సేవా తీర్థ్' ఉంటుందని తెలిపారు. పరిపాలనాపరమైన ఆలోచన 'సత్తా(అధికారం)' నుంచి 'సేవ'కు మారుతోందన్నారు. అలాగే రాష్ట్ర గవర్నర్ నివాసం 'రాజ్‌భవన్' పేరును కూడా 'లోక్ భవన్'గా మార్చారు. ఢిల్లీలో రాష్ట్రపతి భవన్ నుంచి ఇండియా గేట్ వరకు ఉన్న రహదారిని గతంలో రాజ్‌పథ్‌గా పిలిచేవారు. దానిని కూడా ఇటీవల 'కర్తవ్య పథ్'గా మార్చారు. 2016లో ప్రధాని అధికార నివాసం పేరును లోక్‌కల్యాణ్ మార్గ్‌గా, కేబినెట్ సచివాలయాన్ని 'కర్తవ్య భవన్'గా మార్పు చేసిన సంగతి తెలిసిందే. బ్రిటిష్‌కాలం నాటి వలసవాసనలను పూర్తిగా తొలగించే ఉద్దేశంతో కొత్త నిర్మాణాలు, పేర్ల మార్పువంటివి మోదీ ప్రభుత్వం చేపట్టింది. సెంట్రల్ విస్టా పునరాభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా కీలకమైన ప్రభుత్వ కార్యాలయాలన్నిటినీ కొత్త 'ఎగ్జిక్యూటివ్ ఎంక్లేవ్'కు మారుస్తున్నారు. ఇందులో పీఎంవోతో పాటు కేబినెట్ సచివాలయం, జాతీయ భద్రతా మండలి సచివాలయం, విదేశీ అతిథులతో అత్యున్నత స్థాయి చర్చలు జరిగే 'ఇండియా హౌస్' కూడా ఉంటాయి. ఎగ్జిక్యూటివ్ ఎంక్లేవ్-1లో కొత్తగా మూడు భవనాలు నిర్మిస్తున్నారు. అందులో వాయుభవన్ సమీపాన నిర్మించిన 'సేవాతీర్థ్-1'లో పీఎంవో పనిచేస్తుంది. ఇప్పటికే అక్కడ కార్యకలాపాలు మొదలయ్యాయి. సేవాతీర్థ్-2లో కేంద్ర కేబినెట్ సచివాలయం ఆగస్టు నుంచే పనిచేస్తోంది. సేవాతీర్థ్-3లో జాతీయ భద్రతా మండలి కార్యాలయం ఉంటుంది. ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్-3లో ప్రధానమంత్రి నివాస సముదాయం రానుంది. 'ఈ మార్పులు లోతైన సైద్ధాంతిక పరివర్తనకు నిదర్శనం. అధికారం కంటే బాధ్యతను, స్థాయి కంటే సేవకు భారత ప్రజాస్వామ్యం ఎంపిక చేసుకుంటోంది. పేర్పు మార్చడం అంటే మైండ్‌సెట్ కూడా మారినట్లు. ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాలు పౌరులకే ప్రథమ ప్రాధాన్యమిస్తూ.. సేవ, కర్తవ్యాల భాషను మాట్లాడుతున్నాయి' అని అధికారులు పేర్కొన్నారు.

సంచార్ సాథీ యాప్ తప్పనిసరి కాదు

» వద్దనుకుంటే ఫోన్ నుంచి డిలీట్ చేసుకోవచ్చు: సింధియా

న్యూఢిల్లీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్లలో సంచార్ సాథీ యాప్‌ను తప్పనిసరిగా ఇన్‌బిల్ట్‌గా అందించాలన్న ఆదేశాలను కేంద్ర ప్రభుత్వం వెనక్కు తీసుకుంది. ఈ యాప్ తప్పనిసరి ఏమీ కాదని కేంద్ర సమాచార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ప్రకటించారు. ప్రజలకు సైబర్ దాడులు, ఫోన్ల అపహరణ నుంచి భద్రత కల్పించేందుకే ఈ యాప్‌ను అన్ని మొబైల్ ఫోన్లలో తప్పనిసరిగా అందించాలని ఫోన్ల తయారీ కంపెనీలకు ఆదేశాలిచ్చినట్లు వెల్లడించారు. పార్లమెంటు బయట మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ యాప్ ద్వారా ప్రజలపై ప్రభుత్వం నిఘా పెట్టాలని చూస్తోందన్న ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టారు. 'ప్రతి మొబైల్ వినియోగదారుడి వద్దకు సంచార్ సాథీ యాప్‌ను చేర్చటం మా విధి. ఒకవేళ మీరు దీనిని డిలీట్ చేయాలనుకుంటే చేసుకోవచ్చు. ఫోన్‌లో ఉన్నా దీనిని మీరు వాడొద్దని నిర్ణయించుకుంటే, యాప్‌లో రిజిస్టర్ కావాల్సిన అవసరం లేదు. అప్పుడు ఈ యాప్ ఫోన్‌లో ఉన్నా పనిచేయదు. ఈ యాప్ ద్వారా ఎలాంటి గూఢచర్యంగానీ, ఫోన్‌కాల్స్‌పై నిఘాగానీ ఉండదు. వినియోగదారుల భద్రత కోసమే ఈ యాప్‌ను తీసుకొచ్చాం' అని సింధియా స్పష్టంచేశారు. సంచార్‌సాథీ యాప్‌తో ప్రజల వ్యక్తిగత గోప్యతకు ఎలాంటి నష్టం ఉండదని మరో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

ప్రజలపై నిఘా కోసమే ఈ యాప్: కాంగ్రెస్

బీజేపీ పాలనలో దేశం నిఘా నీడలోకి వెళ్లిపోయిందని కాంగ్రెస్ ఆరోపించింది. ప్రజలపై గూఢచర్యం నిర్వహించేందుకే కేంద్రం సంచార్ సాథీ యాప్‌ను తీసుకొచ్చిందని కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ ఆరోపించారు. దేశాన్ని నిరంకుశత్వం గుప్పిట్లోకి తీసుకొనేందుకు జరుగుతున్న మరో ప్రయత్నమే ఈ యాప్‌ను తప్పనిసరి చేయటమని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. 'ప్రజలపై నిఘా, గూఢచర్యం, నియంత్రణకు బీజేపీ పాలన హాల్‌మార్క్‌గా మారింది' అని మండిపడ్డారు. మోదీ పాలనలో దేశం నిఘా రాజ్యం అయ్యిందని కాంగ్రెస్ కార్యదర్శి రణ్‌దీప్ సుర్జేవాలా ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిదానిని తప్పనిసరి చేయటం సమస్యలు సృష్టిస్తుందని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ వ్యాఖ్యానించారు. కాగా, ఈ అంశంపై తాను పార్లమెంటులోనే మాట్లాడుతానని రాహుల్‌గాంధీ తెలిపారు. ఈ యాప్‌తో వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందని తెలంగాణ కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు.

మతం మారితే ఎస్సీ హోదా కుదరదు!

అది రాజ్యాంగాన్ని మోసం చేయటమే

» అలహాబాద్ హైకోర్టు స్పష్టీకరణ

ప్రయాగ్‌రాజ్, డిసెంబరు 2: ఇతర మతాల్లోకి మారిన తర్వాత కూడా ఎస్సీ హోదాను ఉపయోగించుకోవటం రాజ్యాంగాన్నే మోసం చేయటమని ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ హైకోర్టు పేర్కొంది. ఈ మేరకు సంబంధిత 'రాజ్యాంగ నిబంధన, 1950'ని ప్రస్తావించింది. హిందూ, బౌద్ధ, సిక్కు మతాలకు చెందినవారు కాకుండా ఇతర మతాల వారిని ఎస్సీ వర్గానికి చెందినవారిగా గుర్తించటం సాధ్యం కాదని ఆ నిబంధన స్పష్టం చేస్తోందని తెలిపింది. సూసాయ్, కేపీ మను, సీ సెల్వరాజ్ కేసుల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను ఉదహరిస్తూ.. మతాంతీకరణ తర్వాత కూడా ఎస్సీ హోదాను ఉపయోగించుకోవటం రిజర్వేషన్ భావనకే విరుద్ధమని పేర్కొంది. కులపరమైన వివక్ష క్రైస్తవంతోపాటు పలు ఇతర మతాల్లో లేదని తెలిపింది. ఈ నేపథ్యంలో ఎస్సీ హోదాను పేర్కొంటూ హిందూ, బౌద్ధ, సిక్కుయేతర మతాలను పాటిస్తున్న వారి వివరాలను సేకరించాలని, వారు ఎస్సీ గుర్తింపును వాడుకోకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాంఘిక, మైనారిటీ సంక్షేమ విభాగాల ఉన్నతాధికారులు, అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. 4 నెలల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేసింది.

మతాంతీకరణ అభియోగాలపై విచారణ

మహరాజ్‌గంజ్ జిల్లాకు చెందిన జితేంద్ర సహానీ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. హిందూ దేవతల మీద అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, మతాంతీకరణను ప్రోత్సహిస్తున్నారంటూ తన మీద తప్పుడు అభియోగాలు నమోదయ్యాయని, వాటిని కొట్టేయాలని కోరుతూ జితేంద్ర సహానీ పిటిషన్‌లో అభ్యర్థించారు. దీనిపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌గిరి మంగళవారం విచారణ జరిపారు. తన మీద నమోదైన అభియోగాలు అవాస్తవమని, అధికారుల అనుమతి తీసుకున్న తర్వాతే తాను ప్రార్థనా సమావేశాలు నిర్వహిస్తున్నానని జితేంద్ర సహానీ పేర్కొన్నారు. కాగా విచారణ సందర్భంగా సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన జడ్జి.. జితేంద్ర సహానీ పుట్టుకతో హిందూ మతానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ, తర్వాత క్రైస్తవంలోకి మారారని, మతాధికారి (ప్రీస్ట్)గా పని చేస్తున్నారని గుర్తించారు. కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో మాత్రం ఆయన తనను తాను హిందువుగా పేర్కొనటాన్ని ప్రశ్నించారు. జితేంద్ర సహానీ సమర్పించిన వివరాలను పరిశీలించి, ఆయన మతానికి సంబంధించిన వివరాల్లో తప్పు ఉంటే కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

రోహింగ్యాలకు ఎర్ర తివాచీ పరవాలా?

» వాళ్లను పంపిస్తే మీకేంటి ఇబ్బంది?..హెబియస్‌కార్పస్ పిటిషన్లపై సుప్రీం

న్యూఢిల్లీ, డిసెంబరు 2: భారత పౌరులు తీవ్ర పేదరికంతో కొట్టుమిట్టాడుతుంటే దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన రోహింగ్యాలకు ఎర్ర తివాచీ పరచి స్వాగతం పలకాలా? అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అసలు దేశంలో వారి చట్టపరమైన హోదా ఏమిటని నిలదీసింది. పోలీసుల అదుపులో కొంతమంది రోహింగ్యాలు కనబడకుండా పోయారని, వారిని న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టాలని కోరుతూ మానవ హక్కుల కార్యకర్త రీటా మన్‌చందన దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్లపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ముందుకు మంగళవారం ఈ పిటిషన్ వచ్చింది. గత మే నెలలో ఢిల్లీ పోలీసులు కొంతమంది రోహింగ్యాలను అదుపులోకి తీసుకున్నారని, వారి జాడ లేకుండా పోయిందని పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రస్తావించారు. దానికి సీజేఐ స్పందిస్తూ, "ఉత్తరాది సరిహద్దుల్లో పరిస్థితి బాగోలేదు. అక్రమంగా చొరబడతారు. చట్టబద్ధమైన హోదా లేదు. ఎర్రతివాచీతో స్వాగతం పలికి అన్ని సౌకర్యాలు కల్పించాలా? వాళ్లను వెనక్కి పంపిస్తే ఏంటి ఇబ్బంది?" అని పిటిషనర్ తరఫు న్యాయవాదిని ప్రశ్నించారు. 'సొరంగం తవ్వుకుని మరీ వచ్చి నీ గడ్డ మీద నిలుచున్నా కాబట్టి నీ చట్టం వర్తించాలి. తిండి పెట్టాలి. నీడనివ్వాలి. నా పిల్లలకు చదువునివ్వాలి' అంటే సాధ్యమా? చట్టాన్ని ఎంతవరకు ఇలా సాగదీయగలం? అని నిలదీశారు. రోహింగ్యాలను నిబంధనల ప్రకారమే డీపోర్ట్ చేయాలని 2020లో ఇచ్చిన సుప్రీంకోర్టు ఆదేశం ఉందని పిటిషనర్ ప్రస్తావించారు. "మన దేశంలోనూ నిరు పేదలున్నారు. వాళ్లు మన పౌరులు. ఈ శ్రద్ధ ఏదో వాళ్ల మీద చూపించవచ్చు కదా?" అని సీజేఐ బదులిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, పిటిషనర్లకు కనిపించకుండా పోయిన రోహింగ్యాలతో ఎలాంటి సంబంధం లేదని, వాళ్లకు హెబియస్ కార్పస్ పిటిషన్ వేసే అధికారం లేదని చెప్పారు. ఈ ఏడాది జూలై 31న సుప్రీంకోర్టు రోహింగ్యాలకు సంబంధించిన పలు పిటిషన్లను విచారిస్తూ, వాళ్లు శరణార్థులా? అక్రమ వలసదారులా? తేల్చాల్సి ఉందని వ్యాఖ్యానించింది. అది తేలితే మిగతావన్నీ వాటికవే పరిష్కారం అవుతాయని చెప్పింది. ఇదే విషయాన్ని సీజేఐ మంగళవారం గుర్తు చేశారు.

అధిష్ఠానం చెబితే డీకే సీఎం అవుతారు!

» హైకమాండ్ ఆదేశాలు శిరసావహిస్తాం: సిద్దరామయ్య



శివకుమార్ ఇంట్లో బ్రేక్ ఫాస్ట్ చేస్తున్న సిద్దరామయ్య

బెంగళూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అధిష్ఠానం చెబితే డీకే సీఎం అవుతారని కర్ణాటక సీఎం సిద్దరామయ్య అన్నారు. శివకుమార్‌తో తనకు ఎలాంటి విబేధాలు లేవని, తామిద్దరం అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ప్రభుత్వాన్ని నడుపుతున్నామని.. భవిష్యత్‌లోనూ తమ బంధం ఇలాగే కొనసాగుతుందని స్పష్టంచేశారు. నాయకత్వం విషయంలో తామిద్దరం అధిష్ఠానం ఆదేశాలను శిరసా వహిస్తామని వెల్లడించారు. కర్ణాటక కాంగ్రెస్‌లో గందరగోళానికి ముగింపు పలికే దిశగా బెంగళూరు సదాశివ నగర్‌లోని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ నివాసంలో ఏర్పాటుచేసిన అల్పాహార విందుకు మంగళవారం ఆయన హాజరయ్యారు. అయితే, సిద్దరామయ్య విధాన సౌధ వద్ద ఎమ్మెల్యేలు గోపాలకృష్ణ, ఉదయ్‌తో సరదాగా మాట్లాడుతూ.. రాజకీయాలు శాశ్వతం కాదన్నారు. 'ఏదైనా జరగనీ.. ఆలోచించి బుర్ర పాడుచేసుకునే పరిస్థితిలో లేను' అని చెప్పారు.

మోదీతో భేటీలో దిగుమతుల పెంపుపై చర్చిస్తా: పుతిన్

మాస్కో: భారత పర్యటనలో తాను ప్రధాని మోదీతో.. ఇండియా నుంచి దిగుమతులను పెంచడంపై చర్చిస్తానని పుతిన్ తెలిపారు. గడిచిన మూడేళ్లలో భారత్, చైనా దేశాలతో ద్వైపాక్షిక వాణిజ్య పరిమాణం గణనీయంగా పెరిగిందని ఆయన వెల్లడించారు. ఆ రెండు దేశాలతో పాటు.. తమ కీలక భాగస్వాములందరితో ఆర్థిక బంధం బలోపేతం చేసుకోవాలని మాస్కో భావిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. అదే సమయంలో.. పాశ్చాత్య దేశాల ప్రభుత్వాలపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యంగా.. యూరప్ దేశాలు దౌత్యనీతిని పూర్తిగా వదిలిపెట్టేశాయని ఆయన దుయ్యబట్టారు. "యూరప్ యుద్ధం చేయాలనుకుంటే అందుకు మేం సిద్ధం. యూరోపియన్లకు శాంతియుత ఎజెండా లేదు. వారు యుద్ధం వైపే ఉన్నారు" అని పుతిన్ మండిపడ్డారు. తమ ఏకఛత్రాధిపత్యాన్ని ఉపయోగించి ఇతర దేశాలపై ఒత్తిడి తీసుకొస్తున్న కొన్ని దేశాల వల్ల ప్రపంచం అశాంతిని ఎదుర్కొంటోందన్నారు.

భారత్-రష్యా చర్చల ఎజెండాలో ఎస్‌యు-57

» క్రెమ్లిన్ అధికార ప్రతినిధి పెస్కోవ్ స్పష్టీకరణ

» రేపు, ఎల్లుండి భారత్‌లో పర్యటించనున్న పుతిన్

న్యూఢిల్లీ, మాస్కో, డిసెంబరు 2: రష్యా అధ్యక్షుడు పుతిన్ గురు, శుక్రవారాల్లో భారత్‌లో పర్యటించనున్న నేపథ్యంలో.. ఇరు దేశాల మధ్య జరిగే ద్వైపాక్షిక చర్చల ఎజెండాలో ఎస్-400, ఎస్‌యు-57 స్టెల్త్ యుద్ధవిమానాల డీల్స్ తప్పకుండా ఉంటాయని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి ద్మిత్రీ పెస్కోవ్ స్పష్టం చేశారు. అయితే, ఈ అంశంలో న్యాయమైన పోటీ జరగట్లేదనే అర్థం వచ్చేలా ఆయన నర్మగర్భవ్యాఖ్యలు చేశారు. "ఎస్‌యు-57 యుద్ధవిమానం ప్రపంచంలోనే అత్యుత్తమమైనది. ఇది అతిశయోక్తి కాదు. పుతిన్ భారత పర్యటనలో ఈ అంశం కూడా ఎజెండాలో ఉంటుంది. ఈ రంగంలో మాకు పోటీదారులు చాలామంది ఉన్నారు కాబట్టి వివరాలపై చర్చ వద్దు. న్యాయమైన పోటీ అంటూ జరిగితే మాతో ఎవరూ పోటీ పడలేరు" అని ఆయన వ్యాఖానించారు. భారత్-రష్యా సంబంధాలపై అమెరికా ప్రభావం ఉండకూడదన్న అర్థం వచ్చేలా.. "ద్వైపాక్షిక సంబంధాలపై బయటి ఒత్తిళ్ల జోక్యం ఉండకూడద"ని కూడా వ్యాఖ్యానించారు. "మనం మన బంధం భద్రంగా ఉండేలా చూసుకోవాలి. పరస్పర ప్రయోజనాలను చేకూర్చే మన వాణిజ్యబంధాన్ని కూడా సురక్షితంగా ఉంచుకోవాలి" అని ఆయన పేర్కొన్నారు. అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పంద చర్చలు తుది దశలో ఉన్నందున.. ఆ డీల్ కుదిరాకే రష్యాతో ఎస్‌యు-57 ఒప్పందం కుదుర్చుకోవాలని భారత్ భావిస్తోంది. పుతిన్ పర్యటన సందర్భంగా ఎస్‌యు-57కు సంబంధించి చర్చ జరగొచ్చుగానీ.. ఒప్పందం ఉండకపోవచ్చని, పెస్కోవ్ వ్యాఖ్యలు దీన్నే సూచిస్తున్నాయని రక్షణ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

జైలులో నాకేమైనా జరిగితే మునీర్‌దే బాధ్యత

» ఇమ్రాన్ ఖాన్ ప్రకటన



లాహోర్, డిసెంబరు 2: అవినీతి కేసులో రావల్పిండిలోని అడియాలా జైలులో శిక్ష అనుభవిస్తున్న పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ (73)తో భేటీ అయ్యేందుకు ఎట్టకేలకు ఆయన సోదరి డాక్టర్ ఉజ్మా ఖానుమ్‌కు అధికారులు అనుమతి ఇచ్చారు. ఇమ్రాన్ సోదరితో పాటు, ఇమ్రాన్ నెలకొల్పిన పాకిస్థాన్ తెహ్రీక్ ఎ ఇన్‌సాఫ్ (పీటీఐ) పార్టీ నాయకులు కొందరికి ములాఖత్ అవకాశాన్ని కల్పించారు. అనంతరం ఆయన పేరున పీటీఐ ఓ ప్రకటన విడుదల చేసింది. ఆర్మీ చీఫ్ అసీం మునీర్‌పై ఆ ప్రకటనలో ఇమ్రాన్ తీవ్రమైన ఆరోపణలు చేశారు. మునీర్ మానసిక స్థితి బాగులేదని, తనకు ఏమి జరిగినా అతడే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆరోపించారు. తన దుస్థితిని వివరిస్తూ.. గత పది రోజులుగా తనను ఒంటరిగా గదిలో నిర్బంధించారని తెలిపారు. అయిదు రోజులుగా కరెంటు కూడా తీసేసి చీకటిలో ఉంచారని, సూర్యకాంతి కూడా సోకడం లేదని పేర్కొన్నారు. మంచినీరు, మందులు ఇవ్వడం లేదని చెప్పారు. ఇస్తున్న ఆహారం అనుమానాస్పదంగా ఉందని ఆరోపించారు. జైలులో మరణశిక్ష పడ్డ ఖైదీకి ఇస్తున్న సౌకర్యాలనే తనకు కల్పిస్తున్నారని తెలిపారు. బోనులో ఉంచారని, జంతువుకన్నా హీనంగా చూస్తున్నారని వాపోయారు. "నన్ను ఎన్ని రకాలుగా వేధించాలో సైన్యం అన్నీ చేసింది. ఇంక ప్రాణాలు తీయడమే మిగిలి ఉంది" అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఉజ్మా మాట్లాడుతూ ఇమ్రాన్ ప్రాణాలతో ఉన్నారని, కానీ అధికారులు మానసికంగా వేధిస్తున్నారని చెప్పారు. ఆయన ఆరోగ్యంగా ఉన్నట్టు కనిపిస్తున్నారని చెప్పారు.

భాగస్వామ్య సంస్థలకు ప్రోత్సాహకాలు

» ఉత్తర్వు జారీచేసిన ఐటీ శాఖ కార్యదర్శి

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): డేటా సెంటర్ల నిర్మాణం తర్వాత తమ యాజమాన్య నిర్వహణలోకి వచ్చేలా తమకు కేటాయించిన ప్రోత్సాహకాలన్నీ భాగస్వామ్య సంస్థలకు బదలాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రైడెన్ సంస్థ అభ్యర్థించింది. దీనిపై క్యాబినెట్ సానుకూలంగా స్పందించడంతో ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ మంగళవారం ఉత్తర్వు జారీచేశారు. అదానీ ఇన్‌ఫ్రా(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, అదానీ కాంప్లెక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, అదానీ పవర్ ఇండియా లిమిటెడ్, భారతీ లిమిటెడ్, ఎన్‌ఎక్స్‌ట్రా డేటా లిమిటెడ్, ఎన్‌ఎక్స్‌ట్రా వైజాగ్ లిమిటెడ్ తమ భాగస్వాములుగా పరిగణించాలని కోరుతూ గత నెల 11న రాష్ట్ర ప్రభుత్వానికి రైడెన్ లేఖ రాసింది. దీంతో విశాఖ అడవివరం, ముడసర్లోవలో 120 ఎకరాలు, తర్లువాడలో 200 ఎకరాలు, రాంబిల్లిలో 160 ఎకరాలను రైడెన్ భాగస్వామ్య సంస్థలకు బదలాయించాలని ఏపీఐఐసీని ప్రభుత్వం ఆదేశించింది.

టీడీపీకే కర్నూలు ఎంపీపీ పీఠం..!

» అవిశ్వాసం నెగ్గిన తెలుగుదేశం.. త్వరలో మండలాధీశుడి ఎంపిక

కర్నూలు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. టీడీపీ మద్దతుతో నెగ్గిన ఎంపీటీసీ సభ్యుల అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో జిల్లా కేంద్రం కర్నూలు ఎంపీపీ పదవి వైసీపీ కోల్పోయింది. ఆ పీఠాన్ని టీడీపీ తన ఖాతాలో వేసుకుంది. ఈ మండలంలో 23 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ 12, టీడీపీ పది స్థానాలు గెలుచుకోగా... ప్రస్తుతం టీడీపీ బలం 13గా ఉంది. వైసీపీ మద్దతుదారుల సంఖ్య ఆరుకు పడిపోయింది. మంగళవారం మండలం పరిషత్ ప్రత్యేక సమావేశానికి టీడీపీకి చెందిన 13 మంది ఎంపీటీసీ సభ్యులు మాత్రమే హాజరయ్యారు. దీంతో అవిశ్వాసం నెగ్గింది. వారంలో టీడీపీ మద్దతుదారుడు ఎంపీపీగా బాధ్యతలు చేపడతారు.

వైసీపీ పాలనలో సాగునీటి రంగం కుదేలు: నిమ్మల

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో కుదేలైన సాగునీటి రంగాన్ని కూటమి ప్రభుత్వం ప్రగతి పథంలో పయనింపచేస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 17 నెలల్లోనే సాగునీటి రంగాన్ని ప్రగతిపథంలో నిలబెట్టామన్నారు. వైసీపీ ప్రభుత్వం చంద్రబాబుపై ఎన్నో అక్రమ కేసులు పెట్టిందని, అవన్నీ ఆధారాలు లేక వీగిపోతున్నాయని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. 'పీపీపీ వైద్య కళాశాలలతో పేదలకు ఉపయోగమే తప్ప నష్టం జరగదు. పీపీపీ విధానంలో అదనంగా 220 మెడికల్ సీట్లు రాష్ట్రానికి వస్తాయి. జగన్ పద్ధతిలో మెడికల్ కాలేజీలు నిర్మాణం చేయాలంటే 15 ఏళ్లు పడుతుంది' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు.

625 పడకల ఆస్పత్రి.. 150 ఎంబీబీఎస్ సీట్లు..

» మంత్రివర్గం ఆమోదించిన సవరణలకు ఉత్తర్వులు జారీ

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్వహణ బాధ్యత తీసుకున్న సంస్థ 625 పడకల ఆస్పత్రి, 150 ఎంబీబీఎస్ సీట్లు.. 24 పీజీ సీట్లకు అనుగుణంగా కాలేజీల నిర్మాణం చేపట్టాలి. ఈ మేరకు ఆదోని, మదనపల్లి, మార్కాపురం, పులివెందుల మెడికల్ కాలేజీలకు సంబంధించిన రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్‌ఎఫ్‌పీ)లో ప్రభుత్వం సవరణలు చేసింది. ఈ సవరణలకు మంత్రి వర్గం ఆమోదం తెలపగా.. ఆరోగ్యశాఖ సెక్రటరీ సౌరభ్ గౌర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆదోని మెడికల్ కాలేజీకి 49.64 ఎకరాలు, మదనపల్లి కాలేజీకి 52.47 ఎకరాలు, మర్కాపురం కాలేజీకి 47.10 ఎకరాలు, పులివెందుల కాలేజీకి 48.50 ఎకరాల భూములు మాత్రమే కేటాయిస్తారు. కాగా, ఏపీలోని మూడు ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్ల పెంపునకు ఆర్థిక మద్దతు ఇచ్చినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ తెలిపారు. రాజ్యసభలో టీడీపీ ఎంపీ బీద మస్తాన్‌రావు ప్రశ్నకు సమాధానమిచ్చారు. 150 ఎంబీబీఎస్ సీట్ల పెంపునకు గానూ రూ.180 కోట్లు, 11 మెడికల్ కాలేజీల్లో 1,040 పీజీ సీట్ల పెంపునకు రూ.878.40 కోట్లు ఇస్తామన్నారు.

విశాఖ ఉక్కు ఉద్యోగుల జీతాల్లో కోత

» నేడు అన్ని విభాగాల్లో నిరసనకు కార్మికుల పిలుపు

విశాఖపట్నం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల జీతాల్లో విశాఖపట్నం స్టీల్ ప్లాంటు యాజమాన్యం కోతలు పెట్టింది. విభాగాల వారీగా నిర్దేశించిన ఉత్పత్తిని 100 శాతం సాధిస్తేనే పూర్తి జీతాలు ఇస్తామని ఇటీవల ప్రకటించింది. లక్ష్యానికి ఎంత శాతం తగ్గితే అంత మేర జీతాల్లో కోత పెడతామని హెచ్చరించింది. దానిని నవంబరు నెల నుంచే అమలు చేస్తూ డిసెంబరులో ఇచ్చే జీతాలకు పే స్లిప్పులు తయారుచేసింది. పలు విభాగాల్లో ఉద్యోగుల జీతాల్లో భారీ కోత పడింది. మెటీరియల్ మేనేజ్‌మెంట్ విభాగంలో పనిచేసే వారికి కేవలం 66 శాతమే జీతాలు ఇవ్వనున్నట్టు పేర్కొంది. రోలింగ్ మిల్స్ విభాగానికి 79 శాతం, సింటర్ ప్లాంటుకు 80 శాతం, ఎస్ఎంఎస్‌కు 81 శాతం, బ్లాస్ట్ ఫర్నేస్, ఇతరులకు 83 శాతం, మార్కెటింగ్‌కు 84 శాతం, కోక్ ఓవెన్ విభాగానికి 93 శాతం జీతాలు ఇస్తున్నట్లు ప్లే సిప్పుల్లో చూపింది. దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ లిక్విడ్ స్టీల్‌ను ఉక్కు దిమ్మలుగా మార్చే ఎస్ఎంఎస్-2 విభాగం ఉద్యోగులు మంగళవారం సాయంత్రం ఆందోళనకు దిగారు. బుధవారం అన్ని విభాగాల్లో ఆందోళనలు చేపట్టాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. సిబ్బంది అంతా ఆందోళనకు దిగితే ఉక్కు ఉత్పత్తి మరింత పడిపోయే ప్రమాదం ఉందని ఉద్యోగులు చెబుతున్నారు.

స్టిక్కరింగ్‌తో ప్లాస్టిక్ వ్యర్థాలకు చెక్!

విశాఖపట్నం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించడానికి ఏపీటీడీసీ, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ అధికారులు కలిసి వినూత్న విధానానికి శ్రీకారం చుట్టారు. మన్యం జిల్లాలో అరకులోయలోని గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్స్, చాపరాయి, కొత్తపల్లి జలపాతాల వద్దకు పెద్దసంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. ప్లాస్టిక్ బాటిళ్లలో నీరు, ప్లాస్టిక్ కవర్లలో ఆహార పదార్థాలు వెంట తెచ్చుకొని, ఆ తర్వాత వాటిని అక్కడే పడేసి వెళ్లిపోతున్నారు. దీనివల్ల ఆయా పర్యాటక కేంద్రాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. వీటికి చెక్ పెట్టడానికి ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ టి.శ్రీపూజ కొత్త ఆలోచన చేశారు. కేరళలోలా స్టిక్కరింగ్ విధానాన్ని ఇక్కడ కూడా అమలు చేయాలని నిర్ణయించి, డిసెంబరు 1నుంచి ప్రారంభించారు. పర్యాటక కేంద్రాల ప్రవేశద్వారం వద్ద ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, ఆహార పొట్లాలపై స్టిక్కర్ అతికిస్తారు. ఒక్కో స్టిక్కర్‌కు రూ.10డిపాజిట్ చేయించుకుంటారు. పర్యాటకులు తమ సందర్శన పూర్తయిన తరువాత ఆయా వస్తువులను ఏ పర్యాటక కేంద్రం వద్ద తిరిగి అప్పగించినా వారి డబ్బులు వెనక్కి ఇస్తారు. డిపాజిట్ చేసిన డబ్బుల కోసమైనా ప్లాస్టిక్ వ్యర్థాలను పడేయకుండా నిర్దేశించిన కేంద్రాల్లో ఇస్తారని భావిస్తున్నారు.

దిశ మార్చుకున్న వాయుగుండం

» నేడు కోస్తా, రాయలసీమలో వానలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం దిశ మార్చుకుంది. చెన్నైకి అతి సమీపంలో ఉన్న వాయుగుండం మంగళవారం ఉదయం ఉత్తరంగా పయనించేందుకు వాతావరణం అనుకూలించకపోవడంతో మధ్యాహ్నం దక్షిణ నైరుతి వైపు దిశ మార్చుకుని ఉత్తర తమిళనాడు వైపు వెళుతోంది. బుధవారం ఉదయంలోగా తీవ్ర అల్పపీడనంగా బలహీనపడి తమిళనాడు, కర్ణాటక మీదుగా అరేబియా సముద్రం వైపు వెళ్లనుంది. పడమర వైపు నుంచి బలమైన గాలులు వీయడంతో నెమ్మదిగా పయనిస్తూ దిశ మార్చుకుందని ఇస్రో వాతావరణ నిపుణుడు తెలిపారు. వాయుగుండం ప్రభావంతో మంగళవారం రాయలసీమ, కోస్తాల్లో ఎక్కువ చోట్ల వర్షాలు, కొన్నిచోట్ల భారీవర్షాలు కురిశాయి. తిరుపతి జిల్లా మల్లాంలో 9.65, చిట్టమూరులో 9.575, చిత్తూరు జిల్లా పాలసముద్రంలో 9.2, తిరుపతి జిల్లా అల్లంపాడులో 7.2, తడలో 5.9, పూలతోటలో 5.8, ఏలూరు జిల్లా కాకర్లమూడిలో 5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. బుధవారం దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల, ఉత్తర కోస్తాలో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.



కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి లోకేశ్, చిత్రంలో మంత్రి అనిత, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు తదితరులు



కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు నివేదిక అందజేస్తున్న మంత్రి లోకేశ్, చిత్రంలో మంత్రి అనిత, కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు గంటి హరీశ్, కేశినేని శివనాథ్

'మొంథా' నష్టం 6,352 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.271 కోట్లు, గృహ నష్టం రూ.7 కోట్లు, రహదారులు, మౌలిక సదుపాయాలకు రూ.4,324 కోట్లు, విద్యుత్ రంగానికి రూ.41 కోట్లు, నీటి వనరులు, నీటిపారుదల ప్రాజెక్టులకు రూ.369 కోట్లు, శాశ్వత నిర్మాణాలకు రూ.1,302 కోట్లు, సామూహిక ఆస్తులకు రూ.48కోట్ల మేర నష్టం వాటిల్లిందని వివరించారు. మొత్తం రూ.6,356 కోట్ల నష్టంలో ఎన్‌డీఆర్ఎఫ్ మార్గదర్శకాల ప్రకారం రూ.902 కోట్లు తక్షణ ఉపశమనం, తాత్కాలిక పునరుద్ధరణ కోసం అవసరమని అన్నారు. గత నెల 12వ తేదీన తాము సమర్పించిన నివేదికపై కేంద్రమంత్రుల బృందం క్షేత్రస్థాయి పరిశీలన కూడా జరిపిందని లోకేశ్ పేర్కొన్నారు. తుఫాను సమయంలో 1.92 లక్షల మందిని 2,471 పునరావాస శిబిరాలకు తరలించి, ప్రభావిత కుటుంబాలకు తక్షణ సాయంగా రూ.3వేల చొప్పున అందించామని, కూలిన చెట్ల తొలగింపు, తాత్కాలిక నివాస సౌకర్యాలు, నీటి సరఫరా పునరుద్ధరణ వంటి పలు చర్యలను చేపట్టామని తెలిపారు. తక్షణ సహాయం కింద రూ.60 కోట్ల ఆర్థిక సాయం అందించామన్నారు.

కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌తో భేటీ..

మొంథా తుఫాను 24 జిల్లాల్లోని 443 మండలాల పరిధిలో 3,109 గ్రామాలను తీవ్రంగా ప్రభావితం చేసిందని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు మంత్రి లోకేశ్, అనిత వివరించారు. శివరాజ్‌సింగ్‌తో ఆయన నివాసంలో వారు భేటీ అయ్యారు. రాష్ట్రంలో సుమారు 9.53 లక్షల మంది ప్రజలు తుఫాను వల్ల నష్టపోయారన్నారు. 1.61 లక్షల హెక్టార్లలో పంటలు (వరి, మొక్కజొన్న, పత్తి, వేరుశనగ, కంది పప్పు, సిరిధాన్యాలు మొదలైనవి) దెబ్బతిన్నాయని, 3.27 లక్షల మంది రైతులు ప్రభావితమయ్యారని వెల్లడించారు. ఉత్పత్తి నష్టాలు సుమారు 4.36లక్షల మెట్రిక్ టన్నులు అని తెలిపారు. సుమారు 6,250 హెక్టార్లలో (33శాతం కంటే అధికం) అరటి, బొప్పాయి, కొబ్బరి, పసుపు, మిరప, కూరగాయలు, పూలు, ఉద్యానవన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. ఈ పర్యటనలో నారా లోకేశ్ వెంట కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, దగ్గుమళ్ల ప్రసాదరావు, సానా సతీశ్, కలిశెట్టి అప్పలనాయుడు, తెన్నేటి కృష్ణ ప్రసాద్, బస్తీపాటి, మాగుంట, వేమిరెడ్డి, జీఎం హరీశ్ తదితరులున్నారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, శివరాజ్‌సింగ్‌లతో భేటీకి ముందు లోకేశ్ పార్టీ ఎంపీలతో సమావేశమయ్యారు. పార్లమెంటులోని టీడీపీ పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

'జీఎంఆర్' అధికారులతో మంత్రి లోకేశ్ భేటీ

» ఏపీలో ఏవియేషన్ ఎడ్యుసిటీ అభివృద్ధిపై చర్చ.. ప్రణాళిక ఖరారు

న్యూఢిల్లీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విమానాశ్రయాల రూపకల్పన, నిర్మాణం, నిర్వహణలో అంతర్జాతీయంగా పేరున్న జీఎంఆర్ సంస్థ సీనియర్ అధికారులతో మంత్రి లోకేశ్ ఢిల్లీలో సమావేశమయ్యారు. విశాఖపట్నంలో దేశంలోనే తొలి ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు. ఇందుకు సంబంధించి ఏవియేషన్ ఎడ్యుసిటీ మొత్తం అభివృద్ధి ప్రణాళికను ఖరారు చేశారు. ఈ ఎడ్యుసిటీని జీఎంఆర్ ఎయిర్ పోర్ట్స్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయనున్నారు. ఏవియేషన్ ఎడ్యుసిటీ ఏర్పాటు ఉత్తరాంధ్ర ప్రాంతానికి గేమ్ చేంజర్‌గా మారడంతో పాటు ఏపీ ఏవియేషన్ క్లస్టర్ అభివృద్ధిని వేగవంతం చేయనుంది. ఈ సమావేశంలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుతో పాటు జీఎంఆర్ సంస్థ సీనియర్ అధికారులు ఎస్జీకే కిశోర్, సి.ప్రసన్న, పీయూష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడులే లక్ష్యంగా..6 నుంచి లోకేశ్ విదేశీ పర్యటన

» తొలి రోజు అమెరికా డాలస్‌లో ప్రవాసులతో భేటీ

» 7-9 తేదీల్లో దిగ్గజ సంస్థల అధినేతలతో 'బిజినెస్ టు బిజినెస్' సమావేశాలు

» 11, 12ల్లో కెనడాలో పారిశ్రామికవేత్తలతో భేటీ

అమరావతి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి గూగుల్ డేటా సెంటర్ రాకతో కొత్త ఉత్సాహంతో.. పెట్టుబడుల సాధనే లక్ష్యంగా మంత్రి లోకేశ్ అమెరికా, కెనడా పర్యటనలకు సిద్ధమయ్యారు. ఈ నెల 6నుంచి 9వరకూ అమెరికాలో, 11, 12 తేదీల్లో కెనడాలో ఆయన పర్యటిస్తారు. ఆయన వెంట సీఎంవో కార్యదర్శి కార్తికేయ మిశ్రా, ఏపీఈడీబీ సీఈవో శ్రీకాంత్‌వర్మ, ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిశోర్ తదితరులు వెళ్తున్నారు. 6న డాలస్‌లో ప్రవాసులతో లోకేశ్ భేటీ అవుతారు. 7 నుంచి 9 వరకు శాన్‌ఫ్రాన్సిస్కో, న్యూయార్కుల్లో పర్యటిస్తారు. ప్రపంచ శ్రేణి పారిశ్రామిక దిగ్గజ సంస్థల యాజమాన్యాలు, సీఈవోలతో 'బిజినెస్ టు బిజినెస్' ద్వైపాక్షిక సమావేశాలు జరుపుతారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని వివరిస్తారు. 11, 12 తేదీల్లో కెనడాలోని మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థలతో సమావేశమవుతారు. ఈ ఏడాది అక్టోబరులో కూడా లోకేశ్ అమెరికాలో పర్యటించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, సుస్థిర ప్రభుత్వం, అనుభవజ్ఞుడైన సీఎం చంద్రబాబు నాయకత్వం గురించి పారిశ్రామికవేత్తలకు వివరించారు. విశాఖలో గత నెలలో జరిగిన భాగస్వామ్య సదస్సుకు రావాలని ఆహ్వానించారు. ఆ సందర్భంగా పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిన ప్రముఖ సంస్థల గురించి.. తాజాగా చేపడుతున్న అమెరికా, కెనడా పర్యటనల్లో తెలియజేస్తారు. వాటి దారిలోనే రాష్ట్రానికి పెట్టుబడులతో రావాలని బడా కంపెనీలను ఆహ్వానిస్తారు.

ప్రజల విశ్వసనీయత పొందాలి

» టీడీపీ శ్రేణులకు నేతల దిశానిర్దేశం

» ముగిసిన తెలుగుదేశం పార్టీ శిక్షణ తరగతులు

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, నిరంతరం ప్రజల్లో ఉండి విశ్వసనీయతను పొందేందుకు ప్రతి కార్యకర్త ప్రయత్నించాలని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు కోరారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. రెండో రోజు సమావేశంలో... సూపర్ సిక్స్, టీడీపీ కార్యకర్తలకు అందించే బీమా, సోషల్ మీడియా, టెక్నాలజీ, మై టీడీపీ యాప్ వినియోగం వంటి అంశాలపై ఎమ్మెల్యేలు కూన రవికుమార్, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, మాధవి రెడ్డి, ఎమ్మెల్సీలు కావలి గ్రీష్మ, తదితరులు శిక్షణ ఇచ్చారు.

పరకామణి దొంగల పాపాల చిట్టా సిద్ధం: వేమూరి

తిరుమలలో పరకామణిలో జరిగిన దొంగతనం వ్యవహారంలో భాగస్వాములైన వారందరి పాపాల చిట్టా సిద్ధమవుతోందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరి ఆనంద్ సూర్య అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేవుడి సొమ్ము దొంగలించిన వారిపై చర్యలు తీసుకోకుండా కేసును రాజీ చేయించడం వెనుక అసలు సూత్రధారులు ఎవ్వరో త్వరలోనే నిగ్గు తేలుందన్నారు.

రాష్ట్రంలో నాలుగు రక్షణ ఉత్పత్తుల పరిశ్రమలు

రాజ్‌నాథ్‌సింగ్‌ను ఆహ్వానించిన పరిశ్రమల మంత్రి భరత్

అమరావతి, కర్నూలు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అధునాతన రక్షణ ఉత్పత్తుల తయారీ కేంద్రంగా ఏపీ ఆవిర్భవించబోతుందని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను ఆయన ఢిల్లీలో కలిశారు. ఏపీలో నెలకొల్పనున్న నాలుగు ప్రధాన రక్షణ తయారీ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడానికి రావాలని అధికారికంగా ఆహ్వానించారు. శ్రీసత్యసాయి జిల్లాలో కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్ లిమిటెడ్ ద్వారా డిఫెన్స్ ఎనర్జిటిక్స్ అండ్ ఫిల్లింగ్ కాంప్లెక్స్, మడకశిర దగ్గర హెచ్ఎఫ్‌సీఎల్ ద్వారా ఆర్టిలరీషెల్ అండ్ మల్టీమోడ్ హ్యాండ్ గ్రానైట్ యూనిట్, దొనకొండ దగ్గర భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ద్వారా ప్రొపెల్లెంట్ అండ్ వెపన్ సిస్టమ్ ఇంటిగ్రేటెడ్ యూనిట్, అనకాపల్లిలో బీడీఎల్‌కు చెందిన అండర్ వాటర్ వెపన్స్ అండ్ టార్పెడో తయారీ యూనిట్‌లకు ఒకే సమయంలో భూమి పూజ, శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు. ఎంపీ బస్తిపాటి నాగరాజుతో కలసి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని మంత్రి కలిశారు. కర్నూలు బస్సు ప్రమాదంలో 19 మంది అగ్నికి ఆహుతి అయిన విషయం ఆయన దృష్టికి తీసుకెళ్లారు.



అధికారులతో సమీక్ష చేస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

సరికొత్త ఆవిష్కరణలకు పట్టం కడతాం

ఆవిష్కర్తలకు భద్రత కల్పించాలి: డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): శాస్త్ర, సాంకేతిక రంగాల్లో గ్రామీణ యువత తీసుకొచ్చే సరికొత్త ఆవిష్కరణలను గుర్తించి, వాటికి తక్షణం పేటెంట్ హక్కు కల్పించడంతో పాటు వారి ఎదుగుదలకు తోడ్పడాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. నూతన ఆవిష్కరణలకు గుర్తింపు, భద్రత, ప్రోత్సాహం కల్పిస్తే.. కొత్త తరం ఆవిష్కర్తలను వెలుగులోకి తీసుకురావచ్చని అభిప్రాయపడ్డారు. మంగళవారం మంగళగిరి క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఏడాది కాలంలో ఈ శాఖ చేపట్టిన కార్యక్రమాలపై ఆరా తీశారు. నూతన ఆవిష్కర్తల అన్వేషణ, ప్రోత్సాహం తదితర అంశాలపై చర్చించారు. రాజమండ్రిలోని ప్రాంతీయ సైన్స్ సెంటర్ కార్యకలాపాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ 'ప్రధాని మోదీ సంకల్పం 'మేడిన్ ఇండియా- మేకిన్ ఇండియా'లో మనవంతు భాగస్వామ్యం అయ్యేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి. విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థకు నూతన ఆవిష్కరణలే కీలకం. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో కొత్త ఆలోచనల్ని గుర్తించి, వాటికి సహాయ సహకారాలు అందించాలి. స్టార్టప్‌లతో ముందుకొచ్చే వారిని ప్రోత్సహించాలి. సరికొత్త ఆవిష్కరణలతో తమ సామర్థ్యాన్ని చాటుకుంటున్న వారిని వెలుగులోకి తేవాలి. అధ్యయనం తర్వాత వారికి పేటెంట్ ఇప్పించాలి. వారికి రక్షణ కల్పించడం చాలా అవసరం. నూతన ఆవిష్కరణలకు ఎంఎస్ఎంఈ పార్కుల్లో ప్రాధాన్యం కల్పించాలి. కొత్త ఆవిష్కరణలను మార్కెట్‌కు పరిచయం చేసే బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలి. మన అవసరాలకు తగిన వస్తువులు మనమే తయారు చేసుకునే స్థాయికి రావాలి. యువత మేధస్సుని వెలుగులోకి తీసుకురావాలి' అని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

రేపు డీడీఓ కార్యాలయాలు ప్రారంభం

» చిత్తూరు నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 77 డివిజనల్ అభివృద్ధి కార్యాలయాల(డీడీఓల)ను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ గురువారం ప్రారంభించనుంది. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్తూరు నుంచి వీటిని వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని డీడీఓ కార్యాలయాల్లో ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. పంచాయతీరాజ్ సంస్కరణల్లో భాగంగా ఈ కార్యాలయాల ఏర్పాటుకు పంచాయతీరాజ్ శాఖ ఆదేశాలిచ్చింది. ఆయా డివిజన్లలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాల్లో ఈ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. డీడీఓ పోస్టులను గ్రామీణాభివృద్ధిలో అత్యంత కీలకంగా ఆ శాఖ భావిస్తోంది. డివిజన్ స్థాయిలో ఈ కార్యాలయాలు మినీ కలెక్టరేట్లుగా ప్రజలకు సేవలందించనున్నాయి. డీడీఓలకు విశేషాధికారాలను కల్పించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు అనుబంధంగా ఉన్న పలు కార్యాలయాలు డివిజన్ స్థాయిలో ఒకే చోట ఉండేలా చర్యలు తీసుకున్నారు. డివిజన్లలోని డివిజనల్ పంచాయతీ కార్యాలయం, డ్వామా ఏపీడీ కార్యాలయం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు చెందిన ఆయా డివిజన్లకు సంబంధించిన కార్యాలయాలన్నింటినీ ఒకే చోట ఏర్పాటు చేస్తున్నారు. డ్వామా ఏపీడీలు, డివిజనల్ పంచాయతీ అధికారులు డీడీఓ కార్యాలయాల్లో విధులు నిర్వర్తించాలని కమిషనర్ కృష్ణతేజ ఇప్పటికే ఆదేశాలిచ్చారు.

పవన్ మాటలు వక్రీకరించవద్దు!

'దిష్టి' వ్యాఖ్యలపై జనసేన ప్రకటన

అమరావతి,హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాజోలు పర్యటన సందర్భంగా కోనసీమ పచ్చదనంపై ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను వక్రీకరించవద్దని జనసేన పార్టీ కోరింది. పవన్ మాటలపై తెలంగాణలో కొన్నాళ్లుగా దుమారం రేగుతున్న నేపథ్యంలో మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. "పవన్ కల్యాణ్ రాజోలు పర్యటన సందర్భంగా రైతులతో ముచ్చటిస్తూ చెప్పిన మాటలను వక్రీకరిస్తున్నారు. ఇరు రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం నెలకొన్న క్రమంలో ఆయన మాటలను వక్రీకరించవద్దు" అని ఆ ప్రకటనలో కోరింది. ఇటీవల పవన్ కల్యాణ్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలో పర్యటించారు. అక్కడ ఉప్పునీటి కారణంగా అధిక లవణ సాంద్రతతో ఎండిపోతున్న కొబ్బరి తోటలను పరిశీలించారు. అక్కడే రైతులతో మాట్లాడుతూ... "గోదావరి జిల్లాలను అన్నపూర్ణగా పిలుస్తారు. రాష్ట్రం విడిపోవడానికి గోదావరి పచ్చదనం కూడా కారణమేమో! ఆ శాపం తగిలినట్టుంది. కోనసీమ పచ్చని కొబ్బరి చెట్లతో చాలా అందంగా ఉంటుందని తెలంగాణ నాయకులు కూడా అంటుంటారు. ఇప్పుడు కొబ్బరి చెట్ల మొండేలు కూడా లేవు. కోనసీమకు అంత దిష్టి తగిలింది. కోనసీమ పచ్చదనం ఎంతమంది కళ్లలోపడి దిష్టి తగిలిందో తెలీదు కానీ.. ఈ రోజు కొబ్బరి చెట్ల మొండేలు కూడా మిగల్లేదు' అని పవన్ పేర్కొన్నారు.

పవన్ క్షమాపణలు చెప్పాలి!: టీ మంత్రి కోమటిరెడ్డి

"పవన్‌కల్యాణ్.. తక్షణమే తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పు! క్షమాపణలు చెబితే నీ సినిమాలు నైజాంలో రెండు రోజులైనా ఆడుతాయి. చెప్పనిపక్షంలో ఇక్కడ నీ సినిమాలు నడవవు. ఇది నేను తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రిగా చెబుతున్నా!" అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. తెలంగాణపైన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. గాంధీభవన్‌లో మంగళవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటై దాదాపు 13 ఏళ్లయిన తర్వాతా పవన్ కల్యాణ్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం అవసరమా అని నిలదీశారు. తెలంగాణలోని వనరులను వాడుకుని ఈ స్థాయికి ఎదిగిన పవన్ కల్యాణ్.. తన తలతిక్క మాటలను మానుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. స్క్రిప్టు చదివి వెళ్లడానికి ఇది రెండున్నర గంటల సినిమా కాదని, ఒక చోటకి వెళ్లినప్పుడు అక్కడి సమస్యలపైన మాట్లాడాలని పవన్ కల్యాణ్‌కు కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హితవు పలికారు

పోర్టు కోసమే తిరుపతి జిల్లాలో గూడూరు!

మంత్రి అనగాని వివరణ

» నెల్లూరు జిల్లాలోనే ఉంచాలంటూ ఎమ్మెల్యే, నేతలు, సంఘాల వినతి

» గూడూరు కేంద్రంగా నూతన జిల్లా ఏర్పాటుకు జేఏసీ నేతల ధర్నా

» నెల్లూరులోనే ఉంచాలని ఆటో డ్రైవర్ల ఆందోళన

తిరుపతి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కొనసాగించడానికి సహేతుక కారణాలున్నాయని మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. తిరుపతిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌తో పాటు పలువురు నేతలు, సంఘాలు తనను కలసి తమ నియోజకవర్గాన్ని నెల్లూరులో విలీనం చేయాలని కోరారన్నారు. గూడూరు ప్రజలకు చంద్రబాబు హామీ ఇచ్చింది వాస్తవమేనని, దానికోసం సీఎం స్థాయిలో లోతైన సమీక్ష జరిగిందన్నారు. కొన్ని కారణాలతో గూడూరును తిరుపతిలోనే కొనసాగించాలని సీఎం భావిస్తున్నారన్నారు.ప్రకాశం జిల్లాకు రామాయపట్నం, నెల్లూరు జిల్లాకు కృష్ణపట్నం పోర్టులున్నందున తిరుపతి జిల్లాకు కూడా ఒక పోర్టు ఉంటే అభివృద్ధి సమతుల్యంగా ఉంటుందనేది ప్రభుత్వ భావనగా పేర్కొన్నారు. అందుకే దుగరాజపట్నం పోర్టు ఉన్న గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతిలోనే కొనసాగించాలని నిర్ణయించారన్నారు. ఎమ్మెల్యే, స్థానిక నేతలు, సంఘాల అభ్యంతరాలను, డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు.. గూడూరు కేంద్రంగా నూతన జిల్లా ఏర్పాటు చేయాలని లేదంటే నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలంటూ గూడూరు జేఏసీ నాయకులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. మంత్రి అనగానికి వినతిపత్రం అందజేశారు. ఇంకోవైపు.. 'మాకు తిరుపతి జిల్లా వద్దు... నెల్లూరు జిల్లానే ముద్దు' అంటూ నెల్లూరు జిల్లా కలువాయిలో ఆటో కార్మికులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ మేరకు వారు బస్టాండ్ సెంటర్‌లో ఆందోళనకు దిగారు. వారికి పలువురు యువకులు మద్దతిచ్చారు.



కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో ఆదోని జిల్లా ఏర్పాటు కోసం మానవహారం

17వ రోజుకు ఆదోని జిల్లా సాధన దీక్షలు

కర్నూలు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఆదోని జిల్లా సాధన ఉద్యమం కొనసాగుతోంది. ఆదోని జిల్లా సాధన సమితి, జేఏసీ ఆధ్వర్యంలో ఆదోని భీమాస్ కూడలిలోని మాజీ సీఎం కోట్ల విజయభాస్కరరెడ్డి విగ్రహం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 17వ రోజుకు చేరుకున్నాయి. వైసీపీ మాజీ ఎంపీ బుట్టా రేణుక 500 మందికి పైగా అనుచరులతో ఎమ్మిగనూరు నుంచి ఆదోనికి చేరుకుని దీక్షలకు మద్దతు పలికారు. ఆమె వెంట ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

నేటి నుంచి గిరిజన విద్యార్థుల
సాంస్కృతిక సంబరం

- అమరావతి వేదికగా ఉద్భవ్-2025కు సర్వంసిద్ధం
- జాతీయ వేడుకలకు తొలిసారి ఏపీ ఆతిథ్యం

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి గిరిజన విద్యార్థుల వేడుక ఉద్భవ్-2025కు రాష్ట్ర రాజధాని అమరావతి సిద్ధమైంది. దేశవ్యాప్తంగా ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్(ఈఎంఆర్ఎస్) సాంస్కృతిక ఉత్సవాలకు తొలిసారి ఆంధ్రప్రదేశ్ ఆతిథ్యం ఇస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లన్నీ ప్రభుత్వం పకడ్బందీగా చేసింది. అమరావతిలోని కేఎల్ యూనివర్సిటీలో ఈనెల 3, 4, 5 తేదీల్లో మూడు రోజుల పాటు జరిగే 6వ జాతీయ స్థాయి ఈఎంఆర్ఎస్ సాంస్కృతిక ఉత్సవాల్లో గిరిజన విద్యార్థుల ఆటపాటలు, సంస్కృతి, సంప్రదాయాలు ఒకే వేదికపై కనువిందు చేయనున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరమ్ హాజరవుతున్నారు. అలాగే ప్రారంభకార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పాల్గొననున్నారు. పోటీలకు కృష్ణ జింకను మస్కట్‌గా ఎంపిక చేశారు. దానికి క్రిష్‌గా నామకరణం చేశారు.

పట్టణాల్లో ప్రకటన బోర్డుల నియంత్రణకు నిబంధనలు

- మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణాలు, నగరాల్లో ప్రకటనలు, హోర్డింగులు, ఫ్లెక్సీ బోర్డుల ఏర్పాటును నియంత్రించేందుకు ఆంధ్రప్రదేశ్ రెగ్యులేషన్ అండ్ కంట్రోల్ ఆఫ్ డిస్‌ప్లే డివైజెస్ రూల్స్-2025ను నోటిఫై చేస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలోని అన్ని నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఈ నిబంధనలు వర్తిస్తాయి. కాగా, ప్రతి వ్యక్తి లేదా కంపెనీ లైసెన్స్ డిస్ప్లేయర్‌గా నమోదు కావాలని ఆ ఉత్తర్వుల్లో తెలిపారు.

పట్టణాల్లో 6 బయోగ్యాస్-సీబీజీ ప్లాంట్‌లు

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 6 బయోగ్యాస్ సీబీజీ ప్లాంట్ల ఏర్పాటుకు రూ.48 కోట్లు మంజూరుచేస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. రాజమహేంద్రవరం, నెల్లూరు, గుంటూరు, కాకినాడ, ఒంగోలు, కర్నూలుల్లో 25 టీపీడీ సామర్థ్యం కలిగిన ప్లాంట్‌లను నిర్మించేందుకు ఆదేశాలిచ్చింది. వీటికి పీపీపీ విధానం అమలు చేస్తారు.

సీఐడీలో కన్సల్టెంట్‌గా న్యాయవాది ఉన్నం

సీఐడీలో సీనియర్ స్థాయి కన్సల్టెంట్‌గా న్యాయవాది ఉన్నం అఖిల్ చౌదరిని నియమిస్తూ హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజీత్ ఉత్తర్వులు ఇచ్చారు. ఏడాది పాటు ఒప్పంద ప్రాతిపదికన చేపట్టిన నియామకానికి సంబంధించి తదుపరి చర్యలు తీసుకోవాలని డీజీపీకి సూచించారు.

సచివాలయంలో అడ్డదిడ్డంగా బారికేడ్లు

- సీఎం చంద్రబాబు ఆదేశాలతో తొలగింపు

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అమరావతి సచివాలయంలో ప్రధాన ప్రవేశం వద్ద, బ్లాకుల మధ్య బారికేడ్లను తొలగించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం సీఎం సచివాలయానికి వస్తున్న క్రమంలో సచివాలయం ప్రధాన ప్రవేశం వద్ద, సచివాలయం లోపల బ్లాకుల మధ్య అధిక సంఖ్యలో ఉన్న బారికేడ్లను గమనించారు. తక్షణమే బారికేడ్లను తొలగించాలని ఆదేశించారు. ఆ వెంటనే అధికారులు వాటిని తొలగించారు. అక్కడ పూలకుండీలు పెడతారు.

జేపీ నడ్డాతో బీజేపీ ఏపీ చీఫ్ మాధవ్ భేటీ

న్యూఢిల్లీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో రాష్ట్ర బీజేపీ చీఫ్ మాధవ్, ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. మంగళవారం, జేపీ నడ్డా జన్మదినం కావడంతో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

‘షాక్’లకు చెక్!

(మొదటి పేజీ తరువాయి)

‘జీరో’ చేయగలిగామని సీఎం వివరించారు. సచివాలయంలో మంగళవారం విద్యుత్తు శాఖపై సీఎం సమీక్షించారు. రాష్ట్రంలో విద్యుత్తు సరఫరా పరిస్థితి, పీఎం కుసుమ్, పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద సోలార్ రూఫ్ టాప్ పథకం, విద్యుత్తు ఉత్పత్తి, పంపిణీ వ్యయం తగ్గింపు తదితర అంశాలపై ఉన్నతాధికారులతో చర్చించారు.


విద్యుత్‌శాఖపై సీఎం సమీక్ష.. చిత్రంలో మంత్రి రవి తదితరులు

‘పీఎం సూర్యఘర్’ యోజన కింద ఎస్సీ, ఎస్టీల నివాసాలపై సౌర ఫలకాలను ఉచితంగా ఏర్పాటు చేస్తున్నాం. బీసీ కుటుంబాలకు 3 కిలోవాట్ల వరకు రూ.20 వేల సబ్సిడీతో వీటిని అందించండి. చేనేతలకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్తును అమలు చేయండి. - సీఎం చంద్రబాబు

ప్రోత్సాహకాలు పెంపు

ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు మరో ఏడాదిపాటు విద్యుత్తు ప్రోత్సహకాలను పొడిగిస్తూ సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో కీలకమైన పరిశ్రమలుగా వీటిని గుర్తించి మరో ఏడాదిపాటు ప్రోత్సహకాలను పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. తద్వారా ప్రభుత్వంపై రూ.1,053 కోట్ల భారం పడనుంది. రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్తు సరఫరా జరగాలని సీఎం ఆదేశించారు. ప్రత్యేకించి విద్యుత్తు సరఫరా, పంపిణీ నష్టాలను 2029 నాటికి 9.20 శాతం నుంచి గణనీయంగా తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్తు కొనుగోళ్ల భారం తగ్గించుకునేందుకు ఇతర రాష్ట్రాలతో పవర్ ‘స్వాపింగ్’ ఒప్పందాలు కుదుర్చుకోవాలని సీఎం సూచించారు. పీఎం కుసుమ్ సహా ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కింద సోలార్ రూఫ్ టాప్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పీఎం కుసుమ్ ప్రాజెక్టు కింద 4,792 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయాలని సీఎం కోరారు. ప్రభుత్వ భవనాలపై సౌరఫలకాలను ఏర్పాటు చేసి విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు 483కు పైగా ప్రభుత్వ భవనాలపై సౌర ఫలకాలను ఏర్పాటు చేసి సుమారు 150 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేసేలా కార్యాచరణ చేపట్టనున్నారు. ప్రభుత్వ శాఖలతోపాటు ప్రజలు కూడా విద్యుత్తు పొదుపు చేసేలా ఉపకరణాలు వినియోగించేందుకు అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని అధికారులకు సూచించారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి: రాష్ట్రంలో విద్యుత్తు ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన సంస్థలు ఐస్(ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ) పాలసీ ద్వారా 60 రోజుల్లోనే కార్యకలాపాలు ప్రారంభించేలా చూడాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించి అనుమతులు జారీ చేయాలని స్పష్టం చేశారు. తద్వారా విద్యుత్తు ఉత్పత్తిలో ఏపీ న్యూ ఎనర్జీ హబ్‌గా మారాలని చెప్పారు. ఈ రంగంలో వినూత్న ఆవిష్కరణలు రావాల్సి ఉందన్నారు. విద్యుత్తు సంస్థలు రుణ సమీకరణలో వడ్డీ భారాన్ని తగ్గించుకోవాలని, కొనుగోళ్లలోనూ వ్యయం తగ్గించుకోవాలని సూచించారు.

రూ.500 కోట్ల పొదుపు

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో యూనిట్‌కు 20 పైసల చొప్పున కొనుగోలు వ్యయం తగ్గించినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈపీఎంఎస్ విధానంతో నిరంతర పర్యవేక్షణ ద్వారా రూ.400 నుంచి 500 కోట్ల మేర పొదుపు చేయగలిగామన్నారు. దీనిపై స్పందించిన సీఎం ఇతర రాష్ట్రాలతో పవర్ స్వాపింగ్ ఒప్పందాలు చేసుకోవడం ద్వారా కొనుగోలు వ్యయం తగ్గుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పరిశ్రమలకు, వాణిజ్యం, గృహ అవసరాలు, వ్యవసాయ రంగంలో విద్యుత్తు వినియోగాన్ని ఎప్పటికప్పుడు విశ్లేషించాలని, డిమాండ్‌కు తగినట్లుగా నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయాలని ఆదేశించారు.

ఆదాయం పెంచేలా చర్యలు

‘పీఎం కుసుమ్’ కింద దేవదాయ, జలవనరుల శాఖలకు చెందిన భూముల్లో విద్యుత్తు ఉత్పత్తి చేసుకునేందుకు అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి తెలిపారు. ఇంటిగ్రేటెడ్ క్లీన్‌ఎనర్జీ పాలసీలో భాగంగా మూల ధన రాయితీ, జీఎస్టీ మినహాయింపు సహా 9 అంశాలకు సీఎం అంగీకారం తెలిపారు.

ఐఐటీ బృందంతో అధ్యయనం

థర్మల్ పవర్ స్టేషన్లలోని బూడిదను వివిధ అవసరాలకు సద్వినియోగం చేసుకోవాలని చంద్రబాబు తెలిపారు. కాలుష్యానికి అడ్డుకట్ట వేసేందుకు ఐఐటీ బృందంతో అధ్యయనం చేయించాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయడటంతోపాటు దానికి రేటింగ్ ఇవ్వాలని సీఎం ఆదేశించారు. విద్యుత్తు రంగంలో నూతన ఆవిష్కరణల కోసం ఏటా ‘హ్యాకథాన్’ నిర్వహించాలని కోరారు. ఈ సమీక్షలో విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు!

రాష్ట్రంలోని రిజర్వాయర్ల వద్ద పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు ఉన్న అవకాశాలను జెన్‌కో ఇరిగేషన్ అధికారులతో కలిసి అధ్యయనం చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. సాగునీటి ప్రాజెక్టుల వద్ద పీఎస్పీ ప్రాజెక్టులు ఏర్పాటు చేసుకుంటే పెద్ద ఎత్తున విద్యుత్తు ఉత్పత్తి సాధ్యమవుతుందన్నారు. ఐదేళ్లలో ఆర్టీసీ బస్సులను విద్యుత్ వాహనాలుగా మార్చాలని సూచించారు.


విజేత సూపర్ మార్కెట్ ఎండీ మురకొండ జగన్మోహనరావు, కృష్ణవేణి దంపతుల పెద్ద కుమారుడు వివాహ రిసెప్షన్ మంగళవారం గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని ది క్యాపిటల్ హోటల్‌లో ఘనంగా జరిగింది. చిత్రంలో వారిద్దరితోపాటు నూతన దంపతులు సందీప్ చౌదరి, డాక్టర్ రాజ్యలక్ష్మి, వధూవరుల కుటుంబ సభ్యులు తలశిల శ్రీనివాస్, లీలా ఫణి మనోష, జయరామ్, మురకొండ సిద్దార్థ.

‘స్క్రబ్ టైఫస్’పై అవగాహన కల్పించండి

- కేసుల నమోదుపై సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. స్క్రబ్ టైఫస్ కేసుల నమోదుపై వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి సౌరభ్ గౌర్‌తో ముఖ్యమంత్రి సమీక్షించారు. ఇటీవల విజయనగరం జిల్లాలో స్క్రబ్ టైఫస్ బారినపడి చందక రాజేశ్వరి అనే మహిళ మృతిచెందిందని, తరహా ఘటనలు మరెక్కడా జరగకుండా చూడాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మృతికి కారణాలను చంద్రబాబుకి సౌరభ్ గౌర్ వివరించారు. విజయనగరానికి చెందిన రాజేశ్వరిని చిగ్గర్ మైట్ అనే కీటకం కుట్టిందని చెప్పారు. తొలుత టైఫాయిడ్‌కు చికిత్స అందించారని, ఆ తర్వాత ర్యాపిడ్ టెస్ట్ ద్వారా స్క్రబ్ టైఫస్ పాజిటివ్ అని తేల్చారని తెలిపారు. విజయనగరం క్యాసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాజేశ్వరి చనిపోయారని చెప్పారు. ఓరింటియా సుసుగాముషి అనే బ్యాక్టీరియా ద్వారా ఈ వ్యాధి సంక్రమిస్తుందని, ఇది అంటువ్యాధి కాదని అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు. వ్యాధి తీవ్రత పెరగకముందే చికిత్స అందించాలని సీఎం సూచించారు. కాగా, స్క్రబ్ టైఫస్ వల్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. టెలికాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితిని సమీక్షించారు.

ఏపీబీఐఎల్‌గా ఫైబర్ నెట్

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ (ఏపీఎస్ఎఫ్ఎల్) పేరును ఆంధ్రప్రదేశ్ భారత్ నెట్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ (ఏపీబీఐఎల్)గా మారుస్తూ దాన్ని స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్‌పీవీ)గా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తాజా క్యాబినెట్ సమావేశంలో ఫైబర్‌నెట్ పేరును ఏపీబీఐఎల్‌గా మార్చేందుకు ఆమోదం లభించింది.

ధాన్యం రైతుల సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్: నాదెండ్ల

ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ప్రభుత్వం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. విజయవాడలోని సివిల్ సప్లయిస్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఈ కంట్రోల్ రూమ్‌ను పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం పరిశీలించారు. రైతులు 1967 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయవచ్చని, ఆదివారం తప్ప మిగిలిన రోజుల్లో అందుబాటులో ఉంటుందని మంత్రి తెలిపారు.

సీఎఫ్‌సీల ఏర్పాటుకు రాష్ట్ర వాటా

పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలంలోని కొబ్బరి క్లస్టర్, గుంటూరు జిల్లా మంగళగిరిలోని గోల్డ్ ఆర్నమెంట్స్ క్లస్టర్లలో కామన్ ఫెసిలిటీ సెంటర్ల (సీఎఫ్‌సీ) ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు మంజూరు చేసింది. కొబ్బరి క్లస్టర్‌లోని సీఎఫ్‌సీకి రూ. 2.24 కోట్లు, గోల్డ్ ఆర్నమెంట్ క్లస్టర్‌లోని సీఎఫ్‌సీకి రూ. 74.95 లక్షలు చొప్పున గ్రాంట్ మంజూరుకు పరిపాలన అనుమతినిస్తూ పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఉత్తర్వులు విడుదల చేశారు.

గ్రానైట్ సమస్యకు పరిష్కారం

- సీనరేజీపై అపోహలను తొలగించిన ఏఎంఆర్ సంస్థ

బాపట్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మైనింగ్ సీనరేజీ చెల్లింపులపై గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులు, కార్మికులు లేవనెత్తిన సమస్యలకు పరిష్కారం లభించింది. సీనరేజీ వసూలు కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఏఎంఆర్ సంస్థ ప్రతినిధులు ఆందోళన చేస్తున్న వారితో సానుకూల వాతావరణంలో చర్చలు జరపారు. దీంతో సమస్య కొలిక్కి వచ్చింది. గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు, కార్మికులతో పాటు బల్లికురవ మండల పరిధిలోని రైతులు కూడా కొన్ని అంశాలను ఏఎంఆర్ దృష్టికి తెచ్చారు. వాటి విషయంలో కూడా సంస్థ ప్రతినిధులు సానుకూలంగానే స్పందించారు. దీంతో వివాదం ముగిసింది. గతంలో ప్రకాశం జిల్లా పరిధిలోని చీమకుర్తి ప్రాంతంలో కూడా కొన్ని అభ్యంతరాలను అక్కడి గ్రానైట్ ఫ్యాక్టరీల నిర్వాహకులు ఏఎంఆర్ సంస్థ దృష్టికి తెచ్చారు. వాటిని వారికి ఆమోదయోగ్యంగా పరిష్కరించారు. ప్రస్తుత ఆందోళనల అంశం సంస్థ దృష్టికి రాగానే తమ ప్రతినిధుల ద్వారా చర్చలు జరిపి రోజుల వ్యవధిలోనే సమస్యకు ముగింపు పలికింది. సీనరేజీ వసూలుకు సంబంధించి నెలకొన్న అపోహలపై ఏఎంఆర్ సంస్థ వారికి స్పష్టత ఇచ్చింది. సమస్యకు చర్చల ద్వారా పరిష్కారం దొరికిందని బాపట్ల జిల్లా మైనింగ్ విభాగం అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో ధ్రువీకరించారు.

రెండో విడతకు సై!

- ఈసారి 20,494 ఎకరాల భూసమీకరణ.. సీఆర్డీయేకు బాధ్యతలు

గుంటూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అమరావతి విస్తరణ, అభివృద్ధిలో భాగంగా రెండో విడత భూసమీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. మొత్తం 20,494 ఎకరాలను సమీకరించే బాధ్యతను సీఆర్డీయేకు అప్పగించింది. రెండో విడత భూసమీకరణకు రాజధాని రైతులను స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఒప్పించిన విషయం తెలిసిందే. చంద్రబాబు మాటపై తొలి విడత భూసమీకరణకు ఆనాడు అంగీకరించిన రైతులు, తిరిగి అదే స్ఫూర్తిని కనపరిచారు. ఈ నేపథ్యంలోనే రెండో విడత కోసం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా పల్నాడు, గుంటూరు జిల్లాల్లోని రెండు మండలాల్లో మొత్తం 16,666.57 ఎకరాలను రైతుల నుంచి సమీకరిస్తారు. మరో 3,828.30 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా విస్తరణకు వినియోగించుకోనున్నారు. పల్నాడు జిల్లా అమరావతి మండలంలోని నాలుగు గ్రామాల నుంచి 9,616 ఎకరాల భూమిని సమీకరిస్తారు. ఇందులో 7,465 ఎకరాలు రైతుల పట్టా భూములు, 97 ఎకరాలు అసైన్డ్ భూములు, 2,054.23 ఎకరాలు ప్రభుత్వ భూములున్నాయి. గుంటూరు జిల్లాలో 10,878 ఎకరాల భూమిని సమీకరిస్తుండగా, అందులో 9,097 ఎకరాలు రైతులకు చెందిన పట్టా భూములు, 7.01 ఎకరాలు అసైన్డ్ భూములు, 1,774.07 ఎకరాలు ప్రభుత్వ భూములున్నాయి. కాగా, మలి విడత భూసమీకరణ విషయంలో రైతుల నుంచి మిశ్రమ స్పందన లభిస్తోంది. గతంలో పలు గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, సీఆర్డీఏ అధికారులు.... రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో పలువురు రైతులు రెండో విడత భూసమీకరణను వ్యతిరేకించారు. తొలివిడత భూసమీకరణలో భూములిచ్చిన 29 గ్రామాల రైతుల్లో కూడా మలి విడత భూసమీకరణ పట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది.

భూసమీకరణ.. ఎకరాల్లో..

గ్రామం పేరు	పట్టా	అసైన్డ్	ప్రభుత్వం	మొత్తం
పల్నాడు జిల్లాలో..				
వైకుంఠపురం	1,965	00	1,395.48	3,361
పెద్దమద్దూరు	1,018	00	127	1,145
యండ్రాయి	1,879	46	241	2,166
కర్లపూడి లేమల్లె	2,603	51	290.75	2,944
జిల్లా మొత్తం	7,465	97	2,054.23	9,616
గుంటూరు జిల్లాలో..				
పెదపరిమి	5,886.18	0	627.34	6,513
హరిశ్చంద్రపురం	1,448.09	2.29	977.87	2,428
వడ్డమాను	1,763.29	4.72	168.86	1,937
జిల్లా మొత్తం	9,097.56	7.01	1,774.07	10,878
మొత్తంగా..	16,562.56	104.01	3,828.30	20,494

అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం

- గనుల శాఖకు సీఎం ఆదేశం
- ఇసుక రీచ్‌లలో డ్రోన్, శాటిలైట్ నిఘా పెట్టాలి
- 6 జిల్లాల్లో సంతృప్త స్థాయి ఎందుకు తగ్గింది?
- మీరంతా ఏం చేస్తున్నారని ఆగ్రహం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఉచిత ఇసుక పథకం పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఇసుక పంపిణీ, రవాణా వంటి కీలక అంశాల్లో ప్రభుత్వ కృషికి తగినట్లుగా ప్రజల్లో సంతృప్తిస్థాయి పెరగాలని దిశానిర్దేశం చేశారు. ఉచితం పేరిట కొన్ని చోట్ల అక్రమార్కులు ఇసుకను దారి మళ్లిస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నందున.. నిరంతరం రీచ్‌లపై డ్రోన్, శాటిలైట్ వ్యవస్థలతో నిఘా పెట్టాలని స్పష్టంచేశారు. రీచ్‌ల నుంచి అక్రమంగా ఇసుకను తవ్వితీసేవారిపైన, గృహావసరాల కోసమంటూ తీసుకున్న ఇసుకను బ్లాక్‌మార్కెట్ చేసేవారిపైన ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. గనుల శాఖపై మంగళవారం సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీఎండీసీ ఎండీ ప్రవీణ్‌కుమార్, కమిషనర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. గనుల శాఖ ఇచ్చిన నివేదిక ప్రకారం.. ఇసుకకు సంబంధించిన పీపీపీ విధానం (రీచ్, డిపోలో ప్రైవేటు విక్రయాలు)పై ఆరు జిల్లాల్లో ప్రజల సంతృప్త స్థాయి బాగా తగ్గింది. ఆర్టీజీఎస్ నిర్వహించిన సర్వేల్లో.. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 49.7 శాతం, నెల్లూరు-50.4%, గుంటూరు-56.4%, కృష్ణా-59.2%, శ్రీకాకుళం-60.9%, శ్రీసత్యసాయి జిల్లాలో 63.4 శాతమే సంతృప్త స్థాయి వచ్చింది. ఈ పరిస్థితి ఎందుకొచ్చిందని సీఎం అధికారులను ప్రశ్నించారు. లోపాలను సరిదిద్దేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్నా సమస్యలు ఎందుకు పరిష్కారం కాలేదని అడిగారు. ఇసుక స్టాక్ పాయింట్లు మూసివేయడం ఒక కారణమని గనుల శాఖ అధికారి ప్రవీణ్ నివేదించారు. ఇదొక్కటే కారణంలా కనిపించడం లేదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. దాంతో అధికారులు అసలు విషయం నివేదించారు. ఇసుక పంపిణీకి ప్రజల నుంచి అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారని తెలిపారు. వారానికి ఒక్కరికి ఒక ట్రిప్పేనంటూ రవాణాదారులు తప్పుదోవ పట్టిస్తున్నారని చెప్పారు. ఇంత జరుగుతుంటే జిల్లాల్లో గనుల శాఖ, విజిలెన్స్ అధికారులు ఏం చేస్తున్నారని సీఎం నిలదీశారు. తక్షణమే ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఉమ్మడి గోదావరి, ప్రకాశం, కడప జిల్లాల్లో అధికారుల తనిఖీలు, పర్యవేక్షణ బాగున్నాయని గనుల అధికారులు నివేదించగా.. ఇదే పని సంతృప్త స్థాయి తగ్గిన ప్రాంతాల్లో ఎందుకు చేయడం లేదని ఆయన ప్రశ్నించినట్లు తెలిసింది.


గనుల శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు, మంత్రి కొల్లు రవీంద్ర, అధికారులు

అక్రమ వసూళ్లపై కఠిన చర్యలు..

ప్రజల నుంచి అత్యధిక చార్జీలు వసూలు చేసే రవాణాదారులు, డిపో ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలివ్వాలని సీఎం స్పష్టంచేశారు. బీచ్‌శాండ్ మైనింగ్ నేపథ్యంలో విశాఖలో క్రిటికల్ మినరల్ క్లస్టర్ (సీఎంసీ)ను ఏర్పాటు చేయాలన్న గనుల శాఖ ప్రతిపాదనకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. దీనివల్ల పెద్దఎత్తున కంపెనీలు ముందుకొస్తాయని అధికారులు తెలిపారు.

ఇసుక కొరత రావొద్దు..

రాజధాని నిర్మాణానికి అవసరమైన ఇసుక, మట్టి, కంకర మొదలైనవాటికి కొరత లేకుండా పక్కా కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని సీఎం ఆదేశించారు. సీఆర్‌డీఏ పనులు చేసే కాంట్రాక్టర్లు క్వారీ లీజుల కోసం వెంటనే దరఖాస్తులు చేసుకోవలసి ఉందని అధికారులు తెలిపారు.

మొక్కజొన్న రైతులను ఆదుకోండి

కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం లేఖ

ఢిల్లీలో అందజేసిన రామ్మోహన్,లావు

న్యూఢిల్లీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2025-26కు సంబంధించి ఏపీలో కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ధర కింద మొక్కజొన్న సేకరణకు సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వానికి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. కేంద్ర లేదా రాష్ట్ర ఏజెన్సీల ద్వారా ఎంఎస్‌పీ ధరకు మొక్కజొన్న సేకరణకు అనుమతించాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ఆయన లేఖ రాశారు. ఆ లేఖను కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, టీడీపీపీ నేత శ్రీకృష్ణదేవరాయలు ప్రహ్లాద్‌జోషికి అందజేశారు. 3,25,134 టన్నుల మొక్కజొన్నను సేకరించాలని ఆ లేఖలో కేంద్ర మంత్రిని సీఎం కోరారు.

కాగ్నిజెంట్ వచ్చేస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తున్నందున కాగ్నిజెంట్‌కు ఏపీఐఐసీ అధికారులు ముందుగానే కొన్ని నిబంధనలు పెట్టారు. నిర్ణీత గడువులో నిర్మాణం పూర్తి చేసి, ఉద్యోగాలు ఇచ్చిన తరువాత పూర్తిస్థాయిలో భూమిని రిజిస్ట్రేషన్ చేస్తామని పేర్కొన్నారు. ఈలోగా పనులు ప్రారంభించేందుకు అవసరమైన అనుమతులు ఇస్తామని ఏపీఐఐసీ వర్గాలు తెలిపాయి. ఉపాధి అవకాశాలు ఎక్కువ కల్పించే ఐటీ సంస్థలకు తక్కువ ధరకే ప్రభుత్వం భూములు కేటాయిస్తోంది. అందులో భాగంగానే కాగ్నిజెంట్‌కు కాపులుప్పాడలో 22.1 ఎకరాలు కేటాయించింది. మొత్తం రూ. 1,582.98 కోట్లు పెట్టుబడి పెట్టే ఆ సంస్థ 8 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఒప్పందం చేసింది.

గడువుకు ముందే కార్యకలాపాలు: వాస్తవానికి 2026 జూన్‌నాటికి భవనం అద్దెకు తీసుకొని 500 మందితో కార్యకలాపాలను ప్రారంభించాలని, అదేసమయంలో కేటాయించిన భూమిలో నిర్మాణాలు ప్రారంభించాలని కాగ్నిజెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం షరతు విధించింది. దీనికి అనుగుణంగా దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లోని తమ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఏపీ ఉద్యోగులను విశాఖపట్నం రావడానికి ఆసక్తి ఉంటే తెలియజేయాలని కాగ్నిజెంట్ నవంబరులో లేఖలు రాసింది. దానికి స్పందన బాగుండడం, అనేకమంది విశాఖ నుంచి పనిచేస్తామని ముందుకు రావడంతో ఈనెలలోనే ఇక్కడ డెవలప్‌మెంట్ సెంటర్‌ను 500 మందితో ప్రారంభించాలని నిర్ణయించింది. ఇందుకోసం కాగ్నిజెంట్ సంస్థ రుషికొండ ఐటీ పార్కు హిల్ నంబరు-2పై గల మహతి ఫిన్‌టెక్ వేలీలో కొంతభాగం అద్దెకు తీసుకుంది.

ఆర్థిక కారిడార్ అమరావతి

- త్వరలోనే విజన్ ప్లాన్స్ రూపకల్పన
- కార్యక్రమాల పర్యవేక్షణకు సీనియర్ ఐఏఎస్
- ఇప్పటికే జాతీయ బ్యాంకులు, బీమా కంపెనీలు

(గుంటూరు- ఆంధ్రజ్యోతి)

రాజధాని అమరావతి ఎకనామిక్ కారిడార్‌గా అవతరించబోతోంది. ఇటీవల సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అమరావతి ఎకనామిక్ జోన్‌లో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, కృష్ణా, ఎన్‌టీఆర్, ఏలూరు, త్వరలో ఏర్పడబోయే మార్కాపురం జిల్లాలుంటాయి. ఈ నేపథ్యంలో అమరావతి ఎకనామిక్ కారిడార్‌కు త్వరలోనే రూపకల్పన జరగనుంది. విజన్ ప్రణాళికలు రూపకల్పన జరిగి కార్యరూపం దాల్చితే అమరావతి ఎకనామిక్ కారిడార్ రాష్ట్రానికే తలమానికంగా మారుతుందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాగా అమరావతి ఎకనామిక్ కారిడార్ కార్యకలాపాల పర్యవేక్షణకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని ప్రభుత్వం నియమించనుంది. ఈ కారిడార్ రాష్ట్రానికి కేంద్ర బిందువుగా ఉండనున్న దృష్ట్యా ప్రధానంగా ఫైనాన్స్, డీప్ టెక్నాలజీ, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ) సంస్థలపై ప్రభుత్వం దృష్టి సారించనుంది. రాజధానిలో ఇప్పటికే క్వాంటమ్ వ్యాలీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. మరోవైపు అమరావతిలో ఆర్థిక నగరాన్ని నిర్మించేందుకు ఇటీవలే అంకురార్పణ జరిగింది. దేశ చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా ఒకే రోజున 15 జాతీయ బ్యాంకులు, బీమా కంపెనీలు రీజినల్ కార్యాలయాల ఏర్పాటుకు శంకుస్థాపన చేశాయి. మరికొన్ని బ్యాంకులు, కంపెనీలు కూడా త్వరలోనే వాటి కార్యాలయాల నిర్మాణాలను ప్రారంభించనున్నాయి. ఈ నేపథ్యంలో ఫైనాన్స్ సంస్థలు ఎక్కువగా అమరావతిలో దృష్టి సారించేలా చూడాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మంగళగిరికి సమీపంలో ఎన్‌హెచ్-16 పక్కన ఇప్పటికే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ని ప్రారంభించారు. అక్కడ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. గతవారంలో ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కూడా ఇక్కడకు వచ్చి ఔత్సాహికులతో సమావేశం నిర్వహించారు. అమరావతి ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా డీప్ టెక్నాలజీ స్టార్టప్‌లను కూడా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ స్టార్టప్‌లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్, క్లీన్‌ఎనర్జీ వంటి రంగాల్లో తలెత్తే సంక్లిష్ట, ప్రాథమిక సమస్యల పరిష్కారానికి ఉపయోగకరంగా ఉంటాయని భావిస్తున్నారు.

శాఖలన్నింటికీ ఉమ్మడి డేటా సెంటర్ ఆర్టీజీఎస్

- ఆర్టీజీఎస్‌పై సమీక్షలో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖలన్నింటికీ ఉమ్మడి డేటా సెంటర్‌గా ఆర్టీజీఎస్ వ్యవహరిస్తుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ అంశాలపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ నెలాఖరు నుంచి ప్రభుత్వ శాఖలకు చెందిన సమాచారమంతా క్రోడీకరించి డేటా లేక్ ద్వారా విశ్లేషించనున్నట్లు వెల్లడించారు. ప్రజల్లో సానుకూల దృక్పథం పెరిగేలా మెరుగ్గా పౌరసేవలు అందించాలని ఆదేశించారు. ప్రజల నుంచి వస్తున్న సమాచారాన్ని విశ్లేషించి సేవలను సులభతరం చేయాలన్నారు.

పన్నుల వసూళ్లకు సమానంగా ఏపీకి పంపిణీ!

- 2020-25 మధ్య గణాంకాలు వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా గత ఐదేళ్లలో రాష్ట్రాల వారీగా సేకరించిన ప్రత్యక్ష పన్నులు, స్థూల జీఎస్టీ వసూళ్ల మొత్తం రూ.111.75 లక్షల కోట్లు కాగా.. ఆ కాలంలో రాష్ట్రాలకు పన్ను పంపిణీ, ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాల రూపేణా కేంద్రం బదిలీ చేసిన మొత్తం రూ.75.12 లక్షల కోట్లు అని కేంద్రం వెల్లడించింది. రాజ్యసభలో సీపీఎం సభ్యుడు జాన్ బ్రిటాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఈ మేరకు సమాధానం ఇచ్చారు. ఏపీ నుంచి రూ.3.32 లక్షల కోట్లు వసూలు కాగా, కేంద్రం ఏపీకి రూ.3.23 లక్షల కోట్లు బదిలీ చేసిందన్నారు. ఏపీలో వసూళ్లకు దాదాపు సమానంగా కేంద్రం నుంచి నిధులు బదిలీ అయ్యాయని పంకజ్ చౌదరి వివరించారు.



శనగలు

మార్క్‌ఫెడ్ మాయ

రేయనక, పగలనక చెమటోడ్చి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించకపోవటంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పెసలు, శనగలు, కందులు, మొక్కజొన్నలకు కనీస మద్దతు ధర కూడా లభించక కుంగిపోతున్నారు. మరోవైపు రైతుల నుంచి సమయానికి కొనుగోలు చేయాల్సిన మార్క్‌ఫెడ్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని రైతులు వాపోతున్నారు.



మొక్కజొన్నలు

తెలంగాణలో ఒకలా.. రాష్ట్రంలో మరోవిధంగా

- పొరుగు రాష్ట్రంలో కొనుగోళ్లు
- ఏపీలో జాడలేని కేంద్రాలు
- బహిరంగ మార్కెట్‌లో మోసాలు
- కందులు, శనగలు, మొక్కజొన్న, పెసలకు భారీగా పడిపోయిన ధర

(కంచికచర్ల-ఆంధ్రజ్యోతి)

వరి, మిర్చి పండించిన రైతులు తమకు కనీస మద్దతు ధర లభించడం లేదని, నానా తిప్పలు పడుతున్నామని వాపోతున్న విషయం తెలిసిందే. అయితే.. తాజాగా ఈ జాబితాలో అపరాల రైతులు కూడా చేరారు. కందులు, శనగ, పెసర పంటలకు మద్దతు ధర లేక, బహిరంగ మార్కెట్‌లో కనీసం పెట్టుబడి సొమ్ము కూడా రాక తిప్పలు పడుతున్నారు. ఇలాంటి సమయంలో రైతులను ఆదుకునేందుకు ముందుకు రావాల్సిన మార్క్‌ఫెడ్ కూడా ముఖం చాటేస్తోందని చెబుతున్నారు. అంతేకాదు, పొరుగు రాష్ట్రం తెలంగాణలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన మార్క్‌ఫెడ్.. ఏపీలో మాత్రం ఆ ఊసే ఎత్తడం లేదని వాపోతున్నారు. దీంతో పంటను కొనేవాళ్లు లేక రైతులు కన్నీళ్లు పెడుతున్నారు.

మూడేళ్లుగా మద్దతులేని పెసర

మూడు సంవత్సరాలుగా పెసర పంటకు మద్దతు ధర లభించడం లేదని రైతులు చెబుతున్నారు. ఎకరానికి రెండు నుంచి నాలుగు క్వింటాళ్ల వరకు పెసర దిగుబడి వస్తోందని, సెప్టెంబరు మొదటి వారంలో పంట పూర్తిగా చేతికి అందిందని.. బహిరంగ మార్కెట్లో క్వింటా రూ.ఆరు వేలకు మించి ధర రావటం లేదని వాపోతున్నారు. ఈ ధర ఇచ్చేందుకు కూడా వ్యాపారులు అనేక కొర్రీలు వేస్తున్నారని చెబుతున్నారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర క్వింటా రూ.8,768 కాగా, వ్యాపారులు మాత్రం రెండు వేలు తగ్గించి కొంటున్నారు. దీంతో రైతులు తమ పంటలను శీతల గిడ్డంగులు, మార్కెట్ యార్డులు, ఇళ్లలో నిల్వ చేశారు. పంట చేతికి వచ్చి మూడు నెలలు కావస్తున్నప్పటికీ కొనుగోలు కేంద్రాల ఊసే లేకపోవడంతో దిగాలు పడుతున్నారు. గత మూడేళ్లుగా మార్క్‌ఫెడ్ పెసలను కొనుగోలు చేయటం లేదు. గత ఏడాది కొంటామంటూ సీఎం యాప్‌లో పేర్లు నమోదు చేసుకోమన్నారు. రైతుల ఫోన్లకు మేసేజ్‌లు కూడా వచ్చాయి. చివరకు రైతులకు నిరాశే మిగిలింది. ఒక్క కిలో కూడా కొనలేదు.

తెగనమ్ముకుంటున్న మొక్కజొన్న

మొక్కజొన్నకు కౌలు కాకుండా ఎకరానికి రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పెట్టుబడి ఖర్చయింది. దిగుబడి 15 నుంచి 20 క్వింటాళ్లు వచ్చింది. గత నెల మొదటి వారం నుంచి పంట చేతికి రావటం ప్రారంభమైంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్నకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధర క్వింటా రూ.2,400. ప్రైవేట్ వ్యాపారులు మాత్రం క్వింటా రూ.1,700 నుంచి రూ.1,800లకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. అదనంగా ఒక్క రూపాయి ఇవ్వడానికి కూడా ముందుకు రావడం లేదు. ఫలితంగా క్వింటాకు రూ.ఆరేడు వందలు నష్టపోవాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. మద్దతు ధర దక్కకపోవడంతో 20 క్వింటాళ్ల దిగుబడికి ఎకరానికి సగటున రూ.12 వేలు వంతున రైతులు నష్టపోతున్నారు. పక్కనే ఉన్న తెలంగాణాలో మొక్కజొన్న పంటను అక్కడి ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతులకు మద్దతు ధర క్వింటా రూ.2,400 ఇస్తున్నారు. ఎకరానికి గరిష్ఠంగా 25 క్వింటాళ్లు కొంటున్నారు.

కందికి మద్దతేదీ?

కంది సాగు సగటున నాలుగు క్వింటాళ్ల వంతున ఫిబ్రవరిలో పంట చేతికి వచ్చింది. అప్పట్లో మద్దతు ధర రూ.7,550 ఉన్నప్పటికీ బహిరంగ మార్కెట్‌లో క్వింటా రూ.6,100కే వ్యాపారులు కొనుగోలు చేశారు. ఇక, మార్క్‌ఫెడ్ అధికారులు 45 టన్నులు మాత్రమే కొన్నారు. 'ఈ-క్రాప్'లో కంది విస్తీర్ణం తక్కువగా నమోదైందని అధికారులు సాకులు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లాలో రైతులు కందిలో అంతర పంటగా మొక్కజొన్న సాగుచేశారు. వ్యవసాయాధికారులు మాత్రం ఎకరంలో 20 శాతం కంది, 80 శాతం మొక్కజొన్నగా ఈ-క్రాప్‌లో నమోదు చేశారు. దీంతో రైతులు గత్యంతరం లేక 2 నెలల క్రితం క్వింటా రూ.5,800కు, గత నెలలో రూ.6,350కు విక్రయించారు.

విత్తనాలు 7 వేలు.. పంట 5 వేలు!

గత సీజన్‌లో శనగ మద్దతు ధర రూ.5,650కాగా, ఈ ఏడాది మార్చిలో పంట చేతికందే సమయంలో బహిరంగ మార్కెట్‌లో రూ.5,500 పలికింది. అంతకు ముందుటేడాది క్వింటా రూ.7,200కు అమ్మారు. ఈ ఏడాది మార్చి 17న అప్పటి డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ విజయ సునీత, మార్క్‌ఫెడ్ డీఎం మల్లిక కంచికచర్ల యార్డుకు వచ్చి శనగలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినా మార్క్‌ఫెడ్‌కు అమ్మేది లేదంటూ రైతులు తెగేసి చెప్పారు. ప్రభుత్వం.. రాయితీ విత్తనాల పేరిట రూ.7 వేలకు అమ్మిందని, పంటను మాత్రం రూ.5,650కు కొంటామనటం ఎంత వరకు సబబని నిలదీశారు. మార్క్‌ఫెడ్‌కు అమ్మకుండా శీతల గిడ్డంగుల్లో నిల్వ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని రైతులు కోరుతున్నారు.

తంబళ్లపల్లె కోర్టుకు జోగి సోదరులు

- నకిలీ మద్యం కేసులో రిమాండ్..నెల్లూరుకు తరలింపు



జోగి రమేశ్, జోగి రాములను తంబళ్లపల్లె కోర్టుకు తీసుకొస్తున్న ఎక్సైజ్ పోలీసులు

రాయచోటి/ములకలచెరువు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు నకిలీ మద్యం కేసులో వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన సోదరుడు రామును మంగళవారం తంబళ్లపల్లె కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసులో జోగి రమేశ్‌ను ఏ-32గా, జోగి రామును ఏ-33గా చేరుస్తూ ఇటీవల ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె జూనియర్ సివిల్ కోర్టులో మెమో దాఖలు చేశారు. పీటీ వారెంట్‌కు కోర్టు అనుమతి ఇచ్చింది. ఇప్పటికే ఇబ్రహీంపట్నం నకిలీమద్యం వ్యవహారంలో అరెస్టయ్యి నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న జోగి బ్రదర్స్‌ను పీటీ వారెంట్‌పై మంగళవారం ప్రత్యేక భద్రత మధ్య తంబళ్లపల్లె కోర్టులో హాజరు పరిచారు. వీరిద్దరికీ న్యాయాధికారి ఉమర్ ఫరూక్ ఈనెల 16 వరకు రిమాండ్ విధించారు. దీంతో జోగి సోదరులను తిరిగి నెల్లూరు జైలుకు తీసుకెళ్లారు. జోగి రమేశ్‌ను కోర్టు వద్ద కలిసేందుకు తంబళ్లపల్లె వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మదనపల్లె నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి నిస్సార్ అహమ్మద్ తదితరులు వచ్చారు. రిమాండ్‌లో ఉన్న నిందితులతో మాట్లాడకూడదని పోలీసులు నచ్చజెప్పినా వినకుండా కోర్టునుంచి బయటకు వెళుతున్న రమేశ్‌ను ఎమ్మెల్యే పలకరించారు. జోగి సోదరుల వాహనంపై కార్యకర్తలు పూలు చల్లుతూ హంగామా సృష్టించారు.

హైకోర్టులో సజ్జల శ్రీధర్‌రెడ్డి బెయిల్ పిటిషన్

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ నిందితుడు సజ్జల శ్రీధర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం హైకోర్టు విచారణ జరిపింది. ఇరు వైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీని ఆదేశించారు.

పోలీసు శాఖలో ఉద్యోగం చేస్తావా?

(మొదటి పేజీ తరువాయి)

భాగంగా.. 'పోలీసు శాఖలోకి వచ్చి, సైబర్ క్రైమ్ విభాగంలో పనిచేస్తావా? మంచి జీతం కూడా ఇస్తాం' అని అడిగినట్లు తెలిసింది. రవి మాత్రం వారి ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించినట్లు సమాచారం. ఇమ్మడి రవిని కస్టడీలోకి తీసుకొని విచారించిన పోలీసులు అనేక కొత్త విషయాలు రాబట్టినట్లు తెలిసింది. విచారణలో భాగంగా 'నీ బొమ్మ క్లోజ్ అయింది. తర్వాత ఏంటి?' అని పోలీసులు ప్రశ్నించగా.. కరేబియన్ దీవుల్లో ఒక రెస్టారెంట్ పెట్టి తెలంగాణ, ఆంధ్రాతో పాటు దేశంలోని ప్రముఖ వంటకాలను అక్కడి ప్రజలకు రుచి చూపించి డబ్బు సంపాదిస్తానని రవి చెప్పినట్లు తెలిసింది. ఆశ్చర్యపోయిన పోలీసులు.. రెస్టారెంట్‌కు ఏం పేరు పెడతావని ప్రశ్నించారు. 'ఐ బొమ్మ' పేరే పెడతానని రవి బదులివ్వడం విశేషం. ఐ బొమ్మ రెస్టారెంట్‌తో వచ్చే డబ్బుతో జీవితాన్ని ఉల్లాసంగా గడపడమే తన లక్ష్యమని రవి పోలీసులకు చెప్పినట్లు తెలిసింది.

ఉద్యోగాల పేరుతో బురిడీ

- కర్ణాటక, ఏపీలకు చెందిన 8 మంది అరెస్టు

పిఠాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మంచి ఉద్యోగం.. ఆకర్షణీయమైన జీతం.. అంటూ నిరుద్యోగ యువతకు వల విసిరారు. ట్రాప్‌లో పడిన వారి పేరు మీదే బ్యాంకు ఖాతాలు తెరిచి.. సైబర్ నేరాల ద్వారా వచ్చిన సొమ్మును ఆ ఖాతాల్లో వేయించుకున్నారు. ఇలా రూ.75 లక్షలు కాజేశారు. మోసపోయినట్టు గుర్తించిన నిరుద్యోగ యువత పిఠాపురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 8 మందిని అరెస్టు చేశారు. కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో కాకినాడ ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్ వివరాలను వెల్లడించారు. కాకినాడ రూరల్ మండలానికి చెందిన నాళం గంగాభవానీ గత నెల 24న కోట గుమ్మం సెంటర్లో 'ఉద్యోగ అవకాశాలు.. నెలకు రూ.15వేలు-రూ.35వేలు జీతం' అనే ప్రకటన చూసి అందులోని ఫోన్ నంబర్లకు కాల్ చేసింది. వాళ్లు.. ప్రాసెసింగ్ ఫీజు, ల్యాప్‌టాప్ కోసం రూ.24 కట్టాల్సి ఉంటుందని చెప్పగా.. వారికి ఆ మొత్తం ఫోన్‌పే చేసింది. ఆ తర్వాత ఆమెకు అనుమానం వచ్చి పిఠాపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తాను కూడా ఇలాగే రూ.13 వేలు చెల్లించి మోసపోయానని పేర్కొంటూ కోటిపల్లి సాయి, ఆమె స్నేహితులు ముగ్గురు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు పోలీసులు దర్యాప్తు చేశారు. 'ట్రాంజ్ ఇండియా కార్పొరేట్ నెట్‌వర్క్ ప్రైవేట్ లిమిటెడ్' పేరిట తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కార్యాలయం ఏర్పాటు చేసిన కేటుగాళ్లు... డేటా ఎంట్రీ, టెలికాలింగ్ ఉద్యోగాల పేరుతో పలువురిని మోసం చేసినట్టు పోలీసులు విచారణలో గుర్తించారు.

పాపం పసివాడు

- హైదరాబాద్‌లో మూగ బాలుడిపై 20 వీధి కుక్కల దాడి



హయత్‌నగర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మూగవాడైన ఓ ఎనిమిదేళ్ల బాలుడిపై ఏకంగా 20 వీధి కుక్కలు ఒకేసారి దాడి చేశాయి. పిల్లాడి చెవి, కాళ్లు, పిక్కలు, తల, పొట్ట.. ఎక్కడ దొరికితే అక్కడ ఇష్టమొచ్చినట్టు పీక్కుతిన్నాయి. అదే సమయంలో అటుగా వచ్చిన ఓ వ్యక్తి రాళ్లు విసిరి కుక్కలను తరిమేయగా.. తీవ్రంగా గాయపడిన ఆ బాలుడు అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ హృదయ విదారక ఘటన హైదరాబాద్‌లోని హయత్‌నగర్ ప్రాంతంలో మంగళవారం చోటుచేసుకుంది. ఏపీలోని ఒంగోలుకు చెందిన బెల్లపల్లి తిరుపతి, చంద్రకళ దంపతులు షిర్డినగర్‌లో నివాసం ఉంటున్నారు. తిరుపతి అపార్ట్‌మెంట్‌ల వద్ద వాచ్‌మన్‌గా పని చేస్తుంటాడు. దంపతులకు ప్రేమ్‌చంద్(8) అనే కుమారుడు ఉన్నాడు. ప్రేమ్‌చంద్‌కు మాటలు రావు. అయితే, మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో ప్రేమ్ చంద్ తమ ఇంటికి సమీపంలోని ఓ కిరాణ దుకాణానికి వెళుతుండగా ఓ కుక్కల గుంపు అతడిపై మూకుమ్మడిగా దాడి చేసి ఇష్టమొచ్చినట్టు కొరికేశాయి.

మద్యం స్కాంలో.. ముంబై వ్యాపారి అరెస్టు

- ఇప్పటికి 51కి చేరిన నిందితుల సంఖ్య

అమరావతి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో జరిగిన రూ.మూడున్నర వేల కోట్ల మద్యం కుంభకోణం కేసులో ముంబై బులియన్ వ్యాపారి రోణక్‌కుమార్ జస్‌రాజ్‌ను 'సిట్' అధికారులు అరెస్టు చేశారు. అతడిని విచారణ నిమిత్తం విజయవాడకు పిలిపించగా.. బయట హాల్లో ఉంటానని చెప్పి తప్పించుకుని పారిపోతుండగా గన్నవరం విమానాశ్రయంలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జగన్ ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలకు నాసిరకం మద్యం అధిక ధరలకు విక్రయించి ముడుపుల రూపంలో వేల కోట్ల రూపాయలను వైసీపీ ముఠా వసూలు చేసింది. ఆ సొమ్ముతో ఎన్నికల్లో వైసీపీకి ఓట్లు కొనడం మొదలుకొని.. పొరుగు రాష్ట్రాల్లో స్థిరాస్తులు, ముంబైలో బంగారం కొనుగోలు.. మనీలాండరింగ్, హవాలా రూపంలో ఇతర దేశాలకు తరలింపు.. ఆ తర్వాత వైట్ మనీగా మార్చుకున్న రాజ్ కసిరెడ్డి గ్యాంగ్ అక్రమాలను ఒక్కొక్కటిగా సిట్ అధికారులు బయటకు తీస్తున్నారు. ఆదాన్ డిస్టిలరీస్, లీలా డిస్టిలరీస్, ఎస్పీవై ఆగ్రోస్ నుంచి ముంబైకి చెందిన అనిల్ చోఖ్రా సృష్టించిన సెల్ కంపెనీల బ్యాంకు ఖాతాల్లోకి రూ.78 కోట్లు బదిలీ అయినట్లు ఆధారాలు లభించాయి. చోఖ్రాను ముంబైలో అదుపులోకి తీసుకుని.. విజయవాడ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టి.. కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. 'ఆదాన్, లీలా, ఎస్పీవై యజమానులతో నాకు ప్రత్యక్షంగా సంబంధాల్లేవు. ముంబైలోని హవాలా డాన్లలో ఒకరైన చాముండ బులియన్ యజమాని చేతన్‌కుమార్ జస్‌రాజ్ నన్ను పిలిచి హైదరాబాద్ నుంచి రూ.100 కోట్లు వస్తాయి.. ఆర్వోసీలో మేనేజ్ చేసి షెల్ కంపెనీలు సృష్టించి కేవైసీ ద్వారా బ్యాంకు ఖాతాలు తెరిపించాలని అడిగారు.. కమీషన్ మాట్లాడుకుని నేను 30 కంపెనీల పేర్లు, ఖాతాల వివరాలు చేతన్‌కుమార్‌కు అందజేశాను.. తర్వాత ఆదాన్, లీలా, ఎస్పీవై ఖాతాల నుంచి నా పరిధిలో ఉన్న నాలుగు బ్యాంకు ఖాతాలకు రూ.78 కోట్లు వచ్చాయి.. నకిలీ ఇన్వాయిస్‌లు, ఫేక్ జీఎస్టీతో కొంత, బులియన్ ద్వారా బంగారం కొనుగోలు చేసినట్లు మరికొంత వైట్‌గా మార్చేసి కమీషన్ పోను మిగతా సొమ్ము తిరిగి చెల్లించా' అని చోఖ్రా వెల్లడించాడు. దీంతో సిట్ అధికారులు చేతన్‌కుమార్‌కు ఫోన్ చేసి చోఖ్రాతో కలిపి ప్రశ్నించాల్సి ఉందని, విజయవాడకు రమ్మని పిలిచారు. తనకు ఆరోగ్యం బాగాలేదంటూ తన తమ్ముడు రోణక్ కుమార్‌ను పంపాడు. మంగళవారం ఉదయం సిట్ కార్యాలయానికి వచ్చిన రోణక్‌ను అధికారులు చోఖ్రాతో కలిపి సాయంత్రం వరకు విచారించారు. అతడు చెబుతున్న విషయాలేవీ తనకు తెలియవని, అంతా తన అన్నే చూసుకుంటాడని రోణక్ చెప్పడంతో.. 'చేతన్‌ను రేపు(బుధవారం) రమ్మను.. ముగ్గురినీ కలిపి ప్రశ్నిస్తాం' అంటూ సిట్ అధికారులు సూచించారు. ఫోన్లో ఈ విషయం చెబుతానని, హాల్లో ఉంటానని చెప్పిన రోణక్ అక్కడి నుంచి తప్పించుకున్నాడు. గన్నవరం విమానాశ్రయానికి పరారయ్యాడు. ముంబై విమానం ఎక్కేందుకు బోర్డింగ్ పాస్‌తో సిద్ధంగా రోణక్‌ను సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో పూనాభాయ్ సోదరులిద్దరినీ నిందితులుగా చేర్చారు. అతడిని ఏ-50గా, చేతన్‌కుమార్‌ను ఏ-51గా పేర్కొంటూ ఏసీబీ కోర్టుకు సమాచారం కూడా ఇచ్చారు. దీంతో ఈ కుంభకోణం కేసులోని నిందితుల సంఖ్య 51కి చేరింది.



రోణక్ కుమార్



చేతన్ కుమార్

రోణక్ అరెస్టుతో చేతన్ ఫోన్ స్విచాఫ్..

వాస్తవానికి చేతన్‌కుమార్ తాను విజయవాడ వస్తున్నానంటూ.. బుక్ చేసుకున్న విమాన టికెట్‌ను సిట్ అధికారులకు పంపాడు. ఆ తర్వాత అరెస్టు తప్పదన్న భయంతో తన తమ్ముడు పారిపోయేందుకు ప్రయత్నించి పట్టుబడినట్లు తెలియగానే తన ఫోన్ స్విచాఫ్ చేసుకున్నాడు. దీంతో అతడి కోసం సిట్ బృందాలు ముంబై వెళ్లనున్నట్లు తెలిసింది. ఇదే సమయంలో చేతన్‌తో ఇటీవల ఎక్కువగా మాట్లాడినవారిలో వైసీపీ ముఠాకు చెందినవారెవరైనా ఉన్నారా అనే కోణంలో సాంకేతికంగా ఆరా తీస్తున్నారు.

వైసీపీ ముఠా నుంచి బ్లాక్.. అనిల్ చోఖ్రాతో వైట్..

ముంబైలో పూనాభాయ్‌గా పేరుగాంచిన జస్‌రాజ్ పాల్గొటా అనే వ్యాపారి చాముండ బులియన్ పేరుతో మహాలక్ష్మి జ్యుయెలరీ, రుచిత జ్యుయెలరీ తదితర పేర్లతో చాలా ఏళ్లుగా బంగారం వ్యాపారం చేస్తున్నారు. మనీలాండరింగ్‌లో దిట్ట. నల్ల ధనం ఇస్తే దేశంలో ఎక్కడైనా వైట్ మనీగా మార్చి చెల్లిస్తాడని అంటారు. నకిలీ వే బిల్లులు, ఫేక్ జీఎస్టీలు సృష్టించడం.. బంగారం కొనుగోలు చేసి.. బిల్లులు లేకుండా తీసుకెళ్లే చిన్న చిన్న బంగారం వ్యాపారులకు విక్రయించి ఆ సొమ్ము వైట్‌గా మారుస్తాడని.. అన్నింటికీ మించి కమీషన్ ఎక్కువగా ఇస్తే దుబాయ్‌తో పాటు 25-30 దేశాల్లో అడిగిన చోటుకు డబ్బు చేర్చగల సమర్థుడని ప్రచారంలో ఉంది. ఆయనకు వయసు మీద పడడంతో ప్రస్తుతం కుమారులు చేతన్, రోణక్ వ్యాపారాలు చూసుకుంటున్నారు. వారితో వైసీపీ ముఠా సంప్రదింపులు జరిపి వంద కోట్ల రూపాయలు వైట్‌గా మార్చి ఇవ్వాలని కోరింది. అనిల్ చోఖ్రాతో పూనాభాయ్ కుమారులు వ్యవహారం నడిపించారు.

హైకోర్టుకు 'పరకామణి' నివేదిక

సీల్డ్ కవర్‌లో అందించిన సీఐడీ

- హైకోర్టు విచారణ ఎల్లుండికి వాయిదా

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి పరకామణిలో చోరీ కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్న వ్యవహారంపై దర్యాప్తు చేసి, నివేదికను సీఐడీ మంగళవారం సీల్డ్ కవర్‌లో హైకోర్టు ముందు ఉంచింది. ఆ నివేదికను హైకోర్టు రిజిస్ట్రార్(జ్యుడీషియల్)వద్ద దాఖలు చేసినట్టు తెలిపింది. అలాగే నిందితుడు రవికుమార్ ఆస్తుల పై దర్యాప్తు చేసి నివేదిక సమర్పించామని ఏసీబీ తరఫు స్టాండింగ్ కౌన్సిల్ కోర్టుకు నివేదించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్, ఆ నివేదికలను తమ పరిశీలన నిమిత్తం కోర్టు ఆఫీసర్‌కు అందజేయాలని రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌ను ఆదేశించారు. సీఐడీ నివేదికను తమకు అందజేసేలా ఆదేశాలు ఇవ్వాలన్న రవికుమార్ తరఫు సీనియర్ న్యాయవాది అభ్యర్థనను తోసిపుచ్చారు. తదుపరి విచారణను ఈనెల ఐదో తేదీకి వాయిదా వేశారు. టీటీడీ పరకామణిలో జరిగిన చోరీకి సంబంధించిన నమోదైన కేసును టీటీడీ బోర్డు తీర్మానం, ఈవో అనుమతి లేకుండానే 2023 సెప్టెంబరు 9న లోక్ అదాలత్ వద్ద ఏవీఎస్‌వో వై.సతీశ్ కుమార్....రవికుమార్‌తో రాజీ చేసుకున్న వ్యవహారం సమగ్రంగా దర్యాప్తు చేయాలని సీఐడీని హైకోర్టు ఆదేశించింది. అలాగే పరకామణిలో చోరీకి పాల్పడిన రవికుమార్, ఆయన కుటుంబ సభ్యుల స్థిర-చర ఆస్తులు, బ్యాంకు ఖాతాలను పరిశీలించడంతోపాటు, వారు ఆ ఆస్తులు వారి ఆదాయానికి తగ్గట్లే ఆర్జించారా? అనే కోణంలో లోతైన దర్యాప్తు చేయాలని ఏసీబీని ఆదేశించింది. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పాణిని సోమయాజి వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తు నివేదికను సీల్డ్ కవర్‌లో రిజిస్ట్రార్ జ్యుడీషియల్ వద్ద దాఖలు చేశామన్నారు. ఏసీబీ స్టాండింగ్ కౌన్సిల్ సీతిరాజు శ్యామ్ సుందర్ స్పందిస్తూ...రవికుమార్ ఆస్తుల పై దర్యాప్తు జరిపి నివేదికను కోర్టు ముందు ఉంచామని తెలిపారు. రవికుమార్ తరఫున సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ... సీఐడీ 156 పేజీలతో నివేదిక దాఖలు చేసినట్లు, 40 మంది సాక్షులను విచారించినట్లు టీటీడీ చైర్మన్‌కు చెందిన ఓ టీవీ చానల్ స్క్రోలింగ్ వేసిందని, ఆ నివేదికను తమకు కూడా అందజేసేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఈ అభ్యర్థనను న్యాయమూర్తి తోసిపుచ్చారు. ఆ నివేదిక నిందితుడి కోసం కాదన్నారు. ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధర రావు వాదనలు వినిపిస్తూ.... వ్యాజ్యంలో తమను ప్రతివాదిగా చేర్చి, వాదనలు వినిపించేందుకు అవకాశం ఇవ్వాలంటూ ఇంప్లీడ్ పిటిషన్ వేశామని, దానిని అనుమతించాలని కోరారు. కేసు విచారణలో కోర్టుకు సహాయకారీగా ఉంటామన్నారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ, అవసరమైతే తప్పనిసరిగా మీ సహకారం తీసుకుంటామని తెలిపారు.



ఏపీ 'నవోదయ'ల్లో 42 శాతం పోస్టులు ఖాళీ

న్యూఢిల్లీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏపీలోని 15 నవోదయ విద్యాలయాల్లో 407 ఉపాధ్యాయ పోస్టులకుగాను 171 పోస్టులు(42శాతం) ఖాళీగా ఉన్నాయని కేంద్ర విద్యా సహాయ మంత్రి జయంత్ చౌదరి సమాధానం ఇచ్చారు. అలాగే 322 బోధనేతర సిబ్బంది పోస్టులకు 155 (48శాతం) పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. లోక్‌సభలో ఎంపీ పుట్టా మహేష్ అడిగిన ఒక ప్రశ్నకుసమాధానమిస్తూ.. ఆంధ్రప్రదేశ్‌లోని 26 జిల్లాలకుగాను ఏలూరు సహా 13 జిల్లాల్లో నవోదయ విద్యాలయాలు ఉన్నాయని మిగిలిన జిల్లాల్లో ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. రాష్ట్రంలో 1,118 గిరిజన గ్రామాలు సహా అన్ని ప్రాంతాల్లోనూ పాల ధరలను స్థానిక సహకార, ప్రైవేటు డెయిరీ సంస్థలే నిర్ణయిస్తున్నాయని మరో ప్రశ్నకు కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్ సమాధానమిచ్చారు.

ఏపీకి 1.94 లక్షల కోట్ల కేసీసీ రుణాలు

ఏపీలో గత 3 ఆర్థిక సంవత్సరాల్లో కలిపి మొత్తం 1.04 కోట్ల కిసాన్ క్రెడిట్ కార్డ్ (కేసీసీ) రుణ ఖాతాలు వ్యవసాయ పనుల కోసం ఆర్థిక సహాయం పొందాయని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ సహాయ మంత్రి రామనాథ్ ఠాకూర్ వెల్లడించారు. ఈ మూడేళ్లలో మొత్తం రూ1.94 లక్షల కోట్లకు పైగా రుణాలు కేసీసీల ద్వారా మంజూరయ్యాయని అని తెలిపారు.

నెల్లూరు జిల్లాలో టెక్స్‌టైల్ పార్క్‌కు ఆమోదం

ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ పార్క్స్ పథకం కింద 2015లో ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో తారకేశ్వర టెక్స్‌టైల్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటుకు కేంద్రం ఆమోదించిందని కేంద్ర జౌళి సహాయ మంత్రి పబిత్ర మార్గరెటా లిఖితపూర్వకంగా తెలిపారు. ఎంపీ వేమిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు.

రేవంత్ క్షమాపణ చెప్పాలి: మాధవ్

విజయవాడ సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): హనుమంతుడు బ్రహ్మచారి అంటూ తెలంగాణ సీఎం చేసిన వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. దేవుళ్లను తూలనాడిన రేవంత్‌రెడ్డి హిందూ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేపీ రాష్ట్ర చీఫ్ పి.వి.ఎస్.మాధవ్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ వ్యాఖ్యలతో ఆయన హిందూ వ్యతిరేకి అని రుజువైందన్నారు.

వైసీపీ నాయకుడి రాసలీలలు

- పొరపాటున తానే మీడియా వాట్సాప్ గ్రూప్‌లో పోస్టింగ్



పట్నం ఫణీంద్ర

నార్పల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా నార్పల మండల కేంద్రానికి చెందిన వైసీపీ నాయకుడు పట్నం ఫణీంద్ర ఓ వివాహితతో రాసలీల జరుపుతూ తీసుకున్న వీడియోను తానే పొరపాటున ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా గ్రూపులో పోస్టు చేశాడు. అరగంటపాటు ఆ విషయాన్ని గమనించకపోవడంతో వీడియో సోషల్ మీడియాకు ఎక్కి వైరల్ అవుతోంది. మహిళతో ఏకాంతంగా గడిపిన సమయంలో ఫణీంద్ర స్వయంగా వీడియోను రికార్డు చేసుకున్నట్లు స్పష్టమవుతోంది. ఫణీంద్ర.. జగన్ దినపత్రికలో సుమారు ఆరేళ్లపాటు నార్పల మండల విలేకరిగా పని చేశాడు. మూడు నెలల క్రితం మానేసి, పూర్తిస్థాయిలో వైసీపీలో చేరాడు. పార్టీ బీసీ సెల్ శింగనమల నియోజకవర్గ అధ్యక్షుడిగా ఉన్నాడు. వీడియో వైరల్ కావడంతో ఫణీంద్రను వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సాకే శైలజనాథ్, రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి పిలిపించుకుని తీవ్రస్థాయిలో మందలించినట్లు సమాచారం. అయితే ఆ వీడియో తనది కాదని, మార్ఫింగ్ చేసి తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఫణీంద్ర వివరణ ఇచ్చాడు. ఈ విషయం గురించి తమకు ఫిర్యాదు అందలేదని నార్పల ఎస్ఐ సాగర్ తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో అనిల్ చోఖ్రాకు వైద్య పరీక్షలు

విజయవాడ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న అనిల్ చోఖ్రాకు వైద్య పరీక్షల కోసం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి జైలు అధికారులు మంగళవారం తీసుకువచ్చారు. వైద్యులు అతనికి ఎటువంటి అనారోగ్యాలు లేవని వెల్లడించారు. దీంతో వైద్య పరీక్షల అనంతరం చోఖ్రాను జైలుకు తరలించారు.

గంజాయి డాన్ కామాక్షి ఇంట్లో కత్తి

- పాత ఫ్రిజ్‌లో బయటపడ్డ మారణాయుధం



పాత ఫ్రిజ్‌లో దొరికిన కత్తి



స్థానికులు నేలమట్టం చేసిన గంజాయి డాన్ కామాక్షి, ఆమె అనుచరుల ఇళ్లు

నెల్లూరు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గంజాయి డాన్ అరవ కామాక్షి ఇంట్లో మారణాయుధం బయటపడింది. పాత ఫ్రిజ్‌లో పొడవాటి కత్తి కనిపించింది. కామాక్షి ఆగడాలపై స్థానికులు కొందరు ఆగ్రహించి సోమవారం రాత్రి ఆమె ఇంటిని, అనుచరుల ఇళ్లను నేలమట్టం చేశారు. విషయం తెలుసుకుని మంగళవారం అక్కడకు వెళ్లిన పోలీసులకు.. కత్తి కంటపడింది. తమిళనాడుకు చెందిన కామాక్షి నెల్లూరు బోడిగాడితోట వద్ద తన నేర సామ్రాజ్యానికి పునాది వేసుకుంది. భర్త జోసెఫ్, తమ్ముడు జేమ్స్, చెల్లెలు భర్త, అనుచరులతో గ్యాంగ్ తయారు చేసుకుని, గంజాయి విక్రయాలను ప్రారంభించింది. 2022లో అప్పటి కలెక్టరు రోడ్డు విస్తరణలో భాగంగా బోడిగాడితోట వాసులందరికీ రూరల్ మండలంలోని కల్లూరుపల్లి వద్దనున్న ఆర్డీటీ కాలనీలో ఇళ్లు కేటాయించారు. కామాక్షితోపాటు ఆమె అనుచరులకూ ఇళ్లు వచ్చాయి. కానీ ఆమె బోడిగాడితోటలోనే ఉంటూ, నేరాలకు వ్యూహాలు పన్నేది. గంజాయి దిగుమతి, ఎగుమతికి మాత్రం ఆర్డీటీ కాలనీని అడ్డాగా చేసుకుంది. తన ఆగడాలను అడ్డుకున్నందుకే సీపీఎం నాయకుడు పెంచలయ్యను హత్యచేసి.. తమ గ్యాంగ్ జోలికి వచ్చిన పోలీసులపైన కూడా దాడులు చేయించిందని చెబుతున్నారు. పెంచలయ్య హత్యతో కామాక్షి నేర సామ్రాజ్యం వెలుగు చూసింది. గంజాయిని ప్యాకెట్లలో నింపి కల్లూరుపల్లిలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన కొందరు విద్యార్థులకు కామాక్షి అమ్మేదని స్థానికులు తెలిపారు. ఆటో డ్రైవర్లు, అసంఘటిత కార్మికులకు కూడా గంజాయి ప్యాకెట్లు అమ్మేదని చెప్తున్నారు. గత నెల హౌసింగ్‌బోర్డు కాలనీ ఎంఐజీలో ఒంటరి వృద్ధ మహిళ రుక్మిణమ్మ ఇంట్లోకి చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలోని 12 సవర్ల బంగారు ఆభరణాలు అపహరించుకు వెళ్లారు. ఈ ఘటనలోనూ కామాక్షికి సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. రైల్వే ఆస్తులను అనుచరగణంతో చోరీ చేయించి, తనకున్న పాత సామాన్ల దుకాణం ద్వారా బయట ప్రాంతాలకు కామాక్షి అమ్మేదని పోలీసు రికార్డుల ద్వారా తెలుస్తోంది.

ఉల్లి బస్తాల మాటున గోవుల అక్రమ రవాణా



లారీకి చిన్నపాటి మార్పులు చేసి ఉల్లిగడ్డల బస్తాల లోడ్ మాటున 13 గోవులను అక్రమంగా తరలిస్తున్న లారీని తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. పంతంగి టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేస్తుండగా విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌లోని బహదూర్‌పూరకు వెళ్తున్న వాహనంలో గోవుల అక్రమ రవాణాను గుర్తించినట్లు ఎస్ఐ నర్సిరెడ్డి తెలిపారు. ఏపీకి చెందిన డ్రైవర్ భాస్కరరావుని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు.

- చౌటుప్పల్ రూరల్, ఆంధ్రజ్యోతి

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.